thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 106 | కరీంనగర్ బుధవారం, 25 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.

# ఏం చేస్తున్నారో అర్థం అవుతోందా?

# ఏం తమాషాలా..!




## మంత్రులు, నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి అసహనం!

హైదరాబాద్ : వర్గవిభేదాలు పక్కన పెట్టి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, నేతలకు స్పష్టం చేశారు. నేడు జరిగిన పీఏసీ మీటింగ్ లో మంత్రుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మెల్యేలపై కూడా రేవంత్ ఫైర్ అయినట్లు సమాచారం. అంతర్గతంగా మాట్లాడుకోవాల్సిన పార్టీ విషయాలను ప్రెస్ మీట్లు పెట్టి, సభల్లో మాట్లాడడం ఏంటని ఆయన ఫైర్ అయ్యారు. గొడవలతో పార్టీకి నష్టం చేస్తామంటే ఊరుకోనని వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు చేస్తే బాగుండదని తేల్చిచెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలవాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. పొన్నం ప్రభాకర్ సారథ్యంలో హైదరాబాద్ జిల్లా నేతలు ఇందు కోసం పని చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.

**సరిగా పని చేయకుంటే ఎన్నికల ముందు తొలగిస్తాం.. పార్టీ నేతలకు రేవంత్ రెడ్డి హెచ్చరిక...** కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా పదవులు వస్తాయని ఇప్పుడున్న చాలా మంది నేతలు కింది స్థాయి నుంచి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైందని పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఇవాళ గాంధీభవన్ లో పీఏసీ మీటింగ్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రచించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంతో మంది పదవుల కోసం పోటీ పడ్డారన్నారు. మీరంతా పార్టీ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వం అనేక సక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, ఈ దేశంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. కార్యకర్తల ఎన్నికలు (స్థానిక సంస్థల ఎన్నికలు) రాబోతున్నాయి. మన కార్యకర్తలను కష్టపడి గెలిపించుకోవాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని పార్టీ నిర్మాణంలో కార్యకర్తలుక్రియాశీల పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం పని చేయనివాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

**పదేళ్లు నాదే బాధ్యత:** ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని సీఎం చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందని 2023 నుంచి 2033 వరకు పదేళ్లు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో ఉండబోతున్నదన్నారు. ఈ పదేళ్లు పార్టీ కోసం పని చేసే వారిని కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. పదేళ్లు అధికారం నడిపించే వరకు నేను బాధ్యత తీసుకుంటా. ఆ తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి నడిపించాల్సిన బాధ్యత పార్టీలోని యువతరం తీసుకోవాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కార్యకర్తల చేతుల్లో ఉందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు అందుబాటులోకి తేవాలన్నారు. పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్నీ పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతో పాటు కలగణన చేసే పరిస్థితి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. త్వరలో డీలిమిటేషన్ జరగబోతున్నదని సీట్లు పెరగబోతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి. జమిలీ ఎన్నికలు తేస్తామని చెబుతున్నారని ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ 18 నెలలో గోల్డెన్ పీరియడ్ అని అన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడొద్దు..

హైదరాబాద్, జూన్ 24: గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది.

తామే అభ్యర్థుల మంటూ కొంతమంది తేల్చిచెబుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని చెప్పారు. అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని సీఎం ఆదేశించారు. ఏ ఎన్నిక జరిగినా ఒకే ప్రక్రియ ప్రకారం అభ్యర్థి ఎంపిక ఉంటుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కూడా అదే ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఇక.. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతోందని వారు చెప్పుకొచ్చారు.

**గొర్రెలతో నిరసనపై సీఎం సీరియస్...** మరోవైపు నిన్న గాంధీ భవన్‌లో గొర్రెలతో నిరసన చేయడంపై సీఎం చాలా సీరియస్ అయ్యారు.




గాంధీ భవన్‌లో ఇలాంటివి ఎంటర్ టైన్ చేయొద్దని ఆదేశించారు. నిరసనకు ఓ పరిమితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అందరి అభిప్రాయం తీసుకుంటుందని.. అందరినీ గౌరవిస్తుందన్నారు. ఇది పార్టీ ఆఫీసా ఇంకా ఏమైనానా అని గాంధీభవన్ ఆఫీస్ బేరర్స్‌ను ప్రశ్నించారు. ఇష్టా రీతిలో నిరసనలు చేస్తుంటే ఏం చేస్తున్నారు అని సీఎం ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం హెచ్చరించారు.

**ఇంచార్జ్ మంత్రులపై అసంతృప్తి...** అలాగే ఇంచార్జ్ మంత్రుల పనితీరుపై కూడా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే భాధ్యత ఇంచార్జ్ మంత్రులకు అప్పగించినా చేయడం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇంచార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల దగ్గర ఫండ్స్ పెట్టామని, వాటిని సరిగ్గా ఉపయోగించడం లేదని పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్.. బీఆర్ఎస్‌పై ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను ఇవాళ(మంగళవారం) సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి బాధితుడిని తనేనంటూ ఈటల ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, డ్రైవర్లు, గన్‌మెన్‌లు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపణలు చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికతో పాటు అంతకుముందు, తర్వాత కూడా ఫోన్ ట్యాపింగ్‌కి గురైనట్లు సిట్ గుర్తించింది.

అలాగే.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సిట్ అధికారులకి ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2024 వరకు తన ఫోన్ సంభాషణలను రహస్యంగా తెలుసుకున్నారని ఫిర్యాదులో మాధవరం కృష్ణారావు తెలిపారు. కుట్ర పూరితంగా కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేసినట్లు సిట్‌కి తెలంగాణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెజండ్ల కిషోర్ బాబు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను సిట్ అధికారులకి కిషోర్ బాబు ఇచ్చారు.

## ఆమ్రపాలికి క్యాట్‌లో ఊరట.. మళ్లీ తెలంగాణకే కేటాయింపు



దిల్లీ: తెలంగాణ నుంచి రిలీవై ఏపీ క్యాడర్‌లో చేరిన ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలికి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.

గతంలో తెలంగాణలో పని చేసిన ఆమె.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులతో నాలుగు నెలల క్రితం ఏపీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకు కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.




# 'స్థానికం' ఇప్పట్లో లేనట్టే..!

## అడ్డుపడుతున్న మూడు కారణాలు!!

హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ ఎస్, బీజేపీ, ఇతర పక్షాలు ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. ప్రధానంగా మూడు కారణాలు అడ్డు పడుతున్నాయని తెలుస్తోంది. తాజాగా సోమవారం ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగినప్పుడు ప్రభుత్వం కీలక విషయాన్ని వెల్లడించింది. ఎన్నికలు ఇప్పట్లో జరిపే ఉద్దేశం ఉన్నా.. ఇప్పట్లో జరపలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం కుల గణన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని.. పూర్తిస్థాయి లో నివేదిక రావాల్సి ఉందని తెలిపింది. అయితే.. కోర్టు ప్రభుత్వాన్ని సీరియస్‌గా ప్రశ్నించింది. "ఇంకా ఎన్నాళ్లు ఈ ప్రక్రియను సాగదీస్తారు?" అని నిలదీసింది. దీంతో మరో నెల రోజులు అయినా తమకు సమయం పడుతుందని.. అప్పటి వరకు సమయం ఇవ్వాలని కోరింది. మరోవైపు.. ఎన్నికల కమిషన్ అధికారులు కూడా తమకు ఏర్పాట్లు చేసేందుకు, నిర్వహించేందుకు కనీసంలో కనీసం 60 రోజులు(రెండు మాసాలు) పడుతుందని.. అప్పటి వరకు సమయం ఇవ్వాలని కోరింది. దీనిపై హైకోర్టు స్పందించలేదు. వాస్తవానికి గత ఏడాది ఫిబ్రవరి 1నే గ్రామ స్థాయి స్థానిక సంస్థలకు కాలం ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయితీలకు చెందిన సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తాత్సారం చేస్తోందని.. ఈ నేపథ్యంలో తమను పొడిగించాలని.. కోర్టును కోరారు. లేకపోతే, వెంటనే ఎన్నికలు పెట్టేలా అయినా.. సర్కారును ఆదేశించాలని వారు కోరారు. ఈ పిటిషన్లను కలిపి విచారిస్తున్న కోర్టులోనూ వాయిదాలపై వాయిదాలు పడుతున్నాయి. దీంతో పంచాయతీలు, గ్రామాల్లో ఎటుచూసినా ఈ చర్చే కనిపిస్తోంది. వినిపిస్తోంది. ఇక, ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంపై ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పట్లో ఎన్నికలకు అవకాశం కనిపించడంలేదని తెలుస్తోంది.

**కారణం ఏంటి?...** అయితే.. అసలు ఎన్నికల విషయంపై కాంగ్రెస్ సర్కారు వెనుకంజ వేయడానికి పైకి చెబుతున్న కుల గణన మాత్రమే కారణం కాదని తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా నిధులు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి.

రైతుల నాడిని ప్రభుత్వం పసిగట్టాల్సిన అవసరంఉంది దీనికితోడు ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం కూడా.. చర్చకు వస్తోంది. ఈ రెండు కీలక అంశాలు.. పంచాయతీ ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయి. మరోవైపు.. సర్కారుపై పూర్తిస్థాయిలో సంతృప్తి వచ్చిందా? లేదా? అనేది కూడా ప్రభుత్వానికి సందేహంగా మారింది.

ఈ క్రమంలోనే ప్రజల్లోకి వెళ్లాలని నాయకులకు మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. వెరసి.. ఎన్నికల వాయిదాకు పలు కారణాలు కనిపిస్తున్నాయి.




హైదరాబాద్: రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు. "మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. " కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం" అని సీఎం అన్నారు.




## థాంక్యూ ట్రంప్.. కాల్పుల విరమణను అంగీకరిస్తున్నాం: నెతన్యాహు కీలక ప్రకటన

పశ్చిమాసియాలో యుద్ధం చల్లారినట్లే కన్పిస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే టెహ్రాన్ కాల్పుల విరమణను మొదలుపెట్టగా.. సీజ్‌ఫైర్‌ను తామూ అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుంచి అణుముప్పు తొలగిపోయిందని నెతన్యాహు అందులో పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

"ఆపరేషన్ రైజింగ్ లయన్ అన్ని లక్ష్యాలను ఇజ్రాయెల్ సాధించింది. ప్రత్యర్థి (ఇరాన్) నుంచి పొంచి ఉన్న రెండు ప్రధాన ముప్పులను (అణు, బాలిస్టిక్ క్షిపణులు) తొలగించాం. ఆపరేషన్‌లో భాగంగా టెహ్రాన్ గగనతలాన్ని ఐడీఎఫ్ పూర్తిగా తమ అధీనంలోకి తీసుకోగలిగింది. ఆ దేశ మిలిటరీ నాయకత్వాన్ని తీవ్రంగా దెబ్బకొట్టింది. ఇరాన్ ప్రభుత్వానికి చెందిన డజన్ల కొద్దీ ప్రాంతాలను ధ్వంసం చేసింది. మరో సీనియర్ అణు శాస్త్రవేత్తను కూడా హతమార్చింది. టెహ్రాన్ గుండెను ముక్కలు చేసింది" అని ఇజ్రాయెల్ పీఎంఓ కార్యాలయం తమ ప్రకటనలో వెల్లడించింది. "ఇజ్రాయెల్‌కు రక్షణపరంగా సహకారం అందించడమే గాక.. రణరంగంలోకి స్వయంగా అడుగుపెట్టి ఇరాన్ నుంచి పొంచి ఉన్న అణు ముప్పును తొలగించడంలో సాయం చేసిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. లక్ష్యాలు నెరవేరడంతో పాటు ట్రంప్ చేసిన సమన్వయంతో ద్వైపాక్షిక కాల్పుల విరమణ ఒప్పందం ప్రతిపాదనను మేం పూర్తిగా అంగీకరిస్తున్నాం" అని నెతన్యాహు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతిచర్య మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్‌ను హెచ్చరించింది. ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ట్రంప్ తొలుత పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తొలుత టెహ్రాన్ కాల్పుల విరమణ పాటిస్తుందని, ఆ తర్వాత ఇజ్రాయెల్ మొదలుపెడుతుందని ఆయన పేర్కొన్నారు. దీంతో యుద్ధానికి ముగింపు లభిస్తుందని తెలిపారు. ఈ ప్రకటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య దాడులు జరిగాయి. ట్రంప్ పోస్ట్ చేసిన ఆరు గంటల తర్వాత.. కాల్పుల విరమణను మొదలుపెట్టినట్లు టెహ్రాన్ ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా నెతన్యాహు కూడా దీన్ని అంగీకరిస్తున్నట్లు వెల్లడించారు.




హైదరాబాద్: సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరఫున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ హరిచందన, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక, జలమండలి అధికారులు పాల్గొన్నారు.




ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కోసం టెహ్రాన్‌ను ట్రంప్ ప్రాధేయపడ్డారట. ఈ ఒప్పందంపై నాయకులు, మీడియా నుంచి పొంతన లేని ప్రకటనలు.. కథనాలు వెలువడుతున్నాయి. తాజాగా ఇరాన్ ప్రభుత్వ రంగ మీడియా ఛానెల్ ఐఆర్ఐఎన్ఎన్ కొత్త ప్రకటన చేసింది. ఖతార్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విజయవంతంగా దాడి చేయగానే.. ఇజ్రాయెల్‌తో బలవంతంగా కాల్పుల విరమణ అంగీకరింపజేశారని పేర్కొంది. ఈ దాడి అనంతరం ఒప్పందం కోసం ట్రంప్ ఇరాన్‌ను ప్రాధేయపడ్డారని వెల్లడించినట్లు బీబీసీ పర్షియా పేర్కొంది. ఈసందర్భంగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్, ఆర్మీ, ఇరాన్ వాసుల ప్రతిఘటనను అభినందించింది. మరోవైపు ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటన తర్వాత కూడా ఇరాన్ దళాలు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ విషయాన్ని ఐడీఎఫ్ కూడా ధ్రువీకరించింది. తాజాగా జరిగిన క్షిపణి దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ వాసులు చనిపోయినట్లు ఎమర్జెన్సీ సర్వీస్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. నేటి తెల్లవారుజామున ఇజ్రాయెల్-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ పెట్టిన ట్రూత్ సోషల్ మీడియా పోస్టు సంచలనం సృష్టించింది. "ఇప్పటినుంచి దాదాపు ఆరు గంటల తర్వాత ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పరం తుదివిడత దాడులు పూర్తి చేసుకొని గాయపడిన తర్వాత కాల్పుల విరమణకు అంగీకరించాయి. తొలుత అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత (అమెరికా కాలమానం ప్రకారం) ఇరాన్ కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 12 గంటలకు నుంచి ఇజ్రాయెల్ కాల్పుల విరమణను మొదలుపెడుతుంది. అలా 12 గంటలు ముగిసిన తర్వాత 12 రోజుల యుద్ధానికి అధికారిక ముగింపు లభిస్తుంది.

ఈ ఒప్పందం అమల్లో ఉన్న వేళ పరస్పరం శాంతియుతంగా, గౌరవ ప్రదంగా వ్యవహరించాలి" అని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ మాత్రం ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తాము కాల్పుల విరమణ పాటిస్తామని చెబుతోంది. ఇక ట్రంప్ ప్రకటించిన 6 గంటల గడువు కూడా ముగిసింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై టెహ్రాన్ మరిన్ని క్షిపణులు ప్రయోగించినట్లు వార్తలొస్తున్నాయి.

## ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాప్ చేశారు: ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి" అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

**భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్ చేశారు...** ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. "భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయింది"అని చెప్పారు.

## పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు



హైదరాబాద్: క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఇవాల్టికి (మంగళవారం)వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

## సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. "రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.

## ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చిన బాలిక

హైదరాబాద్: జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి హత్య జరిగింది. ప్రేమకు అడ్డు చెప్పిందనే కారణంతో కన్నతల్లిని పదో తరగతి చదివే కుమార్తె ప్రియుడితో కలిసి హతమార్చింది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడితో ప్రేమాయణం సాగించిన బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. తన కుమార్తె కనిపించడం లేదని తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గత రాత్రి ప్రియుడితో కలిసి బాలిక ఇంటికి వచ్చింది. నిద్రిస్తున్న తల్లి అంజమ్మ గొంతు నులిమి, కత్రతో తలపై కొట్టి చంపినట్లు సమాచారం. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.




## రైల్వే టికెట్ ఛార్జీల పెంపు.. జులై 1 నుంచి అమల్లోకి!

ట్రైన్ టికెట్ ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. జులై 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. నాన్ ఏసీ మెయిల్/ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధర కిలోమీటర్‌కు 1 పైసా, ఏసీ తరగతి టికెట్ ధర కిలోమీటరుకు 2 పైసలు చొప్పున పెరగనున్నాయి. రైల్వే వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్లమీడియా వెబ్‌సైట్లలో వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. చాలా ఏళ్ల తర్వాత రైల్వే టికెట్ ధరలు సవరిస్తుండడం గమనార్హం. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకు సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు. 500 కిలోమీటర్లు దాటితే కిలోమీటరుకు ఒక పైసా చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్‌కు సంబంధించి రైల్వే శాఖ ఇటీవలే కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆధార్ అథంటికేషన్ ఉన్న వారికి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. జులై 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. అదే రోజు నుంచి టికెట్ ధరల పెంపు కూడా అమల్లోకి రానున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. నెలవారీ సీజన్ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పూ ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అవయవ దానాలపై అవగాహన అవసరం

## జూన్ 25...ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం



సమకాలీన వైద్యశాస్త్రం సాధించిన అద్భుతమైన ఆవిష్కరణ అవయవ మార్పిడి పద్ధతి. అవయవ మార్పిడి ద్వారా దాతల శరీరం నుంచి సేకరించిన అవయవాలను అవయవ లోపాలతో బాధపడుతున్న రోగులకు అమర్చి, వారికి స్వస్థత కలిగించే విధానం నానాటికీ పురోగతి సాధిస్తున్నది. అవయవ దాతల సంఖ్య కూడా అవసరాలకు తగినంతగా కాకపోయినా, నెమ్మదిగా అధికం అవుతున్నది. అన్ని దానాల కన్నా అవయవ దానం గొప్పదనే నగ్న సత్యాన్ని దాతలు అర్థం చేసుకుంటున్నారు. మానవుడు మృతి చెందాకే శరీరం నుంచి అవయవాలు సేకరిస్తారు కనుక, చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే సదావకాశాన్ని అవయవదానం కల్పిస్తున్నదన్న వాస్తవం గురించి అవగాహన దాతలకు ఏర్పడుతున్నది. దాతల మరణంతో వారి వారి శరీరాలతో పాటే శరీర అవయవాలు కనుమరుగు కాకుండా, వారి అవయవాలు ఇతరులకు ఉపయోగ పడడంలో, అంతకు మించిన తృప్తి మరొకటి ఉండదు. ఈ పరమ సత్యాన్ని గ్రహించి, ప్రస్తుతం ఎందరో తమ అవయవాలకు దానం చేయడానికి ముందుకొస్తున్నారు. ఈ అవగాహన పెంచేందుకే జూన్ 25న ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం జరుపుకొంటారు. అవయవ మార్పిడితో ఎవ్వరైనా కొత్త జీవితాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. మరణించిన వ్యక్తి జీవితం అక్కడితో ఆగకుండా, మరణించిన వ్యక్తి మరికొంత మందికి ప్రాణమిచ్చి జీవిస్తూనే ఉన్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు అవయవ దానాలను అమర్చి వారి ప్రాణాలను కాపాడు తున్నారు. అవయవ మార్పిడి వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడటం సాధ్యం అవుతుంది. కళ్లు, మూత్ర పిండాలు, ఊపిరి తిత్తులు, చర్మం, ఎముక, గుండె కవాటాలు, కార్నియో, సిరలు ఇలా ఎన్నో అవయవ దానాల వల్ల మార్పిడి చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయ్యేవారి శరీరాలను వెంటనే దానం చేస్తే ఇతరులకు అమర్చవచ్చు. ఒక్కదాతతో 8 మంది ప్రాణాలను రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షలకుపైగా ప్రజలు వారి ముఖ్య అవయవాల వైఫల్యం కారణంగా మరణిస్తున్నట్లు ఓ నివేదిక తెలుపు తున్నది. కాలేయ వ్యాధి కారణంగా 2లక్షల మంది మరణిస్తున్నారు. గుండె జబ్బుల కారణంగా 50,000 మంది గుండెలు ఆగి పోతున్నాయి. అంతే కాకుండా, 1.5లక్షల మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు, కాని వారిలో 5,000 మందికి మాత్రమే దాతల సహకారం లభిస్తున్నది. బతికున్నప్పుడు కూడా కొన్నింటిని దానం చేయొచ్చు..కిడ్నీ, ఎముకమజ్జ, రక్తం, కాలేయంలో కొంత భాగం, ఊపిరి తిత్తుల్లో కొంతభాగం, పాంక్రియాస్ లో కొంతభాగం ఇవ్వొచ్చు. అయితే ఇందులో ఎవరెవరికి ఏవేవీ అమరుతాయో వాటిని మాత్రమే వైద్యులు అమర్చడానికి నిర్ణయిస్తారు. రక్తం గురించి... అది వారి గ్రూపులను బట్టి ఏ వ్యక్తికి సరిపోతుందో వారికే దానం చేస్తారు. ఎముకమజ్జ, కాలేయం, ఊపిరితిత్తులు వంటివి కొన్ని రక్త సంబంధీకులకు చాలా పనికొస్తాయి. సహజ మరణం చెందిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కళ్లు, గుండె వాల్వ్ లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు. అదే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, చిన్నపేగు, స్వరపేటిక, చేతులు, యుటెరస్, అండాలు, కళ్లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు, కాలి వేళ్లు, చేతి వేళ్లు, మధ్య చెవి ఎముకలు. అవయవాలు అమర్చేందుకు ఎంత సమయం పడుతుందంటే.. ఊపిరి తిత్తులు, గుండె 6 గంటలలోపు, మూత్రపిండాలు 48 గంటల లోపు, నేత్రాలు 4 గంటలలోపు, కాలేయం 12 గంటల లోపు, క్లోమం 24 గంటల లోపల సమయం కావాలి. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ అవయవ దానాలు చేయొచ్చు. వయస్సు, ఆరోగ్యం, జాతితో సంబంధం లేకుండా అందరూ తమను తాము అవయవ కణజాల దాతలుగా భావించవచ్చు. దాతగా ఉండటానికి...వయసు ఏదైనా కొత్తగా పుట్టినవారు, సీనియర్ సిటిజన్లు కూడా అవయవ దాతలు కావచ్చు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి కూడా మరణం తరువాత అవయవాలను లేదా కణ జాలాలను దానం చేయ గలుగుతారు. వైద్యులు అవయవాలను పరిశీలించి, దానం చేయడానికి తగినదా కాదా అని నిర్ణయిస్తారు. స్వచ్ఛంధ సంస్థలు, కొంత మంది అభ్యుదయ వాదులు మాత్రమే అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ప్రజల్లో ఇంకా చైతన్యం, అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. అవయవ దానాలు, వాటి మార్పిడిలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అత్యవసర స్థితిలో పౌర హక్కుల కాలరాత.... పత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు

## జూన్ 25, 1975... ఎమర్జెన్సీ విధించిన దినం సందర్భంగా...

ఆంగ్లేయుల పరిపాలన నుండి విముక్తి పొంది స్వాతంత్ర్యం సంపాదించుకుని ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నాక, 28ఏళ్లకే సదరు స్వాతంత్ర్యాన్ని దేశ ప్రజలు కోల్పోవాల్సి వచ్చింది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక పై ప్రత్యర్థి రాజ్ నారాయణ్ చేసిన న్యాయ పోరాటంలో ఇందిర కోర్టు తీర్పు ద్వారా ఎన్నిక చెల్ల నేరదని తీర్పు వచ్చాక, ఏకపక్షంగా రాష్ట్రపతి ద్వారా దేశంలో ఎమర్జెన్సీ ప్రకటిత మయింది. ఎమెర్జెన్సీ సమయంలో నియంత ఇందిరాగాంధీ తన ప్రత్యర్థులను జైలుపాలు చేయడంతో పాటు ప్రజాస్వామ్య హక్కులను హరించి వేశారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు హరించి వేయబడ్డాయి. ప్రచార, ప్రసార మాధ్యమాలపై ఆంక్షలు అమలయ్యాయి. పత్రికలపై ముందస్తు సెన్సార్ షిప్ ప్రవేశపెట్టారు. ఏ వార్త అయినా సంబంధిత ప్రభుత్వ అధికారి ఆమోదిస్తే తప్ప ప్రచురణకు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఎన్నో పత్రికలకు నిషేధించారు.. వాటిలో కొన్ని జాగృతి (తెలుగు, హైదరాబాద్), సృజన (తెలుగు, హైదరాబాద్), ప్రజాసమస్యలు (తెలుగు, రాజమండ్రి), మెయిన్ స్ట్రీమ్ (ఇంగ్లీష్, ఢిల్లీ), జవానీ దివాని (హిందీ, ఢిల్లీ), ఆర్గనైజర్ (ఇంగ్లీష్, ఢిల్లీ), సెమినార్ (ఇంగ్లీష్, ఢిల్లీ), సాధన (గుజరాతి, అహ్మదాబాద్), భూమిపుత్ర (హిందీ, బరోడా), లోకవాణి (కన్నడ, బెంగళూరు), పాంచజన్య (హిందీ, లక్నో), ఒపీనియన్ (ఇంగ్లీష్, ముంబై) రాష్ట్ర వార్త (మలయాళం, ఎర్నాకులం), విక్రమ్ (కన్నడ, బెంగళూరు), క్వెస్ట్ (ఇంగ్లీష్, ముంబై) వంటి ఎన్నో పత్రికలు నిషేధానికి గురయ్యాయి. శంకర్ వీక్లీ లాంటి ఏకైక కార్టూన్ పత్రిక సెన్సార్ నిబంధనలతో ఏకీభవించ లేక మూసుకోవలసి వచ్చింది. పత్రికలపై సెన్సార్ షిప్ ఉండడంతో అన్ని భాషలలోనూ అజ్ఞాత పత్రికలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా చిన్న చిన్న పుస్తకాలు ముద్రించి పంపిణీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వందేమాతరం, ఎక్స్ రే, గర్జన, అంతర్వాణి, ప్రజావాణి, జనవాణి పేర్లతో అజ్ఞాత పత్రికలు ప్రచురించారు. తొలిరోజుల్లో వివిధ పేర్లతో అజ్ఞాత పత్రికలు వెలువడినప్పటికి చివరివరకు వందేమాతరం, ఎక్స్ రే.లాంటి కొన్ని పత్రికలు కొనసాగాయి. ఆర్ ఎస్ ఎస్ తో సహా అనేక సంస్థలను నిషేధించారు. క్రమశిక్షణ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులపై ఆంక్షలు, నిఘా మొదలైంది. ఇందిరాగాంధీ, ఆమె పాలనకు వ్యతిరేకంగా ఏ చిన్న వ్యాఖ్య చేసినా అరెస్ట్ చేసి జైలులో పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఇందిర కుమారుడు సంజయ్ గాంధీ పెత్తనం నడిచింది. నిర్బంధ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరిగాయి. రహదారుల విస్తరణ పేరుతో ముందస్తు నోటీసులు లేకుండా ఇళ్లను కూల్చివేశారు. ఇలా అంతటా నిర్బంధ విధానాలు కొనసాగాయి. అయితే ఈ పరిణామాలతో సాధారణ ప్రజలు భయభ్రాంతులకు గురైనప్పటికీ, ప్రతిపక్ష రాజకీయ నాయకులు, ఆర్ ఎస్ ఎస్ వంటి సంస్థలు ఇందిర నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా అజ్ఞాత ఉద్యమాన్ని నిర్వహించాయి. ప్రభుత్వ అవకతవక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చాయి. అనేక వేల మందిని నిర్బంధించినప్పటికీ దేశవ్యాప్తంగా అజ్ఞాత ఉద్యమం కొనసాగింది. ఎమర్జెన్సీ ప్రకటించి నెలరోజులు పూర్తైనప్పుడు 1975 జులై 26న ఆర్ ఎస్ ఎస్ దేశవ్యాప్తంగా వ్యక్తిగత సత్యాగ్రహాలు, గంటానాదాల కార్యక్రమాలు చేపట్టింది. దేశ వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో గంటలు మ్రోగించడం ద్వారా ప్రజలు తమ నిరసన తెలియ జేశారు. 1975 జులై 26 నుంచి పదిరోజుల పాటు వ్యక్తిగత




సత్యాగ్రహాలు జరిగాయి. అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలలో ప్రముఖులు ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేసి అరెస్ట్ అయ్యారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమపు రెండవ అంకంలో 1975 నవంబర్ 14 నుంచి 1976 జనవరి 26 వరకు సత్యాగ్రహాలు జరిగాయి. ప్రతివారం పది, 15మందితో అన్ని జిల్లాలు, చిన్నచిన్న పట్టణాలలో సత్యాగ్రహాలు చేశారు. అనేకచోట్ల మహిళా సత్యాగ్రహాలు కూడా చేపట్టారు. కరపత్రాలు పంచుతూ ప్రజలను చైతన్య పరుస్తూ అరెస్ట్ అయ్యారు. అంతకుముందు 1975 ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అజ్ఞాత కార్యకర్తలు కరపత్రాలను పంచారు. ప్రజాస్వామ్యాన్ని ఇందిరా గాంధీ అపహాస్య పాలు చేస్తున్న వైఖరిని ఆ కరపత్రాల్లో తీవ్రంగా ఎండగట్టారు. ఈ ఉద్యమంలో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నప్పటికి మొత్తం పోరాటం లోక సంఘర్ష సమితి (ఎల్ ఎస్ ఎస్) పేరుమీద లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగింది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 23 జిల్లాలకు చెందిన సుమారు 250 మందిని – మీసా' చట్టం కింద అరెస్ట్ చేశారు. సుమారు రెండున్నర నెలలపాటు జరిగిన సత్యాగ్రహాల్లో 354 స్థలాల్లో 5వేలమంది సత్యాగ్రహం చేశారు. వీరిలో 1,655మందిని అరెస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లో డి ఐ ఆర్ చట్టం కింద 703మందిని అరెస్ట్ చేయగా వీరిలో 672మంది ఆర్ ఎస్ ఎస్ పరివార సంస్థలకు చెందినవారే. దేశవ్యాప్తంగా మొత్తం 23 వేల మంది మీసా, డి ఐ ఆర్ కింద అరెస్ట్ చేశారు. ఒక లక్షా 54 వేలమంది సత్యాగ్రహం చేశారు. 21 నెలలపాటు మహా ఉధృతంగా సాగిన అజ్ఞాత ఉద్యమ ఫలితంగా 1977 మార్చి మూడవ వారంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీమతి ఇందిరా గాంధీతోసహా కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం సంభవించింది. పాత కాంగ్రెస్, భారతీయ జనసంఘ్, లోక్ దళ్, సోషలిస్ట్ పార్టీల విలీనంతో ఏర్పడిన జనతాపార్టీ లోక్ సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. అంతిమంగా ప్రజాస్వామ్యం విజయం సాధించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఎమర్జెన్సీ లో ప్రజల హక్కుల కాలరాత

## - 1975 జూన్ 25...భారత్ లో చీకటి రోజు



స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన కాలమది. ప్రజల కనీస హక్కులను కాలరాస్తూ 1975 జూన్ 25న అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన మరిచి పోలేని దినమది. ఎమర్జెన్సీ అమలైన ఆ 21 నెలలు స్వతంత్ర భారత చరిత్రలో వాస్తవంగా చీకటి రోజులు. అంతకు ముందు దేశంలో రెండు సార్లు అత్యవసర పరిస్థితి విధించారు. తొలిసారి 1962లో చైనాతో యుద్ధం, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలోనూ అత్యవరసర పరిస్థితి ప్రకటించారు. కానీ మూడవ సారి యుద్ధమేదీ లేకపోగా, 1975 జూన్ 25న నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఏకపక్షంగా వ్యవహరించి దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని విధించారు. అంతర్గత అలజడి పేరుతో ఎమర్జెన్సీ విధించిన నాటి ప్రధాని ఇందిరా గాంధీ... తన రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత వివాదస్పదమైన నిర్ణయాల్లో ఈ అత్యవసర పరిస్థితి ఒకటి. ఇందిర సిఫార్సుతో రాజ్యాంగం లోని ఆర్టికల్ 352 (1)లోని అంతర్గత అత్యవసర పరిస్థితి నిబంధన వినియో గించుకుని నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ 1975 జూన్ 25 అర్థరాత్రి 11.45 నిమిషాలకు ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. జాతీయ అత్యవసర పరిస్థితిలో ప్రజల కనీస హక్కులను కాలరాస్తూ 21 నెలల పాటు అప్రకటిత నియంతృత్వ పాలనలో దేశం చేదు అనుభవాలు అనుభూతులు, అనుభూతులను చవి చూసింది. అందుకే జూన్ 25ను భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణిస్తారు. అత్యయిక స్థితి విధించిన వెంటనే ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేశారు. జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్, చరణ్ సింగ్, మొరార్జీ దేశాయ్, నానాజీ దేశ్‌ముఖ్, మధు దండావతే, రామకృష్ణ హెగ్డే, సికందర్ భక్త్, హెచ్‌డీ దేవెగౌడ, అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, రామ్ విలాస్ పాస్వాన్, సుబ్రమణ్య స్వామి, లాలు ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్.. ఇలా ప్రతిపక్షాల నేతల తో దేశ భద్రతకు ముప్పుందంటూ వారిని జైల్లో పెట్టడం జరిగింది. ఎన్నికల వాయిదా, ప్రభుత్వ వ్యతిరేకతను అణచి వేయడం, పత్రికలపై నియంత్రించడం లాంటి చర్యలను చేపట్టారు. ఇది 1977 మార్చి 21 వరకు 21 నెలలపాటు కొనసాగింది. ఆదేశాల ద్వారా పరిపాలిస్తూ ఎన్నికలను నిలిపివేసి, పౌరహక్కులు అడ్డుకునే అధికారాన్ని రాష్ట్రపతి ద్వారా అత్యవసర పరిస్థితి ప్రధాన మంత్రికి అందించింది. అంతకు ముందు 1971 సాధారణ ఎన్నికల్లో గరబీ హటావో నినాదంతో 352 పార్లమెంటు స్థానాలను ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. మరోవైపు రాజ్యసభలోనూ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉంది. తిరుగులేని మెజార్టీతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యింది. ఇదే సమయంలో ప్రాంతీయ పార్టీలు సైతం వివిధ రాష్ట్రాల్లో బలపడటం... రాజకీయంగా, ఆర్థికంగా అవి స్వతంత్రంగా వ్యవహరించడంతో ఇందిరా గాంధీని కలవరపెట్టాయి. అలాగే మౌలికాంశాలైన ప్రాథమిక హక్కులు లాంటివి ప్రభావితం చేస్తున్నప్పుడు రాజ్యాంగాన్ని పార్లమెంటు సవరించ కూడదని ప్రఖ్యాత గోలక్ నాథ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అయితే ఈ తీర్పును రద్దుచేస్తూ ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలాంటి రాజ్యాంగ సవరణలు కూడా చేయొచ్చని నిరూపించింది. దీంతో న్యాయ వ్యవస్థను ప్రభుత్వ నియంత్రించినట్టయ్యింది. ఇందిరా గాంధీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ 1973–75 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రాజకీయ ఆందోళనలు చెలరేగాయి. వీటన్నింటిలోనూ డిసెంబరు 1973 నుంచి మార్చి 1974 వరకూ గుజరాత్‌లో సాగిన నవ నిర్మాణ్ ఉద్యమం చెప్పుకోదగ్గది. ఇది ఎంతలా అంటే రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం చినికి చినికి గాలివానగా మారి ప్రభుత్వాన్ని రద్దుచేసేదాకా సాగింది. తత్ఫలింగా ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ రాజీనామా చేయడంతో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చింది. ఇదే సమయంలో మరింత శక్తిని ఎన్నికైన పరిపాలకుని చేతిలో పెట్టాలంటే రాష్ట్రపతి పాలనే మేలు అంటూ కొంత మంది కాంగ్రెస్ నేతలు సూచించారు. ఇదే సమయంలో బిహార్‌లో కూడా అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమం తీవ్రమైంది. అధిక ధరలు, అవినీతికి వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఈ ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. జేపీ ఇచ్చిన సంపూర్ణ క్రాంతి పిలుపునకు స్పందిస్తూ దేశ వ్యాప్తంగా ప్రజలు శాంతియుత నిరసనలు కొనసాగించారు. ఎమర్జెన్సీకి ముందు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి రాయ్‌బరేలీ స్థానం ఇందిర గెలిచారని, ఆ ఎన్నికను రద్దు చేయాలంటూ ఆమె ప్రధాన ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదంటూ 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అయితే ఆమె రాజీనామా చేయకుండా హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జూన్ 25న జస్టిస్ కృష్ణ అయ్యర్ అలహాబాద్ హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తూ ఇందిర ప్రధాని పదవిలో ఉండొచ్చని, కాకపోతే తుది తీర్పు వెలువడే వరకు ఎంపీగా కొనసాగ కూడదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో మాట్లాడవచ్చు కానీ ఓటు వేసే అధికారం ఆమెకు ఉండదని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విధింపుతో 1975 జూన్ 25న జరిగిన తప్పిదాన్ని 1977 మార్చి 21న ప్రజలు తమ తీర్పుతో సరిచేశారు. 1977 మార్చి ఎన్నికలలో ఇందిర ఘోర పరాజయంతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగింది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్థానిక సంస్థల ఎన్నికలు - బీసీ రిజర్వేషన్ల పై భిన్న స్వరాలు




స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య నిర్మాణానికి మూలాధార స్తంభాలు. పంచాయతీలు, మున్సిపాలిటీలూ, నగరపాలక సంస్థలూ ప్రజలకు దగ్గరగా ఉండి సేవలు అందించే నియంత్రణ వ్యవస్థలుగా పనిచేస్తాయి. ప్రజల ప్రత్యక్ష ఓట్లతో ఏర్పడే ఈ శక్తి కేంద్రాల్లో అన్ని సామాజిక వర్గాలకూ సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నదే రాజ్యాంగ లక్ష్యం. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని 42శాతం పెంచిన చట్టం చేసిన నేపథ్యంలో చట్టబద్ధత, ఎన్నికల నిర్వహణ, రాజకీయ ఉద్దేశ్యం వంటి అంశాల్లో వివాదాలు చెలరేగాయి. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో అమలులో ఉన్న 34 శాతంతో పోలిస్తే ఇది 8 శాతం పెంపు. బీసీలకు ప్రాధాన్యతనిచ్చే ఉద్దేశంతో పాటు, రాజకీయంగా వారిని ఆకర్షించాలన్న వ్యూహాత్మక దృష్టితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ ఇది న్యాయపరంగా నిలబడగలదా? అన్న ప్రశ్న తీవ్రంగా ఉత్పన్నమవుతోంది. భారత రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గనిర్దేశం చేస్తాయి. అయితే సుప్రీం కోర్టు పలు తీర్పుల ద్వారా కొన్ని ప్రమాణాలను ఖరారు చేసింది ౹ రిజర్వేషన్ల మొత్తం 50 శాతాన్ని మించకూడ దన్నది ప్రధాన నిబంధన. అయితే తప్పని సందర్భాల్లో మూడు కీలక ప్రమాణాలు నిరూపించాల్సిన అవసరం ఉంది: (1) బీసీ జనాభా ఆధారిత విశ్లేషణ, (2) బీసీల రాజకీయ వెనుకబాటు నిర్ధారణకు నిపుణుల కమిషన్ నివేదిక, (3) 50 శాతం మించకుండా నియంత్రణ. తెలంగాణ ప్రభుత్వం తాజా నిర్ణయంలో ఈ మూడు ప్రమాణాల్లో ఏదీ నిరూపణకు నోచుకోలేదన్నది న్యాయవాదుల అభిప్రాయం. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ వ్యవధిపై ప్రభుత్వ అఫిడవిట్, ఎన్నికల కమిషనర్ అభిప్రాయాల్లో కూడా భేదాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం 30 రోజులు అవసరమని పేర్కొంటే, ఎన్నికల కమిషనర్ ప్రకారం రిజర్వేషన్ల పునర్విభజన, గెజిట్ ప్రకటన, డేటా పరిశీలన వంటి ప్రక్రియల నిమిత్తం 60 రోజులు అవసరమని స్పష్టం చేశారు. ఈ సమయ ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం ఎన్నికల ప్రక్రియను మరింత ఆలస్యానికి గురిచేసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అందులో 42 శాతం స్థానాలకు బీసీలకు రిజర్వేషన్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంది. కొత్త రిజర్వేషన్ అమలుతో ఈ సంఖ్య మరింత పెరగనుంది. అయితే ఈ మొత్తాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వం నుంచి ఎన్నికల కమిషన్‌కు సరైన సమాచారం, సకాలంలో డేటా అందాల్సిన అవసరం ఉంది. ఇదే ఆలస్యం అయితే ప్రజాస్వామ్య పరిపాలనలో ఖాళీ ఏర్పడే ప్రమాదం ఉంది. రాజకీయ కోణంలో ఈ నిర్ణయం బీసీ వర్గాలను ఆకర్షించాలన్న వ్యూహంగా కనిపిస్తున్నా, న్యాయస్థానంలో దీని వెనుక ఉన్న ప్రక్రియ సుస్థిరంగా లేకపోతే, అధికార పార్టీకి పరాభవం తప్పదు. ఎన్నికల ప్రక్రియ ఆగిపోతే స్థానిక పరిపాలన కుంటు పడి ఎన్నికల నిర్వహణలో జాప్యం అనివార్యం కావచ్చు. ఇది ప్రజా ప్రజా ప్రతినిధులకు, పార్టీలకు మాత్రమే కాదు, ప్రజలకూ నష్టమే. ఇక కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా ప్రాధాన్యతగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర నిర్ణయంపై కేంద్రం స్పందించే విధానం విశేష చర్చకు దారి తీస్తున్నది. సాధారణంగా రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ప్రమేయం ఉండదు. కానీ రిజర్వేషన్ల విధానం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమైతే కోర్టు అభ్యర్థించిన సందర్భంలో కేంద్రం తన అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాలలో కేంద్రం తన అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి ౹ బీసీలకు రిజర్వేషన్ అవసరమే కానీ చట్టబద్ధత అవసరం అన్నదే కేంద్ర స్థాయి వైఖరి. ఇటీవల ఎన్డీఏ కూటమిలో కొత్త బీసీ నేతలకు ప్రాధాన్యత ఇచ్చినదాన్ని బీజేపీ వ్యూహాత్మక రాజకీయంగా పరిగణించవచ్చు. బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించాలన్న రాజకీయ వ్యూహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బయటకు తటస్థంగా కనిపించడంతో పాటు లోపల రాజకీయ ప్రయోజనాలను కలిసివచ్చే రీతిలో వ్యవహరించ వచ్చన్న అనుమానాలు వెలుగు చూస్తున్నాయి. అయినా రిజర్వేషన్ వ్యవహారంలో మాత్రం కేంద్రం చాలా జాగ్రత్తగా స్పందించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక్కడ మరో కీలక అంశం ౹ జాతీయ బీసీ జనగణన డేటా లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తక్కువ స్థాయిలో సర్వేలు, కమిషన్ నివేదికల ఆధారంగా రిజర్వేషన్లను సజావుగా అమలు చేయవచ్చన్న న్యాయ అభిప్రాయాలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇలాంటివి చేపడితే కేంద్రం నుంచి వ్యతిరేక స్పందన తక్కువగా ఉండే అవకాశం ఉంది. గతంలో కేంద్రం తరచుగా రాష్ట్రాలకు స్వతంత్ర నిర్ణయాధికారం ఉందన్న అభిప్రాయాన్ని వెల్లడించిన సందర్భాలున్నాయి. తుది విశ్లేషణలో చూస్తే ౹ బీసీ రిజర్వేషన్ అంశం ఒక సామాజిక న్యాయ విధానం అయినప్పటికీ, అది రాజ్యాంగ ప్రమాణాలకు లోబడి అమలవ్వాలి. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం ప్రజాస్వామ్యంలో అవసరమే కానీ, చట్టపరమైన ప్రమాణాలను పక్కన పెట్టి ఆ లక్ష్యాన్ని సాధించలేం. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజికంగా సమర్థనీయమైనదైనా, న్యాయస్థానాల్లో నిలబడగలగాలంటే ప్రక్రియా పరంగా పటిష్టత అవసరం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో వైఖరిని స్పష్టం చేసి, న్యాయ ప్రమాణాలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ఈ సంక్షోభం పరిష్కారానికి మార్గం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు, కాలమిస్ట్ 9440595494**

చురకలు

## సంపాదకీయం

# 'సోషల్' విద్వేషం..

## మూడేళ్ల జైలు ఖాయం...

స్మార్ట్ ఫోన్ చేతికి వచ్చాక.. సోషల్ మీడియా పెరిగాక.. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఏదో ఒక అంశంపై స్పందిస్తున్నారు. మరి కొందరు ఇంకా ముందుకెళ్లి విద్వేషాలు వ్యాపింపజేస్తున్నారు. అవతలివారు గిట్టకుంటే వారిపై తీవ్ర దుష్ప్రచారం చేస్తున్నారు. ఇక రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా అనేది పెద్ద ఆయుధంగా మారింది. ఇందుకోసం ఏకంగా ప్రత్యేక నియామకాలే చేపడుతూ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి అనే విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రోజురోజుకు పెరుగుతున్న విద్వేష పోస్టులకు అడ్డుకట్టేయాల్సింది ప్రభుత్వాలే. ఈ దిశగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. సోషల్ విద్వేష కట్టడికి కొత్త చట్టం తెస్తోంది. దీనిద్వారా సోషల్ మీడియాలో విద్వేషాలు వ్యాప్తి చేస్తే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా అధికారులకు మరిన్ని అధికారులు ఇవ్వాలని కన్నడ ప్రభుత్వం భావిస్తోంది. సోషల్ మీడియాలో ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులతో పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఈ చట్టాన్ని 'కర్ణాటక హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్ బిల్లు-2025' పేరుతో తెస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలను నియంత్రించే అధికారం కలెక్టర్లకు ఇవ్వనున్నారు. ప్రధానంగా విద్వేష ప్రసంగాలు, పోస్టులకు బెయిల్ ఇవ్వకుండా కేసుల నమోదే ఈ బిల్లు ఉద్దేశం. ఇక సోషల్ మీడియా సంస్థలు, టెలికాం కంపెనీలు రెచ్చగొట్టే కంటెంట్ ప్రసారం చేస్తే 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి. విద్వేష ప్రసంగాలకు ఆర్థిక సాయం చేసినా.. ఇతర సాయం చేసినా వారూ దోషులే. ఇక మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో కలెక్టర్లు, మేజిస్ట్రేట్లు.. ర్యాలీలు, బహిరంగ సభలు, లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని 30 రోజులు నిషేధించే అవకాశం కూడా కొత్త చట్టం ద్వారా రానుంది. పరిస్థితులను బట్టి దీన్ని మరో 30 రోజులు పొడిగించే వీలుంది. కాగా, ఈ చట్టంతో భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలగదని అధికారులు చెబుతున్నారు. ఎవరి అభిప్రాయాలు వారు చెప్పవచ్చని.. అది విద్వేషానికి దారి తీసేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ఇక కొత్త చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడానికి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటిని మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా, భారత దేశ టెక్ రాజధాని అయిన బెంగళూరు కర్ణాటక రాజధాని. లక్షల మంది ఐటీ నిపుణులు పనిచేసే ఈ రాష్ట్రంలో టెక్నాలజీ కూడా బాగా వినియోగంలో ఉంటుంది. గత బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియా ద్వారానే పెద్ద ఉద్యమం నడిపింది.

# నిబద్ధత గల నేత వీపీ సింగ్ - జూన్ 25... విశ్వనాథ ప్రతాప్ సింగ్ జయంతి



భారత దేశ రాజకీయాలలో తనదంటూ ప్రత్యేక ముద్ర వేసిన నేత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్. ప్రధానమంత్రి కావడానికి ముందు అవినీతిపై పోరాడటానికి అధికారాన్ని త్యాగం చేసిన ఆదర్శ నేత ఆయన. వీపీ సింగ్ అవినీతిని జాతీయ సమస్యగా మార్చారు. వివాదాస్పదమైన బోఫోర్స్ తుపాకీ ఒప్పందంపై రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లడానికి కేబినెట్ నుండి రాజీనామా చేశారు. హెచ్‌డిడబ్ల్యూ జలాంతర్గామి ఒప్పందానికి సంబంధించిన విచారణపై అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీతో విభేదాల కారణంగా తాను రాజీనామా చేశానని 2005 లో శేఖర్ గుప్తాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రక్షణ ఒప్పందాలలో అవినీతి 1989 లోక్ సభ ఎన్నికలలో కేంద్ర సమస్యగా మారింది. అంతేగాక 1990 ఆగస్టులో, విపి సింగ్ పార్లమెంటులో చాలాకాలంగా మరచిపోయిన మండల్ కమిషన్ నివేదిక సిఫారసులను ప్రవేశపెట్టి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబిసి సమాజ రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసిన ప్రధానిగా చరిత్రలో మిగిలి పోయారు. వీపీ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలో కొన్ని ముఖ్యాంశాలను గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (జూన్ 25, 1931 – నవంబరు 27, 2008) భారతదేశ ఏడవ ప్రధాన మంత్రిగా 1989 నుండి 1990 వరకు పనిచేసారు. ఆ సమయంలోనే మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన కులాలకు 27% రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించారు. వీపీ సింగ్ 1931 జూన్ 25 న మండా ఎస్టేట్ ను పరిపాలించిన రాజపుత్ర జమీందారీ కుటుంబంలో జన్మించారు. అయన డెహ్రాడూన్ లోని కలనల్ బ్రౌన్ కేంబ్రిడ్జ్ స్కూలులోబీ అలహాబాద్, పూణె విశ్వవిద్యాలయాలలో చదివారు. రాజస్థాన్ లోని డియోగర్ – మడారియా రాజు కుమార్తె అయిన సితా కుమారిని 1955 జూన్ 25 న వివాహం చేసుకున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. ఈ వివాహం జరిగినపుడు ఆయనకు 24 సంవత్సరాలు, ఆమెకు 18 సంవత్సరాలు. 1969లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యుడయ్యారు. 1971 లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1974లో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ ఉపమంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 1976 నుండి 1977 వరకు వాణిజ్య శాఖామంత్రిగా తన సేవలనందించారు. 1980లో జనతా పార్టీ తరువాత ఇందిరా గాంధీ మరల ఎన్నుకో బడినప్పుడు, ఇందిర ఆయన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని చేసింది. అలా 1980–82 వరకు పని చేశారు. 1983లో తిరిగి వాణిజ్య మంత్రి పదవిని పొందారు. 1984 సార్వత్రిక ఎన్నికల తరువాత భారతదేశ 10వ కేబినెట్ లో ఆర్థిక మంత్రిగా రాజీవ్ గాంధీచే నియమితు డయ్యారు. బహుశా గతంలో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయాన్ని అందించిన పారిశ్రామిక వేత్తలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుపుతున్నందున ఆ పదవి నుండి తొలగించ బడ్డారు. ఆర్థిక మంత్రిత్వ శాఖనుండి ప్రక్కకు తప్పించినప్పటికీ, సింగ్ కు దేశ ప్రజలలో ఉన్న జనాదరణ కారణంగా 1987 జనవరిలో రక్షణ మంత్రి బాధ్యతలను అప్పగించారు. నాలుగు వందల 155ఎంఎం శతఘ్నులను స్వీడిష్ కంపెనీ ఏబీ బోఫోర్స్ కంపెనీ నుంచి 1437 కోట్ల రూపాయల ఖర్చుతో కొనడానికి ఒప్పందం కుదిరిన విషయంలో, భారతదేశం, స్వీడన్ ప్రభుత్వాల్లోని పెద్దల మధ్య జరిగిన అవకతవకలపై దృష్టి సారించారు. ఈ అంశం రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని కుదిపేసింది. దానిపై దర్యాప్తు చేయించడానికి ముందే ఆయనను క్యాబినెట్ నుండి తొలగించారు. ఫలితంగా సింగ్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేసాడు. 1989 ఎన్నికలలో రాజీవ్ గాంధీని పదవినుంచి తొలగించటానికి, ఆయనకు వ్యతిరేకంగా వామపక్షాలు, భారతీయ జనతా పార్టీతో కలసి ఒక కూటమి ఏర్పాటు చేయడానికి సింగ్ బాధ్యత వహించారు. 1989లో ఆయన పాత్ర భారత రాజకీయాల దిశను మార్చింది. కాంగ్రెస్ పార్టీ నుండి బయటికి వచ్చిన తరువాత సింగ్... అరుణ్ నెహ్రూ, అరిఫ్ మొహమ్మద్ ఖాన్ లతో కలసి జనమోర్చా పేరుతో ప్రతిపక్ష పార్టీని ప్రారంభించారు. అలహాబాద్ లోక్‌సభకు జరిగిన ఉపన్నికలలో సునీల్ శాస్త్రిని ఓడించి తిరిగి ఎన్నుకైనారు. 1988 అక్టోబరు 11 న జనతాపార్టీ సంకీర్ణం నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ జన్మదినం సందర్భంగా రాజీవ్ గాంధీని వ్యతిరేకించే పార్టీలైన జనమోర్చా, జనతాపార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) పార్టీలను కలిపి జనతాదళ్ పార్టీని స్థాపించారు. జనతాదళ్ పార్టీకి అధ్యక్షుడైనారు. ద్రవిడ మున్నేట్ర ఖగజం, తెలుగుదేశం పార్టీ, అసోం గణపరిషత్ వంటి ప్రాంతీయ పార్టీలతో కలసి జనతాదళ్ పార్టీ నేషనల్ ఫ్రంట్ పేరుతో సంకీర్ణ దళం ఏర్పడినది. దీనికి వి.పి.సింగ్ కన్వీనరుగా, ఎన్.టి.రామారావు అధ్యక్షునిగా, పర్వతనేని ఉపేంద్ర జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. 1989 సార్వత్రిక ఎన్నికలలో నేషనల్ ఫ్రంటు, కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలైన భారతీయ జనతా పార్టీ, వామపక్ష పార్టీల (రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలను)తో కలసి సీట్ల సర్దుబాటు చేసుకొని పోటీ చేసింది. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీల నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్టు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వంటి వామపక్షాలు ప్రభుత్వం బయటి నుండి మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పడింది. పార్లెమెంటు సెంట్రల్ హాల్ లో 1989 డిసెంబరు 1 జరిగిన సమవేశం ద్వారా వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా ఎన్నుకోబడి, 1989 డిసెంబరు 2 న భారత దేశ 7వ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, 1990 నవంబరు 10 వరకు ఒక సంవత్సరం లోపే ప్రధానమంత్రిగా పనిచేసారు. మార్చి 1990 లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సింగ్ సంకీర్ణ పభుత్వం పార్లమెంటు లోని రెండు సభలలో నియంత్రణ సాధించింది. ఈ కాలంలో జనతాదళ్ పార్టీ ఐదు రాష్ట్రాలలో అధికారం చేజిక్కించుకుంది. హర్యానా రాష్ట్రంలోని ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం, గుజరాత్ లోని చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వం, ఒడిశాలోని బిజూ పట్నాయక్ ప్రభుత్వం, బీహార్ లోని లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ లోని ములాయం సింగ్ యదవ్ ప్రభుత్వాలను జనతాదళ్ పార్టీ ఏర్పరచింది. నేషనల్ ఫ్రంటు లోని మిత్రపక్షాలైన ఎన్.టి రమారావు, ప్రఫుల్ల కుమార్ మహంతా కూడా ప్రభుత్వాలను ఏర్పరచారు. జనతాదళ్ కేరళ రాష్ట్రంలోని ఇ.కె.నాయనార్ తో, రాజస్థాన్ లో భైరాన్ సింగ్ షెకావత్ తో కూడా అధికారాన్ని పంచుకుంది.

**మండల్ కమిషన్ నివేదిక...** మండల్ కమిషన్ భారత దేశంలోని సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులని అధ్యయనం చేసే కమీషన్. దీనిని 1979 జనవరి 1 న అప్పటి జనతాపార్టీ కి చెందిన భారత ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ చే ప్రారంభించ బడినది. ఆ కాలంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఛైర్మన్ గా బి.పి.మండల్ వ్యవహరించారు. అయన రూపొందించిన మండల్ కమిషన్ నివేదిక భారత దేశంలో వెనుక బడిన తరగతులు, యితర వెనుక బడిన తరగతులుగా సూచించ బడిన కులాలకు సామాన్య జన ప్రవంతిలో అనుసంధానం చేసే మార్గాలను అధ్యయనం చేసి క్రమ బద్ధము, న్యాయ బద్ధమూ అయిన విధాన నిర్మాణాన్ని ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ఆ సమయానికి మురార్జీ దేశాయి ప్రధాని పదవినుండి వైదొలగ వలసి వచ్చింది. తరువాత కాంగ్రెస్ పాలనలో సుమారు 10 సంవత్సరాలు మండల్ కమిషన్ నివేదిక బుట్ట దాఖలు అయిపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పతనమై వి.పి. సింగ్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికకు తన ప్రభుత్వ ఆమోద ముద్ర వేసాడు. ఓబిసి రిజర్వేషన్లను (క్రిమీలేయర్ కంటే దిగువన) 2008 లో సుప్రీం కోర్టు సమర్థించింది. అయన పాలనా సమయంలో శ్రీలంకలోని తమిళ వేర్పాటు వాద ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి అంతకు పూర్వం రాజీవ్ గాంధీ భారత సైన్యాన్ని పంపించి చేపట్టిన, విఫలమైన ఆపరేషన్‌కు ముగింపు పలకాలని నిర్ణయించారు. భారత సరిహద్దులో యుద్ధాన్ని ప్రారంభించేందుకు బెనజీర్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను ఆయన అడ్డుకున్నారు. వి.పి.సింగ్ 2008 నవంబరు 27 న న్యూఢిల్లీ లోని అపోలో ఆసుపత్రిలో మరణించారు. 2008 నవంబరు 29 న అలహాబాదు లోని గంగా నదీ తీరంలో దహనం చేసారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జూన్ 25... కలర్ టీవీ డే - నలుపు తెలుపు నుండి రంగుల వైభవం దాకా - మన టీవీ ప్రయాణం

కలర్ టీవీ డే ప్రతి సంవత్సరం జూన్ 25న జరుపుకోవడం ప్రపంచ టెలివిజన్ చరిత్రలో జరిగిన ఒక విప్లవాత్మక ఘట్టాన్ని గుర్తు చేసుకునే సందర్భం. గృహ వినోద ప్రపంచంలో ఒక కీలక మైలురాయిని సూచించే నేపథ్యం. మనం నల్లని తెల్లని తెర నుంచి రంగుల ప్రపంచానికి ప్రయాణం చేసిన ఆవిర్భావ ఘట్టాన్ని గుర్తుచేసుకునే అనుభూతికరమైన జ్ఞాపకం. ఇది కేవలం ఒక సాంకేతిక పురోగతికే కాదు, మానవ జీవితాల్లో రంగులను ప్రవేశ పెట్టిన మహత్తర పరిణామానికి అంకితం. 1954 జూన్ 25న అమెరికాలో 'ఎన్‌బీసీ' టెలివిజన్ చానల్ ద్వారా 'ది మ్యారేజ్' అనే కార్యక్రమాన్ని రంగుల్లో ప్రసారం చేయడం ద్వారా ప్రపంచపు తొలి రంగుల టెలివిజన్ ప్రసారానికి నాంది పలికింది. ఇది ఆ కాలపు నల్లతెల్ల దృశ్య జాలాన్ని మానవ కళ్ళ ముందే రంగుల ప్రపంచంగా మార్చిన ఘట్టం. ఈ రంగుల ప్రసారాల ఆవిర్భావం తదనంతర దశాబ్దాల్లో ప్రపంచ వ్యాప్తంగా టెలివిజన్ రంగాన్ని ప్రభావితం చేయడమే కాదు, సామాజిక, సాంస్కృతిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి కూడా కారణమైంది. భారత దేశంలో కలర్ టీవీ ప్రయాణం 1982లో ప్రారంభమైంది. అదే సంవత్సరంలో న్యూఢిల్లీ నగరంలో నిర్వహించిన 9వ ఆసియా క్రీడల సందర్భంగా దూరదర్శన్ రంగుల ప్రసారాలను ప్రారంభించింది. అప్పటి వరకు నల్ల తెల్ల టీవీలతో మాత్రమే అలవాటుపడ్డ ప్రేక్షకులకు ఇది ఓ అద్భుత అనుభూతిగా నిలిచింది. భారత ప్రభుత్వం తక్కువ సమయంలో ఈ టెక్నాలజీని అందుబాటు లోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రయత్నాలు చేసి, టీవీ ఉత్పత్తికి అనేక దేశీయ సంస్థలకు అనుమతులు ఇచ్చింది. భారతీయ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇసిల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వంటి సంస్థలు రంగులో టీవీలను ఉత్పత్తి చేయడం ప్రారంభించాయి. వీటితో పాటు డైనోరా, వెస్టన్, బీపీఎల్, ఒనిడా, విడియోకాన్ వంటి బ్రాండ్లు మార్కెట్‌ను ఆక్రమించాయి. 1982 నాటికి దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల టీవీ సబ్‌స్క్రైబర్లు ఉన్నప్పటికీ, 1990 నాటికి ఈ సంఖ్య కోటి దాటి వెళ్ళడం ఈ రంగంలో కలర్ టీవీ ప్రభావాన్ని చూపుతుంది. కలర్ టీవీ మన జీవితాల్లో కేవలం వినోద పరికరంగా మాత్రమే కాక, ఒక భావోద్వేగ కేంద్రంగా మారింది. కుటుంబ సభ్యులు టీవీ ముందే చేరి సినిమాలు, సీరియల్స్, క్రీడా ప్రోగ్రాములు చూసే ఆనందం ఒక సంస్కారంగా మారింది. అది వినోదానికి వేదిక మాత్రమే కాకుండా, రాజకీయ ప్రచారాలకు, సామాజిక అవగాహనకు, విద్యా కార్యక్రమాలకు, ఆధ్యాత్మిక సందేశాల వ్యాప్తికి కేంద్ర బిందువుగా మారింది. ప్రజల ఆలోచనా విధానాన్ని, జీవిత దృక్పథాన్ని మార్చిన సాధనంగా ఇది నిలిచింది. కాలక్రమేణా టీవీ రంగం సాంకేతికంగా విస్తరిస్తూ, మరింత ఆధునిక రూపాలను అలవరించుకుంది. సాంప్రదాయ టీవీ నుండి దృశ్య స్వర నాణ్యతను మెరుగు పరిచిన ఎల్‌ఈడి, ఎల్‌సీడీ, ఒఎల్‌ఈడి, క్యూఎల్‌ఈడి, ఫోర్‌కే, ఎయిట్‌కే వంటి ఆధునిక టెక్నాలజీ ఆధారిత టీవీలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి కేవలం ప్రసార పరికరాలే కాక, ఇంటర్నెట్ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లను, వినోద, విద్యా, సమాచార, గేమింగ్, కమ్యూనికేషన్ అవసరాలను తీర్చే బహుళోపయోగ పరికరాలుగా మారాయి. నేడు ఇంట్లో ఓటిటి సేవలు, వినియోగదారుడి ఇష్టానికి అనుగుణంగా ఎంపిక చేసుకునే కార్యక్రమాలు టీవీ వినియోగాన్ని పూర్తిగా మారుస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్లో అనేక దేశీయ, విదేశీ కంపెనీలు ఈ రంగంలో పోటీపడుతూ నూతన సాంకేతికతను ప్రవేశపెట్టి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన సంస్థలు అత్యున్నత నాణ్యత గల తెరలు, శబ్ద వ్యవస్థలు కలిగిన మోడళ్లను విడుదల చేస్తూ టీవీ మార్కెట్‌ను ఆధిపత్యంగా ఆక్రమించాయి. ఇతర కొరియా సంస్థలు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి డాల్బీ ధ్వని, మృదువైన రంగుల విన్యాసం వంటి ఫీచర్లతో టీవీలను తయారు చేస్తున్నాయి. జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలు సుదీర్ఘ అనుభవంతో రూపొందించిన బ్రావియా సిరీస్ టీవీలతో రంగుల ప్రదర్శనలో కొత్త ప్రమాణాలు ఏర్పరుస్తున్నాయి. చైనాకు చెందిన షియోమీ, టిసిఎల్, ఐఫాల్కన్, ఇన్ఫినిక్స్ వంటి సంస్థలు తక్కువ ధరలో అధిక ఫీచర్లతో కూడిన టీవీలను భారత వినియోగ దారులకు అందుబాటు లోకి తెచ్చాయి. దేశీయంగా రియల్మీ, లావా, నోకియా (ఫ్లిప్‌కార్ట్ భాగస్వామ్యంలో), వీవూ, థాంసన్ వంటి బ్రాండ్లు సైతం ఈ పోటీలో తమ స్థానాన్ని బలపరుస్తున్నాయి. ఈ ప్రగతికి మూలం 1954లో ప్రారంభమైన రంగుల ప్రసారం, దాని భారతీయ రూపాంతరం 1982లో మన దేశాన్ని చేరింది. అప్పటి చిన్న తెర నేడు స్మార్ట్ టెక్నాలజీతో ఇంటి గదిలో ఉండే పెద్ద తెరగా, ప్రపంచాన్ని చూపించే కిటికీగా మారింది. ఒకప్పుడు వార్తలు, సినిమాలు చూసే సాధనంగా ఉన్న టీవీ, నేడు ఇంట్లో విద్యా పాఠాల నుంచి ఆధ్యాత్మిక సత్సంగాలకు, భవిష్యత్తు తరం బుద్ధి వికాసానికి దోహదపడే పరికరంగా రూపాంతరం చెందింది. రంగుల టీవీ మన జీవితాల్లోకి రంగులు మాత్రమే కాదు, అనుభవాలను, అభిరుచులను, సంబంధాలను కూడా తీసుకు వచ్చింది. మన భావాలను, జ్ఞాపకాలను, కలలను రంగుల చిత్రంగా చూపే ఈ మాధ్యమం మన జీవితాల్లో ఓ భాగంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో జూన్ 25 కలర్ టీవీ డేను కేవలం ఓ చారిత్రక దినోత్సవంగా కాక, టెక్నాలజీ ప్రగతికి, భావ ప్రకటన స్వేచ్ఛకు, సామూహిక అనుభవాల పునర్నిర్మాణానికి ప్రతీకగా పరిగణించాలి. ఒక యంత్రం మన కళ్ల ముందే ప్రపంచాన్ని రంగుల్లో చూపించ గలదని, ఆ రంగుల్లో మన జీవితాన్ని కూడా తడిపేసిందని ఈ రోజు మనకు తెలియజేస్తుంది. కలర్ టీవీ ఓ విజ్ఞానవేదిక, ఓ సంస్కృతి ప్రతీక. కలర్ టీవీ అనేది మానవ మేధస్సు, పరిశోధన, సాంకేతిక విజ్ఞాన సముపార్జనకు ప్రతీక. ఈ టెక్నాలజీ ఆవిష్కరణ అనేక రంగాల్లో మార్పులకు నాంది పలికింది. మునుపటిదాకా వినోదం పరిమితమైన వేదికలకే చెందింది. అయితే టీవీ రంగుల్లోకి వచ్చాక వినోదం, విజ్ఞానం, వార్తలు, సంస్కృతి, విద్య, ఆధ్యాత్మికత – అన్నింటినీ మన కళ్ల ముందే




రంగుల ప్రపంచంగా మార్చి చూపించింది. ఒకే సమయంలో ఒకే తెరపై మనిషి ప్రపంచాన్నే చూచే అవకాశం కల్పించిన ఈ మాధ్యమం జీవన విధానాన్నే ప్రభావితం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 1980వ దశకంలో హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, రాజమండ్రి లాంటి పట్టణాల్లో మొదటిగా రంగుల టీవీలు కనిపించాయి. అప్పట్లో టీవీ కొనడం ఒక ప్రథమ ఆస్తిగా భావించబడింది. పక్కింటి వాళ్ల టీవీ చూసేందుకు పొరుగువారి ఇళ్లకు వెళ్లడం, టీవీ మీద పలువురి ప్రాధాన్యత %–% ఇవన్నీ ఆ కాలంలోని జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. నాలుగు దశాబ్దాలలో కలర్ టీవీ రూపురేఖలు పూర్తిగా మారి పోయాయి. ఒకప్పుడు నాలుగు అడుగుల వెనుక భాగం ఉన్న బుల్కీ టీవీలు, నేడు గోడకే అతికించగలంత సన్నని రూపంలో కనిపిస్తున్నాయి. ఆధునిక టీవీలు మానవ స్వరం ద్వారా నియంత్రించగలిగే విధంగా అభివృద్ధి చెందాయి. ఇంటిలో ఇతర పరికరాలతో అనుసంధానమై, ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ వ్యవస్థల్లో భాగమయ్యాయి. కుటుంబ జీవనశైలిని, సామాజిక జీవనాన్ని, మార్కెట్ ధోరణులను కలర్ టీవీ ప్రభావితం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ దీనికి విస్తృత ప్రజాదరణ లభించింది. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు టీవీని ఒక సమాచార వేదికగా, వినోద సాధనంగా స్వీకరించారు. నేటి యువత కొత్త సాంకేతిక ఫీచర్లతో కూడిన టీవీలను కోరుతున్న వేళ, కంపెనీలు వారికోసం ఆటోమేటిక్ ప్రకాశ నియంత్రణ, ధ్వని విశ్లేషణ, బహుళ భాషల మద్దతు వంటి లక్షణాలతో కూడిన పరికరాలను అందిస్తున్నాయి. ఇంటి గదిలోని వెలుతురు తగ్గితే స్క్రీన్ ప్రకాశం తగ్గించే విధంగా పనిచేసే టీవీలు వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చెందుతున్నాయి. దేశీయ కంపెనీలు సైతం ఈ పోటీలో తామేదానిలో తీసిపోమన్న దృక్పథంతో ముందుకు వస్తున్నాయి. గతంలో ప్రజలు 'ఫారిన్ %ఒ%' అనే భావనలో మక్కువ చూపితే, నేడు 'భారతీయ బ్రాండ్'లపై విశ్వాసం పెరుగుతోంది. కలర్ టీవీ మన జీవితాల్లో కలిగించిన ప్రభావం సామాన్యమైనదేమీ కాదు. ఇది ఒక భావజాలాన్ని, అభిరుచిని, ఆలోచన విధానాన్ని మార్చిన సాధనం. ప్రతి ఇల్లు ఓ మినీ సినిమా హాలుగా మారింది. మన భారతదేశంలో ఎన్నికల ప్రచారం నుంచీ భక్తి కార్యక్రమాల వరకు టీవీ కీలక పాత్ర పోషిస్తోంది. టీవీ వినియోగం ఇప్పుడు ఒక ఇంటి ఆధునికతకు సూచికగా మారింది. అంతేకాదు, ఆధునిక టీవీలు విద్యార్థుల విద్యా గమనానికి తోడ్పడుతున్నాయి. వివిధ విద్యా సంస్థలు విద్యా కార్యక్రమాలను టీవీ ద్వారానే ప్రసారం చేయడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఇంటికి తీసుకు వెళ్లుతున్నాయి. ఈ నేపథ్యంలో కలర్ టీవీ డేను మనం ఒక సందర్భంగా కాక, ఒక సంస్కృతి చరిత్రగా, మానవ విజ్ఞాన శక్తికి అద్దంపట్టిన ఘట్టంగా పరిగణించాలి. టీవీ మానవ జీవితాల్లో వెలిగించిన రంగుల వెలుగు నిరంతరం వెలిగిపోవాలి. మన కళ్ళను మాత్రమే కాదు, మన హృదయాన్ని కూడా రంగుల్లో ముంచెత్తిన ఈ మాధ్యమం అర్హతగల అభినందనకు పాత్రం. జూన్ 25న కలర్ టీవీ డేను మనం జరుపుకోవడం ద్వారా %–% ఆవిష్కరణల పట్ల కృతజ్ఞత, విజ్ఞాన పట్ల గౌరవం, భావోద్వేగాల పట్ల అపారమైన ప్రేమను వ్యక్తపరచవచ్చు. రంగుల తెర పుట్టిన రోజు జ్ఞాపకంగా మన జీవితాల్లో స్థిరపడిన ఈ పండుగను మరింత అర్థవంతంగా చేసుకోవాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చరకలు



# వనం.. భాగమవుదాం మనం

శ్రీరాంపూర్ : కార్మికక్షేత్రాన్ని పచ్చనివనాలతో తీర్చిదిద్దాలని యాజమాన్యం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ప్రతి ఏటా రికార్డు స్థాయిలో మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది నిర్వహించే వన మహోత్సవంలో కంపెనీ వ్యాప్తంగా 670 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొక్కలు నాటి, రక్షణకు యాజమాన్యం రూ.33 కోట్లు ఖర్చు చేస్తోంది.

**అంతరిస్తున్న వృక్షజాతులు అందుబాటులోకి..**

రాష్ట్రంలో కనుమరుగవుతున్న వృక్ష జాతులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో నారేప, జిట్రేగి, మారెడు, ఉసిరి, నేరేడు, నెమలినార, బూరుగ, మేడి, తెల్ల చిందుగా, ఎర్రచందనం, జువ్వి, రావి, టేకు, తాని, బట్టఘనము వంటివి సిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉంచారు. వీటిని యాజమాన్యం స్వయంగా నాటి మరికొన్నింటిని కార్మిక కుటుంబాలు, సమీప గ్రామాల ప్రజలకు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో సుమారు



కోటి మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం రికార్డు స్థాయిలో మొక్కలు నాటుతూ ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ నుంచి గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించిన ఆయన సుమారు 20 వేలకు పైగా మొక్కలు నాటారు. ఆయన పేరిట శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని సమీపంలో 'బలరాం వనం' ఏర్పాటు చేశారు. ఏరియాలో ఆయన సందర్శించిన ప్రతిసారి నాటిన మొక్కలు సందర్శిస్తూ వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ ఏడాది ఉద్యోగులతో కలసి మరిన్ని మొక్కలు నాటేందుకు సిద్ధం అవుతున్నారు.

**బెల్లంపల్లి రీజియన్‌లో..**

బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లో 10 లక్షలకు పైగా మొక్కలు నాటాలని యాజమాన్యం నిర్ణయించింది. 139 హెక్టార్లలో వీటిని నాటనున్నారు. 'నీటి బిందు -జల సింధు'లో భాగంగా ఇటీవల నిర్మించిన కొత్త చెరువులు, వృద్ధి చేసిన చెరువుల వద్ద, ఉపరితల గనుల డంప్ యార్డులు, కాలనీలు, ఖాళీ ప్రదేశాలు వీటిని నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# చేరువలో.. దూర విద్య!


కాగజ్‌నగర్ : ప్రస్తుతం ఉద్యోగం, ఉద్యోగోన్నతి, ఉపాధి, తదితర అవకాశాలకు డిగ్రీ అనేది సాధారణంగా మారింది. ఉన్నత విద్యకు తోడు లేనివారికి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో రోజూ తరగతులకు హాజరు కాలేకపోవడం, అధిక ఫీజులు భరించలేకపోవడం తదితర సమస్యలను అధిగమిస్తూనే డిగ్రీ పూర్తి చేసేందుకు దూర విద్యావిధానం అందుబాటులో ఉంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలున్నాయి. ఇంటర్, సమాన విద్యార్హతతో ఓపెన్ డిగ్రీలో ప్రవేశం పొందవచ్చు. బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ బీజడ్‌సీ తదితర గ్రూపుల్లో నచ్చిన దాన్ని ఎంచుకుని మూడేళ్లలో డిగ్రీ కోర్సును పూర్తి చేయొచ్చు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సును ఎంచుకుని, 60 శాతం ఆన్‌లైన్, 40 శాతం ఆఫ్‌లైన్‌లో వారాంతంలో తరగతులకు హాజరవుతూనే డిగ్రీ చేయవచ్చు.

**సాధారణ డిగ్రీ మాదిరిగానే..**

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి పొందిన డిగ్రీ పట్టా సాధారణ డిగ్రీ మాదిరిగానే పనిచేస్తుంది. ఓపెన్ డిగ్రీ చేసిన తర్వాత వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు. యూపీపీఎస్సీ పరీక్షలు నిరభ్యంతరంగా రాయొచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు ఉద్యోగోన్నతి కోసం డిగ్రీ అర్హతను ఉపయోగించుకోవచ్చు.

**దరఖాస్తు ఇలా**

2025-26 విద్యాసంవత్సరానికి గాను ఈ నెల 13వ తేదీ నుంచి



అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 13 వరకు కొనసాగుతుంది. %https:///www.braou.ac.in% వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం పూర్తి చేయాలి. అడ్మిషన్ ఫీజు రూ.3,300 చెల్లించి, అవసరమైన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోవాలి. ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం నిజ ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పుస్తకాల కోసం స్టడీ సెంటర్‌లో రూ.500 చెల్లించాల్సి ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

కళాశాలకు వెళ్లి రెగ్యులర్ డిగ్రీ చదువుకునే అవకాశం లేని వారు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందజేస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసి స్టడీ సెంటర్‌లో నిజ ధ్రువపత్రాలతోపాటు జిరాక్సు ప్రతులతో సంప్రదించాలి. యూనివర్సిటీ నిర్దేశించిన ప్రకారం స్టడీ సెంటర్‌లో తరగతులుంటాయి. తూడూరు దత్తాత్రేయ, స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

# పొంచి ఉన్న ముంపు.. ఎవరిదీ తప్పు!



గోదావరిఖని : వర్షాకాలం ముంచుకొస్తున్నప్పటికీ నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనుల్లో జాప్యం నెలకొంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే కొన్ని కాలనీల్లో ముంపు తప్పదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా వేసవిలోనే ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ వివిధ కారణాలతో జాప్యం చేస్తున్నారు. కొత్తగా రూపొందించిన నిబంధనల ప్రకారంగా ప్రధాన మురుగు కాలువల పూడికతీతకు నాలుగుసార్లు టెండర్లు నిర్వహించగా.. గుత్తేదార్ల నుంచి స్పందనలేదు. ఇటీవల ఐదోసారి పిలవగా ఒకే ఒక్కరు ముందుకు వచ్చారు. అయితే పనులు ఇంకా ప్రారంభించలేదు.

**ప్రధాన ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి**

టీయూఎఫ్ఐడీసీ నిధులతో నగరంలోని కొన్ని ప్రధాన మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతుండగా.. మిగతావాటిలో పూడికతీతలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సప్తగిరి కాలనీవైపు, ఇందిరానగర్‌లో, ఐబీ కాలనీలో కాలువ నిర్మాణాలు దాదాపుగా పూర్తికాగా.. మిగతా ప్రాంతాల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాల్సి ఉంది.

విఠల్‌నగర్, ద్వారకానగర్, ఎన్టీఆర్‌నగర్, కాకతీయనగర్, ఉల్లిగడ్డల బజారు, శివాజీనగర్, లెనిన్‌నగర్ మీదుగా ప్రవహించే ప్రధాన మురుగు కాలువ మురుగుతో నిండిపోయింది.

7బీ కాలనీ, ఫైవింక్లయిన్ కాలనీ మీదుగా రైల్వే వంతెన కిందనున్న కాలువను శుభ్రం చేయకపోగా.. జ్యోతినగర్, రాంనగర్, సీతానగర్ నుంచి వచ్చే వరద ప్రవాహం సైతం ఈ వంతెన కింది నుంచే ప్రవహిస్తుండటంతో వరద నీరంతా రోడ్డెక్కి నిలుస్తుంది.

చిన్నపాటి వర్షానికే రామగుండం పాత బజారు ఏటా ముంపునకు గురవుతుంది. ఇప్పటికిప్పుడు వర్షాలు కురిస్తే గతంలోకంటే ఎక్కువగా వరదనీరు ఇళ్లల్లోకి చేరే ప్రమాదముంది. కొంతమేర కాలువ నిర్మాణం జరిగినప్పటికీ వరద ప్రవాహానికి సరిపడే వెడల్పు లేదు. కొన్నేళ్లుగా ఈ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పరిష్కారం కావడంలేదు.

నిధులు మంజూరైనా నత్తనడకన..

'అమృత్ 2.0' నిధులు రూ.88.68 కోట్లతో.. నగరంలోని నాలుగు చోట్ల మురుగు జలాల శుద్ధి కేంద్రాలను నిర్మించడంతోపాటు, పలుచోట్ల కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనప్పటికీ.. పనులు నత్తనడకన సాగుతున్నాయి. మురుగు జలాలను శుద్ధి చేయకుండానే గోదావరిలోకి వదులుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఫలితంలేదు.

**పనులు వేగవంతం చేస్తాం**

నగరంలోని మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువల్లో పూడికతీతకు ఇటీవల టెండరు ఖరారు కావడంతో పనులు వేగవంతం చేస్తాం. మురుగును తొలగించేందుకు నగరపాలిక వాహనాలను కొనుగోలు చేసి వినియోగిస్తోంది.

# ముంపులో.. మునుగుడే



భువనగిరి : వానొస్తే వరదొస్తుంది. ఆ వరద ఎటూ వెళ్లలేని దుస్థితి. ఆ నీళ్లు రహదారులపై నిలిచిపోతాయి. రాకపోకలకు అంతరాయంగా మారుతాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరుతుంది. కాలనీల్లో రోజుల తరబడి నీరు నిలుస్తున్న ఘటనలు ఉన్నాయి.

భువనగిరి పట్టణంలో గతంలో కొత్తబస్‌స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రిన్స్ చౌరస్తా వరకు దుకాణాల్లోకి వరద నీరు చేరి భారీ నష్టాన్ని మిగిల్చాయి. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలోనూ వరద నీరు చేరి రోజుల తరబడి నీళ్లు నిలుస్తాయి. ఖాజీమహెల్లాలో కాలనీలో వర్షపు నీరుతో ఇళ్లలోకి వెళ్లడం కష్టంగా ఉంటుంది. రాయగిరి అండర్‌పాస్ వద్ద గతంలో పడిన భారీ వర్షాలకు చెరువు పొంగి సర్వీస్ రహదారిలో మూడు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మున్సిపల్ డీఈ కొండల్‌రావు మాట్లాడుతూ.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఆలేరు పట్టణంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న రంగనాయక వీధి, కుమ్మరివాడ, సిల్క్‌నగర్ కాలనీలు జలమయమవుతున్నాయి. రాజపేట గ్రామం చుట్టూ ఎత్తైన కోట బురుజు, ఆ పక్కనే లోతైన కందకాలున్నాయి. ఈ కందకాల గుండా వరదనీరు దిగువ ప్రాంతానికి వెళ్లడానికి అప్పట్లో ఏర్పాటు చేసినట్లుగా సమాచారం. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలోని రెండు పడకల భవన సముదాయాలు చుట్టూ నీరు చేరి చెరువును తలపిస్తోంది. బాహుపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో వర్షం నీరు చేరితే ఇక రెండు నెలల పాటు రాకపోకలు కొనసాగవు. యాదగిరిగుట్ట పురపాలికలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుకభాగం నివాసాలు, పొలాలు ప్రతీయేటా వరదనీరు చుట్టుముట్టి ఇబ్బందులకు గురవుతుంటారు. గొల్లగూడెం, చొల్లేరు కాజ్‌వేలపై వరద ప్రవాహం పెరిగితే యాదగిరిగుట్టకు రాకపోకలు నిలిచిపోతాయి.

చౌటుప్పల్‌లో చెరువు నిండితే ఇక్కడి బస్‌స్టేషన్, చిన్నకొండూరు రోడ్డు, గాంధీ పార్కు, శాంతినగర్, రామ్‌నగర్, వెంకటరమణ కాలనీ ప్రాంతాలు జలమయం అవుతాయి. జాతీయ రహదారి పక్కనున్న సర్వీసు రోడ్డును, దానికి ఇరువైపులా ఉన్న దుకాణాల సెల్లార్లలో నిండిపోయి నెలలు గడిచినా ఆ నీరు తగ్గడం లేదు.

మోత్కూరు పురపాలికలోని వెంకటేశ్వరకాలనీ, వడ్డెరవాడ ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో స్థానిక పాతబస్టాండ్ ప్రాంతం గుండా చెరువులోకి నీరు వెళ్లేందుకు సరైన కాల్వలు లేక ఇళ్లలోకి నీరు చేరుతుంది. పుర కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇటీవల రెండు కల్వర్టులు నిర్మించామని వరద చెరువులోకి సజావుగా వెళ్లిపోయేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

# చెత్త ఎరువై.. వ్యర్థాలు వేరై

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం డంపింగ్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. యార్డులో 2020 నుంచి కొనసాగుతున్న ప్రక్రియ సాంకేతిక కారణాలతో కొద్ది రోజులుగా నిలిచిపోయింది. ఇప్పటికే యార్డులో పోగైన 80 శాతం చెత్తను బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా ఎరువుగా మార్చారు. యార్డులోని చెత్త తొలగి తిరిగి నిలువ చేసే అవకాశం కలగడంతో పాటు పురపాలకశాఖకు ఆదాయం లభిస్తోంది.

పట్టణంలో నిత్యం 32 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. పట్టణంలోని 35 వార్డుల నుంచి సేకరిస్తున్న చెత్తను ఎక్కడ నిలువ చేయాలో అర్థంకాని పరిస్థితిలో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా పురపాలక సంఘం యార్డులో బయోమైనింగ్ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. అప్పట్లో సాగర్ మోటార్స్ సంస్థ బయోమైనింగ్‌కు శ్రీకారం చుట్టింది.

**18 వేల మెట్రిక్ టన్నులు**

యార్డులోని మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్‌ను చేపట్టి సుమారు 95వేల టన్నుల ఎరువును వేరు చేయాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ప్రక్రియ ఇప్పటి వరకు సుమారు 18వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు ఎరువును తయారు చేయగలిగారు. చెత్త నుంచి ఆశించిన మేరకు ఎరువు లభించకపోవడంతో పూర్తి స్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. తయారు చేసిన ఎరువు, ఇతర వ్యర్థాలను మూడు గుట్టలుగా యార్డులోనే నిల్వ చేయడం గమనార్హం. ఎరువు, ఇతర వ్యర్థాలకు ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ తగ్గడంతోనే నిలువలు తరలించకుండా, ప్రక్రియను కొద్ది రోజుల పాటు నిలిపివేసినట్లు సమాచారం. తయారు చేసిన ఎరువును తరలించి, పేరుకుపోయిన చెత్తను మరో దఫా బయోమైనింగ్ చేసిన పక్షంలో యార్డులో చెత్త పోగు చేసేందుకు మరింత స్థలాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంది.



**ఇతర ఉత్పత్తులు**

దశాబ్దాలుగా యార్డులో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ వారియర్ 600, వారియర్ 1200 యంత్రాల ద్వార ద్వార వేరు చేసిన మూడు రకాలుగా ఉత్పత్తి చేస్తున్నారు. చెత్త కంపోస్ట్ ప్రొడక్ట్, ఇన్‌ఆర్ట్ మెటీరియల్, బయో సాయిల్‌ను విక్రయించడం ద్వారా భారీ ఆదాయం గుత్తేదారు సంస్థ పొందుతోంది. కంపోస్టబుల్ ప్రొడక్ట్ సిమెంట్ కర్మాగారాలకు, ఇన్‌ఆర్ట్ మెటీరియల్ ల్యాండ్ ఫిల్లింగ్‌కు, బయో సాయిల్ వ్యవసాయానికి ఎరువుగా వినియోగించుకునే వీలుంది.

ఉత్పత్తి అయ్యే పదార్థాలు ఇలా...

బయో సాయిల్: కార్బన్ పార్టికల్స్, బయో డిగ్రేడబుల్ సామగ్రి, ఎరువు

కంపోస్టబుల్: పెట్ బాటిల్స్, పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు

ఇన్‌ఆర్ట్ మెటీరియల్: గాజు సీసాలు, సీసం, వాహనాల వ్యర్థాలు, రబ్బరు, బల్బ్‌లు, ఫైబర్ మెటీరియల్.

# ప్రాణి చిన్నది.. హాని పెద్దది

ఆదిలాబాద్ : రెండక్షరాల చిన్న ప్రాణి 'దోమ'. మనిషికి తెచ్చిపెట్టే ముప్పు మాత్రం చాలా పెద్దది. ప్రధానంగా వర్షాకాలంలో అన్ని రకాల అంటువ్యాధులను ఒకరి నుంచి మరొకరికి చేరవేస్తూ వాటిని వ్యాప్తి చేస్తూ ఆసుపత్రుల పాల్జేస్తుంది. చిన్న జాగ్రత్తలతో దోమల బారి నుంచి బయటపడొచ్చు.

నీటి నిల్వ ప్రాంతాల్లోనే దోమలు వృద్ధి చెందుతాయి. అవి నీటిలో పెట్టిన గుడ్లు వాతావరణం వేడితో మూడు రోజుల్లోనే లార్వాలుగా బయటకు వచ్చి ప్యూపాగా మారుతాయి. వీటినే నీళ్లలో తోకపురుగులుగా వ్యవహరిస్తారు. అనంతరం ఇవే దోమలుగా రూపాంతరం చెందుతాయి. అన్ని రకాల ప్రాణాంతక వ్యాధులు దోమ వల్లనే వ్యాప్తి చెందుతాయి.

**రోగాల ముప్పు..**

దోమ కాటు వల్ల ప్రధానంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు ప్రబలుతాయి. ఈ వ్యాధులున్న వారిని దోమలు కాటేసిన అనంతరం ఇతరులను కుడితే ఆ వ్యాధి వైరస్ వారిలో వృద్ధి చెందుతుంది. ఈ వ్యాధుల లక్షణాలన్నీ దాదాపు ఒకే రకంగా ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

ఆవాస ప్రాంతాల వద్ద, ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వీలైతే దోమ తెరలను వాడి రక్షణ పొందొచ్చు.

పరిసరాల్లో నీటి నిల్వ గుంతలుంటే పూడ్చేయాలి

ఇళ్లల్లోని కూలర్లలో ఎప్పటికప్పుడు నీళ్లను మార్చేస్తూ ఉండాలి

వీలైతే ఇళ్లల్లో దోమల నివారణ పొగ పెట్టొచ్చు. ఇందుకు మార్కెట్‌లో వివిధ రకాల అగర్‌బత్తీలు అందుబాటులో ఉన్నాయి.

చిన్న పిల్లలను పడుకోబెట్టినప్పుడు కాళ్లు, చేతులకు దోమల నివారణ క్రీములను ఉపయోగించవచ్చు.

శుభ్రత పాటించాలి

దోమల వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పరిసరాల్లో నీటి నిల్వ గుంతలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. అస్వస్థతకు గురైతే వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో సకాలంలో సంప్రదించాలి.


రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ

# స్వచ్ఛ పురస్కారం.. ఎవరికో వరం!

వాంకిడి : గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపర్చేందుకు, పంచాయతీల మధ్య పోటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సర్వేలో తేలిన అంశాల ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. వీటి ఆధారంగా పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించి పురస్కారాలను అందజేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. త్వరలో కేంద్ర బృందాలు గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టనున్నారు.

**ఈ అంశాలకు ప్రాధాన్యం**

జిల్లాలో త్వరలో కేంద్ర బృందం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై సర్వే చేపట్టనుంది. పారిశుద్ధ్య పరిస్థితి, ప్రగతి పనులపై అధికారులు పంపిన నివేదికల ఆధారంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టనున్నారు. ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకున్నారా?, వినియోగిస్తున్నారా?, పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం చెత్తను సేకరిస్తున్నారా? ఇంకుడు గుంత నిర్మాణం ఉందా?, డంపింగ్ యార్డుల్లో వ్యర్థాల నిర్వహణ అమలు, పచ్చదనం పెంపు, శుద్ధమైన తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు.. ఇలా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సర్వే చేపడతారు. ఆయా అంశాల ఆధారంగా వెయ్యి మార్కులకు గాను ఎక్కువ స్కోర్ సాధించిన పంచాయతీలకు స్వచ్ఛ ర్యాంకులు ప్రకటించనున్నారు.



**కొనసాగుతుంది ఇలా..**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. అయితే పంచాయతీల్లో కేంద్ర బృందం ర్యాండమ్‌గా 20 ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టనుంది. ఏ గ్రామాల్లో సర్వే చేపడతారనే ముందస్తు సమాచారం ఉండదు. అంతర్జాలంలో వచ్చిన సమాచారం ఆధారంగా ఏ గ్రామానికి వెళ్లాలనేది నిర్ణయం జరుగుతుంది. గ్రామంలో ఏవైనా 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఆ నివాస గృహాల్లో మూడు ఎస్సీ, మూడు ఎస్టీ, 10 ఇతర నివాసాలను అధికారుల ఆదేశాలకు అనుగుణంగా సర్వే చేస్తారు. అనంతరం సర్వేలో తేలిన అంశాలను కేంద్రానికి నివేదికలు అందజేస్తారు.

**సిబ్బందికి అవగాహన**

త్వరలో కేంద్ర బృందం స్వచ్ఛ సర్వేక్షణ్‌కు రానున్న నేపథ్యంలో.. జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొనేలా అన్ని పంచాయతీల్లోని సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. అయితే జిల్లాలోని చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉంది. ఫలితంగా పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే కొనసాగుతోంది. సర్వే దృష్టిలో పెట్టుకుని సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అలా అయితేనే మన పంచాయతీలు పురస్కారాన్ని అందుకునే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ప'రేషన్..!'

సిరిసిల్ల : జిల్లాలోని చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీలో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం మూడు నెలల సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఏ దుకాణం వద్ద చూసినా లబ్ధిదారుల రద్దీ కనిపిస్తోంది. పలుచోట్ల డీలర్లు అందుబాటులో లేకపోవడం, సర్వర్లు డౌన్ అవడం వంటి ఇక్కట్లతో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. కొన్నిచోట్ల ప్రత్యామ్నాయ మార్గంగా వేరే దుకాణాల బాట పడుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడి వేలిముద్రను తీసుకుంటుండగా పంపిణీ ప్రక్రియ ఆలస్యమవుతున్న తరుణంలో ఇటువంటి సమస్యలు తలెత్తడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో దృష్టి సారించాలని కోరుతున్నారు.



**జిల్లాలో ఇలా..**

చౌకధరల దుకాణాలు : 345

జారీ చేసిన రేషన్ కార్డులు : 173578

ప్రతి నెలా పంపిణీ చేసే బియ్యం : 3,275 టన్నులు

సమస్యగా ఉంది: పాసికంటి సాయి, 23వ వార్డు, సిరిసిల్ల

మా వార్డులోని రేషన్ డీలర్ మృతిచెందడంతో దుకాణాన్ని మూసేశారు. ఇతర దుకాణాల వద్దకు వెళ్తే అక్కడ రద్దీ నెలకొంటోంది. ప్రస్తుతం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో చాలా సమయం పడుతోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

త్వరలో ఇన్‌ఛార్జిని నియమిస్తాం: మహేశ్‌కుమార్, తహసీల్దార్, సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణం 23వ వార్డులోని రేషన్ దుకాణం మూసివేత మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలువురు డీలర్లు తమను ఇన్‌ఛార్జిలుగా నియమించాలని విన్నవించారు. సిరిసిల్ల ఆర్డీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. త్వరలో ఇన్‌ఛార్జి డీలర్‌ను నియమిస్తాం. ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

## అతివల నేస్తం.. అవగాహన విస్తృతం

పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు బాలికలకు తమ సమీప బంధువు మొదట్లో సామాజిక మాధ్యమంలో సందేశాలు పంపేవాడు. కొద్ది రోజుల తర్వాత బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. దీంతో బాలికలు తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారు షీ టీంను సంప్రదించగా.. నిందితుడిపై కేసు నమోదైంది. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. కొందరు బాలికలు, యువతులు ధైర్యంగా ఎదుర్కొంటుంటే.. మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాఠశాల స్థాయిలోనే లైంగిక దాడులు, సైబర్ నేరాలు ఎదుర్కోవడంపై అవగాహన కల్పించేందుకు 'షీటీం' వ్యవస్థను ఏర్పాటు చేసింది. విద్యాసంస్థల్లోని బాలికల్లో చైతన్యం కల్పిస్తున్నారు. వారి ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**వ్యసనాల బారిన పడకుండా..**

విద్యాసంస్థల్లో బాలికలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు తీసుకోవాల్సిన ఆత్మరక్షణ చర్యలపై షీ టీం బృందాలు వివరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వాస్తవ సంఘటనలు వివరిస్తూ ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో దిశానిర్దేశం చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా నియంత్రణ, శారీరక, మానసిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలో సమావేశాల్లో వివరిస్తున్నారు. అమ్మాయిలు ఆకర్షణకు గురవకుండా మెలకువలు నేర్పిస్తున్నారు.



వ్యసనాలకు దూరంగా ఉండేందుకు భవిష్యత్తు లక్ష్యాలను చేరుకునేలా వివరిస్తున్నారు.ప్రాథమిక స్థాయిలోనే బాలికలు చట్టాలపై పట్టు సాధించేలా చొరవ తీసుకుంటున్నారు. విద్యతో మంచి జీవితం ఉంటుందని వివరిస్తున్నారు.

ఆత్మవిశ్వాసం పెంచేలా..బాలికలు, యువతులు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనేలా వారిలో ఆత్మవిశ్వాసం కల్పించడం.

అసభ్యకర ప్రవర్తన, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించడం.

సైబర్ నేరాల బారిన పడకుండా .జాగ్రత్తలు తీసుకోవాలో వివరించడం.

ఆపదలో ఉంటే ఎలా రక్షించుకోవాలో సలహాలివ్వడం.

దిశా నిర్దేశం చేశారు సెల్‌ఫోన్ వినియోగంపై కలిగే అనర్థాలను షీ టీం బృందం వివరించింది. ప్రస్తుతం యువత వ్యసనాలకు ఎలా బానిసవుతుందో అవగాహన కల్పించారు. ఏకగ్రాతతో చదివి ఉన్నతంగా ఎదిగేలా దిశా నిర్దేశం చేశారు.

లక్ష్మీప్రసన్న, పదో తరగతి, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల గోదావరిఖని

# పండ్ల తోటలకు ప్రోత్సాహం



మెట్‌పల్లి: పండ్ల తోటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

సంప్రదాయ పంటలను సాగు చేస్తున్న అన్నదాతలను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి పర్చాలని ఉపాధి హామీ పథకం కింద శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో రైతులతో పండ్ల తోటలు సాగు చేయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లక్ష్యం పెట్టుకున్నారు. అందుకనుగుణంగా ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలాల వారీగా పండ్ల తోటల పెంపకంపై జిల్లా అధికారులు లక్ష్యాన్ని కేటాయించారు. అయిదెకరాలలోపు ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులను గుర్తించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మామిడి, నిమ్మ, నారింజ, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్‌పామ్, నేరేడు, ఆపిల్ బేర్, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్ వంటి వాటిని తమ భూముల పరిస్థితికి అనుగుణంగా రైతులు ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మొక్కలను మొదట ప్రభుత్వం ఎంపిక చేసిన నర్సరీల నుంచి తెచ్చుకోవచ్చు. ఒకవేళ అవి నచ్చుకుంటే తమకు నచ్చిన నర్సరీల నుంచి కూడా కొనుగోలు చేయవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**నిర్వహణ ఖర్చులు సైతం..**

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం పలు రకాలుగా ప్రోత్సాహకం అందజేయనుంది. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను తవ్వించనున్నారు. మొక్కల రవాణా, నాటడం కూడా ప్రభుత్వమే భరిస్తుంది. నాటే సమయంలో కొన్ని రకాల ఎరువులను అందజేయనున్నారు. ఆ తర్వాత మొక్కలు ఎదిగేలా నీటిని అందించేందుకు సైతం చేయూతనిస్తారు. ఇలా మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం వెచ్చించనుంది. గతంలో జిల్లాలో పలు చోట్ల ఈ పథకం కింద రైతులు పండ్ల తోటల పెంపకం చేపట్టి ఫలసాయంతో ఆదాయం పొందుతున్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**లక్ష్యం చేరేనా!**

జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో పండ్ల తోటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు 280 మంది రైతులు 464.85 ఎకరాల్లో సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 136 మంది రైతులకు సంబంధించి 270 ఎకరాలకు అధికారులు అంచనాలు రూపొందించారు. ఇందులో 65 ఎకరాల్లో గుంతలు తవ్వడం ప్రారంభించారు. వర్షాలు కురిసే సమయంలో మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టనున్నారు. అంతలోపే ఆసక్తి ఉన్న రైతులను గుర్తిస్తేనే లక్ష్యం నెరవేరే అవకాశముంది.

# అన్నదాత చూపు.. ఆకాశం వైపు



పెద్దపల్లి : తొలకరి పలకరించినా వరుణుడు ముఖం చాటేశాడు. మృగశిర కార్తె చివరకు వచ్చినా రుతుపవనాల జాడ లేదు. వానాకాలంలోనూ ఉక్కపోతనే తప్ప వానలు లేక అన్నదాత ఆకాశం వంక చూడాల్సి వస్తోంది. విత్తులు నాటేందుకు దుక్కులు సిద్ధం చేసి నిరీక్షించక తప్పడం లేదు. వానలు కురవకపోతాయా! అన్న ఆశతో పత్తి విత్తుకున్న రైతులు.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో విత్తనాలు మాడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈ వానాకాలం నుంచి పంటల సీజన్‌ను కొద్ది రోజులు ముందుకు తీసుకెళ్లాలని వ్యవసాయ శాఖ భావించగా వర్షాలు ఆలస్యం కావడంతో ఈసారి అమలు కాలేని పరిస్థితి నెలకొంది.

**2,76 లక్షల ఎకరాల్లో సాగు అంచనా**

జిల్లాలో ఈ వానాకాలంలో 2.76 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి, 52 వేల ఎకరాల్లో పత్తి, 12 వేల ఎకరాల్లో ఉద్యాన, ఇతర పంటలు సాగవుతాయని ప్రణాళికలు రూపొందించారు. ప్రధానంగా ఎస్సారెస్పీ కాలువల ఆధారంగానే జిల్లాలో పంటలు సాగు చేస్తున్నారు. కాళేశ్వరం పథకం బ్యారేజీల్లో నీటిని నిల్వ ఉంచకపోవడంతో గోదావరిలో చుక్క నీరు లేదు. మానేరు, హుస్సేన్‌మియా వాగుల్లోనూ ఇదే పరిస్థితి. వర్షాలు లేకపోవడంతో బోరుబావుల కింద పంటల సాగుకు రైతులు వెనుకాడుతున్నారు.

**రెండేళ్ల కిందటి పరిస్థితి**

గడిచిన రెండేళ్ల గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సాధారణం 102.2 మి.మీ.కాగా ఇప్పటివరకు 28.2 మి.మీ. కురిసింది. అంటే 72 మి.మీ. లోటు కనిపిస్తోంది. గతేడాది ఇదే నెలలో 161.8 మి.మీ.ల సాధారణ వర్షపాతానికి 192.7 మి.మీ.లతో అధికం నమోదైంది. రెండేళ్ల కిందట 42.4 మి.మీతో 74 మి.మీ.లోటు ఏర్పడింది. అంటే రెండేళ్ల కిందటి పరిస్థితులు ఈసారి కనిపిస్తున్నాయి.

జూన్ మూడో వారం ముగుస్తున్నా వర్షం కురవకపోవడంతో ఆరుతడి పంటల సాగుపై రైతుల్లో ఆయోమయం నెలకొంది.

జిల్లావ్యాప్తంగా రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. పది రోజులుగా చినుకు జాడలేదు.

ఇప్పటివరకు కేవలం 1,300 ఎకరాల్లో మాత్రమే పత్తి విత్తనాలు నాటారు. 54 ఎకరాల్లో వరి నార్లు పోసుకున్నారు. పెరుగుతున్న ఎండలతో పత్తి విత్తనాలు మాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్వల్పకాలిక రకాలే మేలు

వానలు కురిసిన తర్వాతే పత్తి విత్తనాలు నాటుకొనేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరి సాగులో స్వల్పకాలిక విత్తనాలను ఎంచుకోవాలి. సన్నరకమైతే కూనారం 1638, దొడ్డు రకాల్లో ఎంటీయూ 1010, కేఎన్ఎం 118 రకాలు సాగు చేసుకోవచ్చు. జులై మొదటి వారమైతే ఆర్ఎన్ఆర్ 1548 సన్నరకం విత్తుకోవాలి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేలా ప్రత్యామాయ చర్యలపై దృష్టి సారించాం. ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

# అధికారుల నిర్లక్ష్యం.. కాలువకు శాపం



హాలియా : నల్గొండ, సూర్యాపేట జిల్లా రైతాంగానికి వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ ఎడమకాలువ కట్టల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యమా..అధికారుల పర్యవేక్షణ లోపమా అన్నట్లుగా ఉంది. ఎడమకాలువ నిర్మాణ సమయంలో ఇరువైపులా ఎనిమిది అడుగుల వెడల్పుతో భారీగా కరకట్టలు, కట్టల కింది భాగంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా రాకపోకలు సాగించడానికి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన కాలువ కట్టలపై ఎక్కడ పడితే అక్కడ వ్యాపార, ఇతర వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు. ఈ వ్యర్థాల కారణంగా ఎలుకలు పంది కొక్కులు రంధ్రాలు చేసి బుంగలు పడే ప్రమాదం ఉంది. గతంలో నిడమనూరు వద్ద కట్టకు బుంగ పడి సమయంలో ఎలుకల కారణంగా పడిందని అధికారులు తెలిపినట్లు సమాచారం. దీంతో సుమారు పదిహేను రోజుల వరకు కాలువలో నీటిని నిలుపుదల చేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏడాది ప్రభుత్వం కట్టలపై గుంతలు పడిన చోట మట్టితో పూడ్చటం, భారీగా పెరిగిన కంప చెట్లను తొలగించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వ కాలం నుంచి నేటి వరకు కట్ట సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు శూన్యమని రైతులు ఆరోపిస్తున్నారు. పంటల సమయంలో కట్టకు నష్టం వాటిల్లే ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు కట్టపై తిరగడాన్ని అధికారులు అరికట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన కాలువ కట్టపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో కట్ట కుంగి లైనింగ్ జారే అవకాశం ఉంటుందని. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. సమస్యపై ఎన్నెస్పీ, ప్రధాన కాలువ డీఈ వెంకటయ్యను వివరణ కోరగా నాగార్జునసాగర్ ఎడమకాలువ మరమ్మతులకు రూ. 60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు చేపడుతామన్నారు.

# వరించని వానలు.. 'విత్తు'కోని ఆశలు

ఖమ్మం: మే నెలలో మురిపించిన వరుణుడు జూన్‌లో ముఖం చాటేశాడు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసినా.. సాగునీటి ప్రాజెక్టులు కళకళలాడేవి. ఇంకోపక్క ఎండలు దంచికొడుతుండటంతో ఉన్న నీరూ ఆవిరవుతోంది. సాగర్ జలాశయంపైనే ఖమ్మం జిల్లాలోని 2.52 లక్షల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. వైరా ప్రాజెక్టులో నీరున్నా.. ప్రణాళిక ప్రకటించకపోవడంతో కర్షకులు నిరీక్షిస్తున్నారు. ముందే నార్లు పోసుకున్న వారు చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. ఉభయ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పాలేరు.. తప్పని ఎదురుచూ

పులుగరిష్ఠ నీటిమట్టం: 23 అడుగులు

ప్రస్తుతం: 13.75

ఆయకట్టు: 20 వేల ఎకరాలు (ఎన్నెస్పీ పరిధిలో 2.52 లక్షల ఎకరాలు)

సామర్థ్యం: 2.558 టీఎంసీలు

ప్రస్తుతం: 1.185

ఎగువన వర్షాలు కురవకపోవడంతో సాగర్ జలాశయానికి నీటిరాక లేదు. సాగర్ నిండితేనే పాలేరు ఆయకట్టు కళకళలాడుతుంది. సాధారణంగా ఎన్నెస్పీ పరిధిలో జులై 15 తరువాత నీటిని విడుదల చేస్తారు. ఈలోపు దుక్కులు దున్నుకొని.. నారు మడులు సిద్ధం చేసుకుంటారు. సాగర్‌కు వరద రాకపోవడంతో పాలేరు జలాశయం పరిధిలో నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

**వైరా.. అయోమయం**

18.30 అడుగులు

14.11 20,000 ఏటా జలాశయం పరిధిలో జూన్ మూడో వారంలో నార్లు పోసుకుంటారు. జులై చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారం మధ్యలో నాట్లు వేస్తుంటారు. ప్రస్తుతం నారు పోసుకునే సీజన్ మొదలైనా.. అధికారులు సాగునీటి ప్రణాళిక విడుదల చేయలేదు. రానున్న నీటి విడుదలపై స్పష్టత లేకపోవడంతో రైతులు నార్లు పోసుకోవడానికి వెనకంజ వేస్తున్నారు. బోర్లు ఉన్నవారు మాత్రం ఇప్పటికే నార్లు పోసుకొని నీటి రాక కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎగువ నుంచి వరద రాకపోవడంతో రోజురోజుకూ నీటిమట్టం గణనీయంగా తగ్గుతోంది.

పెద్దవాగుకు గండి బెంగ

6.10 మీటర్లు

డెడ్‌స్టోరేజీ (87.411 ఎంసీఎఫ్టీ)

ఆయకట్టు: 16 వేల ఎకరాలు (తెలంగాణలో నాలుగు వేలు)

గతేడాది జులై 18న వచ్చిన వరదలకు పెద్దవాగు కట్టకు పెద్దగండి పడింది. నాలుగు చోట్ల ధ్వంసమైంది. మరోచోట కోతకు గురైంది. రూ. 3.5 కోట్లతో తాత్కాలికంగా రింగ్‌బండ్(అడ్డుకట్ట) కట్టారు. పూర్తిస్థాయి మరమ్మతులకు రూ. 92 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన జీఆర్ఎంబీ(గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సమావేశంలో రూ. 19 కోట్లు ఇవ్వడానికి ఏపీ నీటిపారుదలశాఖ అధికారులు అంగీకరించారు. నేటికీ ఒక్క పైసా విదల్చకపోవటంతో మరమ్మతులు అటకెక్కాయి. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే రింగ్‌బండ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవకపోవడంతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు నార్లు పోసుకోవడానికి నిరీక్షిస్తున్నారు.

తాలిపేరు.. లేదు చుక్కనీరు

74 మీటర్లు డెడ్‌స్టోరేజీ

24,760 ఎకరాలు రాష్ట్రంలో ముందుకు వరి నాట్లు ప్రారంభమయ్యే ఆయకట్టు ఇది. ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు కురవకపోవడంతో నీటిరాక తగ్గింది. ప్రాజెక్టు పరిధిలో బోర్ల ఆధారంగా రైతులు అక్కడక్కడా నార్లు పోసుకున్నారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో నార్లు పోసుకొని, జులై మొదటి వారంలో నాట్లు వేస్తుంటారు. ప్రసుత వర్షాభావ పరిస్థితులతో ఆలోచిస్తున్నారు. ఈ సంవత్సరం నాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

# పేరుకే తెలంగాణ తిరుపతి.. ఏపీ బస్సులే గతి

మధిర : ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి తెలంగాణ తిరుపతి అన్న పేరుంది. కానీ పుణ్యక్షేత్రానికి ఆంధ్రప్రదేశ్ బస్సులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. రవాణా సదుపాయం లేకపోవటంతో ఉభయ జిల్లాల్లోని భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండో అతిపెద్ద దేవాలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

శ్రీవారి ఆలయానికి మధిరతోపాటు ఖమ్మం, భద్రాచలం, సత్తుపల్లి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆయా డిపోల నుంచి బస్సు సదుపాయం లేకపోవటంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఖమ్మం డిపో బస్సులు జమలాపురం వచ్చి ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్లేవి. అలాగే భద్రాచలం డిపో వాహనాలు ఆలయానికి వచ్చి వెళ్లేవి. నేడు ఆ సర్వీసులు ఒక్కటీ లేవు.ఖమ్మం పరిసర ప్రాంత వాసులు కొందరు వ్యక్తిగత వాహనాల్లో శ్రీవారి వద్దకు వస్తుండగా ఇంకొందరు ఎర్రుపాలెం వరకు రైలు మార్గంలో వచ్చి ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

జమలాపురం నుంచి మధిర మీదుగా భద్రాచలం వరకు ఏర్పాటు చేసిన సర్వీసును పది రోజులకే ప్రయాణికులు ఉండటం లేదని



నిలిపివేశారు. ఖమ్మం నుంచి మధిర మీదుగా జమలాపురం వరకు, భద్రాచలం నుంచి నేమలి మీదుగా జమలాపురానికి బస్సు లు నడిపితే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

'మధిర, ఖమ్మం డిపోల నుంచి బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఏపీకి చెందిన చెందిన సర్వీస్‌లను నడుపుతున్నారు. సమస్యపై ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు విన్నవించాం.' ఉప్పల శ్రీనివాస్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు

'జమలాపురం ఆలయానికి బస్సు సర్వీస్‌లు ఏర్పాటు చేశాం. ఆదాయం అంతగా లేకపోవటంతో నిలిపివేశాం. భక్తులు ఆర్టీసీని ఆదరిస్తే ఎన్ని సర్వీసులైనా ఏర్పాటు చేస్తాం. '

శంకర్‌రావు, డిపో మేనేజర్

# పశు సంపదకు యాంత్రీకరణ దెబ్బ

వికారాబాద్: వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో పశు పోషణపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఏటా పెరుగుతున్న యాంత్రీకరణతో పశుసంపద ప్రశ్నార్థకంగా మారుతోంది. రెండు దశాబ్దాల కిందట ఎకరం పొలమున్న రైతుల దగ్గర సైతం రెండు కాడెడ్లు ఉండేవి. కాలానుగుణ పరిస్థితులతో పశుపోషణ భారంగా మారి నాలుగేళ్లలో జిల్లాలో 57,148 పశు సంపద తగ్గడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే..**

యాంత్రీకరణతో పశుసంపదకు భారీ నష్టం వాటిల్లుతోంది. వ్యవసాయ పనులు చేసే ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు, పంట నూర్పిడి యంత్రాలొచ్చాయి. దీంతో పశుపోషణపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోయింది. రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే పశుసంపద సగానికిపైగా తగ్గింది. పాడికి బదులుగా గ్రామాల్లోకి పాల ప్యాకెట్లు వచ్చాయి. రసాయన ఎరువుల



వాడకంతో పంటలు పండిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువులిచ్చే పశువులు తగ్గిపోతున్నాయి.

**అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?**

ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినా అక్రమ రవాణా ఆగడం లేదు. వ్యవసాయానికి పనికి రాని, వయసు పైబడిన పశువులను మాత్రమే పశువైద్యుడి ధ్రువీకరణ మేరకు కబేళాలకు తరలించాలి. దూడలు మొదలుకొని ఇతర పశువులను కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

గ్రామ పంచాయతీలు: 566
పశువైద్య కేంద్రాలు: 96
తాలూకా స్థాయిలో: 05
మండల స్థాయిలో: 33
గ్రామీణ స్థాయిలో: 58

# జేఎన్‌టీయూ జంక్షన్.. దాటాలంటే టెన్షన్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతాల్లో జేఎన్‌టీయూ జంక్షన్ ఒకటి. రైల్వేట్రాక్‌పై వంతెన నిర్మించడంతో రద్దీ మరింత పెరిగింది. కానీ, వాహనాలు, జనాభాకు తగ్గట్టు జంక్షన్ అభివృద్ధి ఆ స్థాయిలో జరగలేదు. దీంతో రోడ్డు దాటేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఒకసారి సిగ్నల్ పడితే సుమారు 200 మంది పాదచారులు జాతీయ రహదారి దాటుతున్నారు. ఇందుకు 60 సెకన్లు మాత్రమే ఉండడంతో పరుగులు తీయాల్సి ఉంటుంది. సిగ్నళ్లు మొరాయించి, ట్రాఫిక్ సిబ్బంది లేకుంటే వాహనాలు జీబ్రా గీతలపైకి రావడంతో పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. సిబ్బంది



రాత్రి ఒంటి గంట వరకు విధుల్లో ఉంటారు. అప్పటి నుంచి ఉదయం పోలీసులు విధుల్లోకి వచ్చేంత వరకు నియంత్రించే వారుండరు. ఆ సమయంలో జరిగే ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు.

**చక్రబంధంలో పాదచారి:** జాతీయ రహదారి దాటే పాదచారులే కాకుండా చౌరస్తాకు అనుసంధానంగా ఉన్న మార్గాల్లో పాదచారుడి పరిస్థితి చక్రబంధంలో ఇరుక్కునట్టే మారుతోంది. జాతీయ రహదారిలో సిగ్నల్స్ ఉండగా.. మిగతా మార్గాల్లో ఆ నియంత్రణ లేక వాహనాలు ఢీకొట్టే అవకాశముంది. పాదచారుల వంతెన నిర్మించేందుకు అంత స్థలం లేదు. మెట్రో రైలు ట్రాక్ కింద ఎత్తు సరిపోదు. అండర్ పాస్ నిర్మాణానికి వీల్లేదు. చౌరస్తాలో ప్రస్తుతం మలుపు విస్తరణ అభివృద్ధిలో ఉంది. ముమ్మందు రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ తరహాలో స్కైవాక్ అభివృద్ధి చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. స్కైవాక్‌తో ట్రాఫిక్ జామ్ లేకుండా ఇబ్బందులు తీరుతాయని పాదచారులు సూచిస్తున్నారు.

2019–2025 మధ్య ప్రమాదాల్లో..
మృతులు : ఐదుగురు
గాయాలపాలైన వారు : 15మంది

# మిస్ వరల్డ్ సంబరాలు.. మెట్రో సొబగులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అతిథ్యం ఇస్తున్న మిస్ వరల్డ్ పోటీల్లో హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ నేను సైతం అంటూ భాగస్వామ్యమైంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మెట్రోరైలు సంస్థ అందాలపోటీలపై విస్తృత ప్రచారం చేపట్టింది. తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటూ ప్రపంచ సుందరీమణులను తెలంగాణకు పరిచయం చేసేలా ప్రచారం చేపట్టింది. హైటెక్‌సిటీ నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు ఉన్న మెట్రో స్టేషన్లు, స్తంభాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న మెట్రో రైలింగ్‌లకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మెట్రోరైలు స్క్రీన్లపైన, స్టేషన్ ఫ్లాట్‌ఫామ్ ప్రకటనల బోర్డులపై మిస్ వరల్డ్ వేడుకలను ప్రతిబింబించేలా ప్రచారం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మెట్రోరైలులో ప్రచారం ద్వారా తెలంగాణ వారసత్వ సంపదను నలుగురికీ తెలియజేసే బృహత్ కార్యక్రమంలో భాగస్వామ్యమైందని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆధ్యాత్మిక సంరంభం, అమ్రాబాద్ పులుల అభయారణ్యం, రామప్ప దేవాలయం, బోనాలు, బతుకమ్మ, చారిత్రక కట్టడం చార్మినార్‌తో సహా పలు విశేషాలతో కూడిన ఆకర్షణీయ చిత్రాలతో మెట్రోరైలు మరింత విస్తృత ప్రచారం కల్పించిందని చెప్పారు.

**అందమా.. చందమా** ప్రపంచ సుందరి తుది పోటీలకు సమయం దగ్గరపడుతోంది. అందాలభామలు రకరకాల పోటీలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. వారు బస చేసిన మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో సందడి చేస్తున్నారు.

# పర్యవేక్షణ కొరవడి.. అవినీతికి అడుగులు పడి



హైదరాబాద్: కోటిన్నర మంది ప్రజలకు సేవలందించే హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ)లో పరిపాలన గందరగోళంగా మారింది. పలువురు ఉద్యోగులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. సొంత కార్యక్రమాలు, అడ్డదారిలో సంపాదించిపెట్టే పనులకే కొందరు ఉన్నతాధికారులు ప్రాధాన్యమిస్తుండగా.. కింది స్థాయిలో పనిచేసే ఉద్యోగులు వసూళ్ల కోసం అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారు. గడిచిన రెండేళ్లలో నలుగురు కమిషనర్లు మారడంతో విభాగాల వారీగా పర్యవేక్షణ లోపించిందనే విమర్శలొస్తున్నాయి.

**పారిశుద్ధ్య విభాగంలో దందా..**

నగరంలో పొరుగు సేవల కింద 18,557 మంది, శాశ్వత ప్రాతిపదికన 2,365 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. శాశ్వత కార్మికులు 10శాతం కూడా విధుల్లో కనిపించరు. ప్రైవేటు వారికి ముఖహాజరు ఉండటంతో హాజరైన పని దినాలకే జీతం చెల్లిస్తారు. కార్మికులను పర్యవేక్షించే శానిటరీ జవాన్లదీ అదే దారి. చాలామంది ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో నకిలీ చలాన్లు విధించడం, ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు చెల్లించాలంటూ జనాల నుంచి లంచాలు తీసుకోవడం, ఇతర దందాల్లో మునిగి తేలుతున్నారు.

**రవాణా విభాగంలో దోపిడీ**

వాహనాల నిర్వహణ బాధ్యతలు చూసుకునే రవాణా విభాగంలో 1,600ల మంది ప్రైవేటు కార్మికులుండగా, వారిని ముఖ హాజరు విధానంలో చేర్చే పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. లేని వాహనాలకు మరమ్మతులు చేయడం, వాస్తవ ధరకు రెండింతలు చెల్లించినట్టు పరికరాలను కొనుగోలు చేయడం, టైర్లను సొంత వాహనాలకు వాడుకోవడం, డీజిల్ కూపన్ల పేరుతో ఏటా రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

**ప్రణాళికాబద్ధంగా..**

నగర ప్రణాళిక విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలను సంపాదన వనరుగా మార్చుకున్నారు. అనుమతి లేని నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. 60, 80 గజాల్లో ప్రమాదకరంగా ఆరు, ఏడు అంతస్తులు నిర్మిస్తుంటే అంతస్తుకు రూ.లక్ష, రూ.2లక్షలు వసూలు చేసుకుంటున్నారు. ఆ విభాగంలోని సగానికిపైగా అధికారులు పనివేళలు పాటించరు. ఇదేంటని అడిగితే క్షేత్రస్థాయి తనిఖీలంటారు.

**కమిషనర్ ఆదేశాలు బేఖాతరు..**

2023 నుంచి 2025 వరకు రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ఇలంబర్తి జీహెచ్ఎంసీకి కమిషనర్లుగా పని చేశారు. అందరూ తక్కువ కాలంలోనే బదిలీ అయ్యారు. చివరి కమిషనర్ ఇలంబర్తి.. అధికారులు సమయపాలన తప్పక పాటించాల్సిందేనని, విభాగాధిపతులు ఆ విషయాన్ని రోజూ పర్యవేక్షించాలని, హెచ్ఓడీలు సైతం సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య కార్యాలయంలో సందర్శకులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నెల క్రితం ఆయన బదిలీ అవడంతోనే ఆ విషయాన్ని అధికారులు పక్కకుపెట్టారు.

**పరిపాలనలోనూ..** జీహెచ్ఎంసీలో కొత్తగా నియామకమైన 200ల మంది జూనియర్ అసిస్టెంట్లలో 100 మందిని రెవెన్యూ విభాగానికి కేటాయించాలని అప్పటి అదనపు కమిషనర్ పరిపాలన విభాగాన్ని కోరారు. వందలాది మంది పదవీ విరమణ ప్రయోజనాలు, బదిలీ అభ్యర్థనలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు, తదితర అంశాలను పరిపాలన విభాగం అటకెక్కించింది.

# 'రసాయనం'.. నేల నిస్సారం



వికారాబాద్ : సాగు నేలలు రోజురోజుకూ నిస్సారమవుతున్నాయి. విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. భవిష్యత్తు తరాలు వ్యవసాయం చేయలేని విధంగా మారుతోంది. అవగాహన కల్పించేవారు లేక పంట దిగుబడి కోసం అన్నదాతలు ఇష్టానుసారంగా రసాయనాలు వాడుతున్నారు.

**జిల్లాలో 80 శాతం వ్యవసాయమే ఆధారం..**

జిల్లాలో 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5.95 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నాయి. అందులో పత్తి, కంది పంటలే 3 లక్షల ఎకరాల్లో పండించనున్నారు. ఎకరాకు 150 కిలోల డీఏపీ, వంద కిలోల యూరియాతోపాటు 95వేల మె.ట. రసాయన ఎరువులు అవసరం. వీటితో పంటలకు చీడపీడల బెడద అధికమవుతోంది. పంటలు పూత దశకు వచ్చాక పత్తికి 5–6, కందికి 3 సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది.

**పొంచి ఉన్న ప్రమాదం..**

బస్తాలో 46 శాతం మాత్రమే యూరియా ఉంటుంది. మిగతా 54 శాతం సున్నపు గుళికల్లాంటి మూలపదార్థం ఉంటుంది. దీనిపై యూరియా పూత(కోటింగ్) పూస్తారు. దాన్ని నేలపై చల్లడంతో 54 శాతమున్న మూల పదార్థం ఏటా నేలపై పేరుకుపోయి భూసారం తగ్గుతోంది. నేలలోని సహజమైన బ్యాక్టీరియాలు, వానపాములు నశించిపోతాయి. ఈ ఎరువులతో నేల గట్టిగా మారి కర్ర నాగలితో దున్నలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో భూములు పనికిరాకుండా పోతాయి.

**సరైన ప్రచారం లేక..**

సేంద్రియ ఎరువులపై సరైన ప్రచారం లేకపోవడంతో రైతులు వాటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా అవగాహన లేక రైతులు రసాయన ఎరువులనే విచ్చలవిడిగా వాడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. వ్యవసాయ భూముల్లో రోజురోజుకూ ఆమ్ల, క్షార లక్షణాలు పెరిగి భూసారం తగ్గి, సరైన దిగుబడులు రావడం లేదు. అంతేకాకుండా ఆరోగ్యం, పర్యావరణంపై రసాయన ఎరువులు ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్య నుంచి రైతులు బయట పడేందుకు సేంద్రియ ఎరువుల వినియోగం ఒక్కటే మార్గం. సేంద్రియ ఎరువుల తయారీ విధానం, వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంలో వ్యవసాయాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి.

**సేంద్రియ ఎరువులు వాడాలి..**

సాగు భూముల్లోని సారాన్ని కోల్పోకుండా ఉండేందుకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి. దీంతో భూమిలో పోషక విలువలు పెరిగి గుల్లగా మారుతుంది. నీటిని పీల్చుకొనే తత్వం వృద్ధి చెందుతుంది. దీంతో మొక్కలకు నీటితోపాటు పోషకాలు సమృద్ధిగా అందుతాయి. మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

# కరుణించి.. కష్టాలను దాటించండి



కరీంనగర్: ఇది శంకరపట్నం మండలం అర్కండ్ల సమీపంలోని లోతట్టు వంతెన. ఏటా చిన్న వర్షం పడినా వాగులోని నీరు పైనుంచి పారుతుంది. దీంతో కన్నాపూర్ నుంచి అటు వీణవంక మండలానికి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువుంటే కిలోమీటర్ల మేర దూరంగా ఉన్న మరో దారిలో గమ్యస్థానానికి చేరాల్సిందే! శంకరపట్నం నుంచి వీణవంక మండలంలోని పలు గ్రామాలకు అనుబంధంగా ఉన్న ఈ రోడ్డును విస్తరించినా.. ఈ చిన్న వంతెన స్థానంలో కొత్తది నిర్మించలేదు. ఇదే తరహాలో ఈ ఒక్క మండలంలోనే గద్దపాక–కాసాపూర్, చర్లపల్లి–కేశవపట్నం, గద్దపాక–అంబేడ్కర్‌నగర్‌లతోపాటు మరో ఆరు ఊళ్ల మధ్య ఇలాంటి సమస్యనే ఉంది. జిల్లావ్యాప్తంగా 83 చోట్ల ఇలాంటి లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు రెండేళ్ల కిందట గుర్తించిన సమస్యల్లో.. దాదాపుగా 70 శాతానికిపైగా వంతెనల మన్నిక బాగాలేదని, పూర్తిగా పైపులు శిథిలమయ్యాయనే నివేదికను ఉన్నతాధికారులకందించారు. రోడ్లు దెబ్బతిన్నప్పుడు కేవలం వాటి బాగు కోసమే తాత్కాలికంగా నిధులు మంజూరవుతుండటం, వీటిపై శ్రద్ధ పెట్టకపోవడంతో సమస్య పెరుగుతోంది. **8 కి.మీ.లు తిరిగి రావాల్సిందే** మానకొండూరు మండలం అన్నారం సమీపంలో వంతెన నిర్మించకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వరదనీరు చేరడంతో మానకొండూరు–జమ్మికుంట ప్రధాన రహదారికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దేవంపల్లి, పచ్చునూర్, కెల్లెడు, మద్దికుంట గ్రామాల వాసులు మండల కేంద్రానికి చేరుకోవాలంటే 8 కి.మీ తిరిగి రావాల్సిందే.

**ఆరు గ్రామాల ప్రజల అవస్థలు**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి సమీపంలోని లోతట్టు వంతెన వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. సమీపంలోని నాగిరెడ్డిపూర్ దారిలోనూ ఇదే పరిస్థితి తలెత్తడంతో ఆ మార్గంలో కొన్నాళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక కురిక్యాల–కొండన్నపల్లి మార్గంలోనూ వరద ప్రవాహం పెరిగిందంటే మండల కేంద్రానికి రావడమనేది ప్రజలకు సాహసమే! ఈ మండలంలో దాదాపుగా 6 గ్రామాల మధ్య ఇలాంటి విపత్కర పరిస్థితి ఉండటంతో రాకపోకలు నిలుస్తున్నాయి.

**ఒక్కోదానికి రూ.కోటికిపైనే..**

చిన్న వంతెనల స్థానంలో కొత్త పిల్లర్లు వేసి నిర్మించాలంటే ఒక్కోదానికి రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు దూరాన్ని బట్టి నిధులు అవసరమవుతాయి. వీటిని బాగు చేయాలని కొన్నేళ్లుగా అందిన వినతులకు మోక్షం లభించడంలేదు. గతేడాది జిల్లా వ్యాప్తంగా సైదాపూర్ సమీపంలోని ఒక్క వంతెన నిర్మాణానికి మాత్రమే నిధులొచ్చాయి. ఇటీవల టెండర్ ప్రక్రియ ముగిసింది. ఇప్పటికైనా ఆయా మండలాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటి విషయంలో యంత్రాంగం చొరవ చూపించాలి.

# చిన్నారులను ఆకర్షించేలా అంగన్‌వాడీలు

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ప్రవేశాలు పెంచడానికి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వయసుల వారీగా సర్వే చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రైవేట్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేరిన వారిని గుర్తించింది. మూడేళ్లలోపు పిల్లలు ప్రైవేట్ వైపు మళ్లకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. పౌష్టికాహారంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను సమర్థంగా అందిస్తామని ప్రచారం చేస్తున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి, పిల్లలున్న ఇళ్లకు వెళ్లి వారిని కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు చేపట్టారు.

**ప్రత్యేక ప్రయత్నాలు** జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో పిల్లలు చేరేలా వారిని ఆకర్షించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అద్దె భవనాల్లో ఉన్న వాటిని అవకాశమున్న ప్రాథమిక పాఠశాల భవనాల్లోకి మార్చుతు న్నారు. చిన్నారులకు ఏకరూప



దుస్తులు, గోడలపై ఆకర్షణీయంగా, నేర్చుకునే విధంగా అంకెలు, పండ్ల పేర్లతో పెయింటింగ్స్, వయసుల వారీగా ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలతో బోధనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**జిల్లాలో వివరాలు..**

మూడేళ్లు దాటిన చిన్నారులు : 8,834
అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన వారు : 6,138
నాలుగేళ్లు దాటిన వారు 5,672
అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేవారు : 2,620


**పిల్లల సంఖ్య పెరిగేలా కృషి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరగడానికి కృషి చేస్తున్నాం. జిల్లా పాలనాధికారి ఆదేశాలను అనుసరించి ప్రత్యేక సర్వే చేపట్టాం. కేంద్రాల్లో చేరని పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నం చేస్తాం.ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

# నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర

తాండూరు: తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌తో సంబంధం లేకుండా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. ఇటీవల ఓ అధికారి అక్రమాలకు పాల్పడ్డాడన్న ఆరోపణలతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కార్యాలయంలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. త్వరలో విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

**ఉత్తర్వులను విస్మరించి..:** రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖ ఫిబ్రవరిలో ఇచ్చిన ఉత్తర్వులను విస్మరించి తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఉత్తర్వుల ప్రకారం సంబంధిత సర్వే నెంబరులో 2020 ఆగస్టు 26 నాటికి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా 10 శాతం ప్లాట్లు అమ్ముడుపోవాలి. మిగిలిన 90 శాతం ప్లాట్లను నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలను



పక్కనబెట్టి ఏకంగా 220కుపైగా ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు వెలుగులోకొచ్చింది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దస్తావేజు లేఖరులు, కార్యాలయ సిబ్బంది కలిసే వ్యవహారం నడిపించారనే ఆరోపణలున్నాయి. నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది.

**ఇద్దరు అధికారులు సెలవులో ఉన్నప్పుడు..**

తాండూరు సబ్‌రిజిస్ట్రార్ సాయికుమార్ ఏప్రిల్ 22 నుంచి ఈనెల 17 వరకు సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి పవన్‌కుమార్ ఇన్‌ఛార్జిగా వచ్చారు. ఆయన ఈనెల 12 నుంచి 23 వరకు సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ సహాయకుడు ఫసియుద్దీన్ విధుల్లో చేరారు. ఆయన ఈనెల 12– 17 వరకు నిర్వహించిన 220కిపైగా రిజిస్ట్రేషన్లలో చాలావరకు అక్రమమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇటీవల ఆయన్ను సస్పెండ్ చేశారు. ఎల్ఆర్ఎస్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని ఓ అధికారి తెలిపారు.

# మాతా శిశు సంరక్షణ కార్డుల కొరత

ఆదిలాబాద్ : జిల్లాలో ఏడాదిగా మాతా శిశు సంరక్షణ కార్డు(ఎంసీపీ – మదర్–చైల్డ్ ప్రొటెక్షన్) కార్డుల కొరత వేధిస్తోంది. మాతా, శిశు మరణాలను సమర్థంగా నివారించడంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్డులను ప్రవేశపెట్టింది. ఆ కార్డుల్లో గర్భిణుల పూర్తి వివరాలు, వారి ఆరోగ్య సమస్యలు, ఇది వరకు ప్రసవమైతే ఆ వివరాలు, గర్భస్థ శిశు వివరాలు, బరువు, ప్రస్తుతం అందించిన వైద్యం, ముమ్మందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు/చికిత్సలు తదితర వివరాలను నమోదు చేస్తేనే మాతా శిశు మరణాలను అరికట్టడం సాధ్యమవుతుంది. ఒక మహిళ మొదటి నెల గర్భిణి అయిన నుంచి తొమ్మిదో నెల వరకు.. ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించిన వైద్యం తదితర వివరాలన్నీ అందులో నమోదు చేస్తారు. జిల్లాలో ఈ కార్డులకు కొరత ఏర్పడటంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్డులు అందుబాటులో లేక పలు చోట్ల పాత కార్డులను జిరాక్స్ తీయించి అందులోనే రాస్తున్నారు. జిరాక్స్ కాగితాలు నాణ్యంగా ఉండకపోవటం వల్ల దీర్ఘకాలం మన్నే అవకాశాలు తక్కువ. ఒక్కో కార్డు జిరాక్స్ తీసుకోవాలంటే రూ.50 నుంచి వంద వరకు వ్యయం చేయాల్సి వస్తోంది.

**జిల్లాలో 9,213 మంది గర్భిణులు**

జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,239 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. వీరెవరికి మాతా శిశు సంరక్షణ కార్డులు అందుబాటులో లేవు. జిల్లాలో ప్రస్తుతం మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణులు మొత్తం 9,213 మంది ఉన్నారు.

**ఈ నెలలో సరఫరా అవుతాయి** : సాధన, మాతా శిశు సంరక్షణాధికారిణి


చాలా రోజుల నంచి ఎంసీపీ కార్డుల కొరత కొనసాగుతోంది. ప్రస్తుతం జిరాక్స్ తీసిన కాపీలపైనే వివరాలను నమోదు చేస్తున్నాం. జిల్లాకు నెలకు కనీసం ఒక వేయి కార్డులు అవసరం అవుతాయి.

# అందొచ్చినా.. అందిపుచ్చుకోరేం..?

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధులు జిల్లాలో సద్వినియోగం కావడం లేదు. మొదటి విడతలో ఎంపిక చేసిన బడుల్లో అరకొరగా పనులు చేపట్టారు. ఈ పథకం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చుతుంది. గతేడాది ముందస్తుగానే పాఠశాలల ఖాతాల్లో సొమ్ము జమ చేసినప్పటికీ ప్రణాళిక ప్రకారం పనులు చేయకపోవడంతో వెనక్కి మళ్లింది. అన్నీ పక్కాగా ఉంటేనే నిధులు విడుదల చేస్తామని సమగ్ర శిక్షా అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ కమిటీలు ముందుకు రావడం లేదు.

**ప్రతిపాదనల మేరకు వసతుల కల్పన**

పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రధానోపాధ్యాయుడు, కమిటీ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనల మేరకు పీఎంశ్రీ పథకంలో నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారు. గ్రంథాలయం, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాలల నిర్మాణం, మైదానంలో వసతుల కల్పన, ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భజలాల వృద్ధి, విభిన్న ప్రతిభావంతుల కోసం ర్యాంప్‌ల నిర్మాణం, పిల్లలకు ఆకుకూరలు, పౌష్టికాహారం అందించేందుకు వీలుగా కిచెన్‌గార్డెన్, శుద్ధజల ప్లాంట్, ఇతర వసతుల కల్పనకు నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. 2024లో మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 33 బడులు ఎంపికయ్యాయి. ముందస్తుగానే నిధులు ఖాతాల్లో జమ చేశారు.




సకాలంలో పనులు నిర్వహించకపోవడంతో ఈ ఏడాది మార్చిలో వెనక్కి మళ్లాయి.

సోంపేట ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద ప్రయోగశాల భవన నిర్మాణం పూర్తి కాగా ఇంకుడుగుంతలు, ర్యాంపులు ఇతర పనులు చేపట్టలేదు. బడి ఖాతాలో నిధులు వెనక్కి మళ్లడంతో మిగిలినవి చేపట్టడానికి చర్యలు తీసుకోవడం లేదు.

మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాలలో రన్నింగ్ ట్రాక్, ఇంకుడు గుంతల ఏర్పాటు తప్ప మిగిలిన పనులు చేపట్టలేదు. గ్రంథాలయం భవన నిర్మాణం పునాది దశలోనే ఉంది. కేటాయించిన నిధుల్లో రూ.22.20 లక్షలు మూడు దశల్లో వెనక్కి మళ్లాయి.

**సకాలంలో పూర్తి చేయాలి..**

సకాలంలో పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయి. పనులు చేపడితే బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. సమగ్ర శిక్షా ఖాతాలోనే నిధులు ఉండటంతో బిల్లుల చెల్లింపునకు ఇబ్బందులు తలెత్తవు. కమిటీ సభ్యులతో మాట్లాడి మిగిలినవి చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానాల అభివృద్ధి విషయంలో వివాదాలు ఉండటంతో వసతుల కల్పనకు అవకాశం కలగడం లేదు.

ఎం.బెనర్జీ, ఏఈ, సమగ్ర శిక్షా

# పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం..!

ఎచ్చెర్ల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. డిప్లొమా కోర్సుల్లో చేరాలనుకునేవారికి శనివారం నుంచి పది రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిసెట్-2025లో అర్హత సాధించిన వారంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. జిల్లాలో ఐదు ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో అన్ని బ్రాంచులు కలిపి ప్రభుత్వ కళాశాలల్లో 810 సీట్లు, ప్రైవేటులో 1,520 సీట్లు భర్తీ చేయనున్నారు. జిల్లాలో సివిల్, సీఎంఈ, ఈఈఈ, ఎంఈసీ, సీసీపీ, ఈసీఈ, ఏఈఐ బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి. గతేడాది అన్ని ప్రభుత్వ కళాశాలల్లోనూ శత శాతం మంది విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల్లో వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. తక్కువ విద్యార్హతతో ఉద్యోగం రావటమే కాక ఉద్యోగం చేస్తూ బీటెక్ చదువుకునే



వెసులుబాటు సైతం పలు సంస్థలు కల్పిస్తున్నాయి.

**ఇవి గుర్తుంచుకోండి..** కౌన్సెలింగ్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27 వరకు ప్రాసెసింగ్ రుసుం చెల్లించుకోవచ్చు. ఓసీ, బీసీ కేటగిరీ వాళ్లు రూ.700, ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందితే రూ.250 చెల్లించాలి. దీంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు అందజేయాలి. ఆదాయ ధ్రువపత్రాలు 01-01-2022 తర్వాత జారీ చేసినవి మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.


**ఐచ్ఛికాల ఎంపికలో జాగ్రత్త..**

ప్రవేశాల్లో కళాశాలలు, బ్రాంచుల ఎంపికకు సంబంధించి ఈ నెల 25 నుంచి 30 వరకు ఐచ్ఛికాల ఎంపిక ఉంటుంది. వీటిల్లో విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇంటర్‌నెట్ కేంద్రాలు, ఇతర ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తే మోసపోయే ప్రమాదం ఉంది. ఎవరికీ పాస్‌వర్డు ఇవ్వకుండా సొంత చరవాణి నంబరు ఇచ్చుకోవాలి. కళాశాలల్లోని ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాల్లోనే సిబ్బంది అన్ని విధాల ఉచితంగానే సేవలందిస్తారు. ఏ సందేహం ఉన్నా ఆయా కేంద్రాలను మాత్రమే ఆశ్రయించడం మంచిది. ఏయే రోజుల్లో ఏ ర్యాంక్‌ల వారికి కౌన్సెలింగ్ ఉంటుందన్న సమాచారం కళాశాలల్లో ప్రదర్శించారు.

**సహాయ కేంద్రాన్ని వినియోగించుకోండి..**

ఎచ్చెర్ల మండలం కుశాలపురంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. అక్కడే పది రోజులపాటు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. ఏరోజు ఎవరు కౌన్సెలింగ్ రావాలి, ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలనే వివరాలు అందుబాటులో ఉంచాం. ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా సహాయ కేంద్రానికి వచ్చి సిబ్బందిని సంప్రదించవచ్చు. సహాయ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కె.నారాయణరావు, సహాయకేంద్రం జిల్లా సమన్వయకర్త

# ఆపత్కాలం.. అందని పరిహారం



విజయనగరం : కేంద్రం ప్రభుత్వం 'హిట్ అండ్ రన్' కేసులను ప్రత్యేకంగా పరిగణించి మోటారు వాహన చట్టం కింద ప్రత్యేక పరిహారానికి అవకాశం కల్పిస్తోంది. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు.. క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేస్తున్నా.. అవగాహన లేమి, అధికారులు బాధ్యతారాహిత్యంతో లబ్ధి కోల్పోతున్నారు. పదుల సంఖ్యలో దరఖాస్తులకు సైతం మోక్షం కలగడంలేదు. హిట్ అండ్ రన్ కేసుల విషయంలో కలెక్టర్ అంబేడ్కర్ ఆరు నెలల కిందట సమీక్షించారు. అలసత్వం వద్దని, త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. అయినా అధికార యంత్రాంగంలో చలనం రాలేదు. ఈ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంటతో ఆ దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు.

**ఆర్డీవో నోడల్ అధికారిగా..**

ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించలేని పరిస్థితుల్లో పోలీసులు కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ విభాగం కింద వచ్చే కేసులకు ఆర్డీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఘటనపై ఎఫ్ఐఆర్ కాపీతో పాటు పూర్తి సమాచారాన్ని పోలీసులు అందజేయాలి. ఆర్డీవో క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తారు. నివేదిక అందిన 15 రోజుల్లో పోలీసులు తుది ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో జాతీయ రహదారులు రాజాపులోవ నుంచి కందివలస గెడ్డ, చెల్లూరు నుంచి గజపతినగరం రోడ్డు మీద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. కొందరు మృత్యువాత పడుతుంటే మరికొందరు తీవ్రంగా గాయపడి వికలాంగులుగా మిగిలిపోతున్నారు.

**దరఖాస్తుల సమర్పణ ఇలా..**

క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యులు తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. క్షతగాత్రులు ఫారం-1 ద్వారా వ్యక్తిగత వివరాలతో పాటు ఘటనా స్థలం, సాంకేతిక ఆధారం, సమయం, ప్రమాద తీవ్రత పత్రం, ఎఫ్ఐఆర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జతచేయాల్సి ఉంది. మృతుల తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వామి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. పోస్టుమార్టం నివేదిక, మరణ ధ్రువపత్రం జతచేసి సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులకు అందజేయాలి. సొంత ఖర్చులతో చికిత్స పొందిన తరువాత పరిహారం పొందాలంటే ఫారం-4 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. చికిత్సకు సంబంధించిన రశీదులు సమర్పించాలి. అధికారులు దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత విషయాలను ఫారం-2, ఫారం-3లో నమోదు చేసి కలెక్టరేటుకు పంపాలి. కలెక్టర్ పరిశీలించి ఆమోదం తెలుపుతారు.

**చర్యలు తీసుకుంటున్నాం..**హిట్ అండ్ రన్ కేసుల్లో ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. చర్యలు తీసుకుంటున్నాం. రహదారుల మీద పెట్రోలింగ్, అంబులెన్సు వ్యవస్థ నిఘా పెట్టాలని సూచించాం. బీమా కంపెనీలకు అవసరమైన పత్రాలు ఇవ్వడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఎం.శ్రీనివాసరావు, డీఎస్పీ, విజయనగరం

# తవ్వేయ్.. తరలించేయ్!



గజపతినగరం : కళ్లెదుటే రోజూ ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మండలంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కీలక నేతలు ఉన్న తుమ్మికాపల్లిలో ఇసుక తవ్వకాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. గ్రామానికి చెందిన కొందరు రోజూ చంపావతి నదిలో ఇసుకను తవ్వేసి.. సమీపంలోని కల్లాలు, బీడు భూముల్లో కుప్పలుగా నిల్వ చేసి.. సొమ్ము చేసుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నారాయణపట్నం, జరజాపుపేట, నెల్లిమర్ల, కొండపేట, కుదిపి, నీలంరాజుపేట, సారిపల్లి ప్రాంతాల్లో చంపావతి నదిలో ఇసుక తవ్వకాలునిత్యం ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నీటి పథకాలు, వంతెనలకు 500 మీటర్లలోపు తవ్వకాలు చేపట్టకూడదని నిబంధనలు ఉన్నా.. కొందరు వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి తవ్వేస్తున్నారు. వంతెనలు, ఊటబావులకు అనర్థం తెస్తున్నారు. రాత్రివేళల్లో పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీకాంత్ వద్ద వివరణ కోరగా నదిలో తవ్వకాలను నియంత్రిస్తాం. వంతెనలు, ఊటబావులున్న చోట కందకాలు ఏర్పాటు చేస్తామన్నారు.

**రైతుల ఆవేదన..** నదిని తవ్వేయడం వల్ల భూములు స్వభావాన్ని కోల్పోతాయని, వరద వచ్చినప్పుడు తమ భూములు కోతకు గురవుతాయని సమీపంలో పొలాలున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని గ్రామంలోని నాయకులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు.

**నిబంధనలు గాలికి..**

ఇసుకను సొంత అవసరాలకు సచివాలయంలో నమోదు చేసుకుని ఉచితంగా తరలించుకోవచ్చుననే నిబంధనను ప్రభుత్వం విధించింది. దీన్ని ఎవరూ పాటించడం లేదు. నేరుగా తవ్వుకుని విక్రయించేస్తున్నారు. తుమ్మికాపల్లికి చెందిన మరిడమ్మ గుడి రహదారి నుంచి నేరుగా వెళ్తే చంపావతి నదిలో మంచి ఇసుక లభ్యమవుతుంది. ఇతర గ్రామాలవారు వచ్చినా ఇసుక లేదని పంపించేస్తున్నారు. నది పక్కన గతం నుంచి కొందరు సాగుచేసే భూముల్లో కూడా మంచి ఇసుక ఉండడంతో వాటిని కొంతమంది విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను రూ.200 నుంచి రూ.300 వరకు కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**రత్నకుమార్, తహసీల్దారు, గజపతినగరం

తుమ్మికాపల్లి వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతుల్లేవు. నిబంధనల ప్రకారం సచివాలయంలో నమోదుచేసి, ఏ పనికి వినియోగిస్తున్నారనేది తెలియజేయాలి. కుప్పలు వేసేందుకు వీల్లేదు. నదిలో విక్రయాలు జరిపేవారిపైనా చర్యలు తీసుకుంటాం.

# మిద్దె తోటలో కాసుల కాడలు

కర్నూలు : "ఒక కుటుంబం (నలుగురు సభ్యులు) కూర చేసుకోవడానికి నిత్యం రూ.100-రూ.150 వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఇంట్లోనే కూరగాయలు పండిస్తే ఆ డబ్బులు మిగిలిపోతాయి. రోజుకు రూ.100 లెక్కన ఏడాదికి రూ.36,000 మిగులుతాయి. నెలనెలా రూ.100 మ్యూచువల్ ఫండ్ ఇతర సంస్థల్లో పొదుపు చేస్తే... ఏడాదికి 10% లెక్కకు రూ.37,696, 12% లెక్కకు రూ.38,047 అవుతాయని ఆర్థిక నిపుణుల అంచనా. డబ్బులు మిగలడమే కాదండోయ్ తోటలో ఒక గంట పని చేస్తే 300 కేలరీలు ఖర్చు చేసి ఆరోగ్యానికి బాటలేసుకోవచ్చు."ఇంట్లో తోటలు ఎలా పెంచాలనేదీ మీ సందేహం కదూ..! మీ ఇంటి మిద్దెపై సెంటు స్థలం ఉన్నా మీ ఇంటికి సరిపడా కూరగాయలు ఎంచక్కా సాగు చేసుకోవచ్చు. పురుగు మందుల అవశేషాలు లేని రుచికరమైన కూరగాయలను స్వయంగా పండించొచ్చు. తొలకరి వచ్చేసింది.. మిద్దె తోటల సాగుకు అనుకూలమైన వాతావరణం.. ఈ రోజే మొదలు పెట్టండి.!!

**బయట విషతుల్యం**ప్రతి మనిషి నిత్యం సగటున 300 గ్రాములు (విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు, పిండి పదార్థాలున్నవి) కూరగాయలు, 92 గ్రాముల పండ్లు తీసుకోవాలని ఉద్యానశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 13.50 లక్షల కుటుంబాలున్నాయి. ఏటా రెండు వేల హెక్టార్ల మేర కూరగాయల పంటలు సాగవుతుండగా అన్ని రకాలు కలిపి 1,29,987 టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు నిత్యం వేయి టన్నులు అవసరం కాగా, నిత్యం 360 టన్నులే ఉత్పత్తి అవుతోంది. రోజువారీగా 640 టన్నుల కొరత ఉంది. దీంతో ఉత్పత్తి త్వరగా పెంచాలన్న ఉద్దేశంతో విపరీతంగా మందులు పిచికారీ చేసి విషతుల్యం చేస్తున్నారు. వాటిని తినడం వల్ల అనారోగ్య సమస్యలొస్తున్నాయి. ఐదేళ్ల కిందటి కూరగాయల ధరలు పోలిస్తే కిలోపై రూ.10 నుంచి రూ.70 వరకు పెరుగుదల కనిపిస్తోంది. సరాసరి కిలోకు రూ.60 వెచ్చించాల్సి వస్తోంది.మట్టి నింపి: మిద్దెపై సెంటు స్థలమున్నా తోటలు పెంచుకోవచ్చు అంటున్నారు అనుభవజ్ఞులు గుజరాతి ఎల్లప్ప. పీవీసీ పైపులతో స్టాండ్లు ఏర్పాటు చేసుకోవాలి. వాటిపై ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలు పెట్టాలి. ఆ ఖాళీ డబ్బాల్లో ఎర్రమట్టి నింపి.. వర్మీకంపోస్టు, పశువుల పేడ నింపాలి. ఇవన్నీ మన చుట్టుపక్కలే లభిస్తాయి.. పెద్దగా ఖర్చు పెట్టాల్సిన పని ఉండదు.విత్తనం వేసి: విత్తన దుకాణాల్లో కూరగాయలు, ఆకుకూరలు విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. ఒక ప్యాకెట్ రూ.10-20కు విక్రయిస్తారు. పండ్లు, పూల మొక్కలు అయితే నర్సరీల్లో తెచ్చుకోవాలి.ఇంటి వ్యర్థాలే ఎరువు: మొక్కల ఎండిన ఆకులు తొలగించి ఓ బకెట్‌లో నిల్వ ఉంచాలి. కూరగాయల వ్యర్థాలూ అందులో వేయాలి. వాటిపై కొద్దిగా మట్టి వేసి ఆవు మూత్రం చల్లితే కంపోస్టు ఎరువు తయారవుతుంది.సలహా బృందాలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో టెర్రస్ గార్డెన్ వాట్సప్ గ్రూపులు రెండున్నాయి. ఈ రెండు బృందాల్లో వెయ్యి మంది వరకు ఉన్నారు. 94411 37933, 94400 51336 చరవాణి నంబర్లను సంప్రదించవచ్చు నంబర్లను సంప్రదిస్తే కొత్తగా మిద్దె తోటలు పెంచుకునేందుకు ముందుకొచ్చే వారికి సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అవసరమైన అందిస్తారు.

# కాసులిచ్చేయ్.. కానిచ్చేయ్!

ఒంగోలు : పిల్లలకు పాఠం ఎలా చెబుతున్నారో అంచనా వేయడంలో కీలకమైన బీఈడీ ప్రయోగ పరీక్షలు ప్రహసనంగా మారాయి. ముడుపులు సమర్పించుకుంటే చాలు.. ఇలా వచ్చి అలా సంతకం చేసి వెళ్లిపోతే చాలు... ఎలాంటి పరీక్షలను ఎదుర్కోనక్కర్లేదు. కొంచెం సొమ్ములు ఎక్కువగా ఇచ్చుకుంటే పరీక్ష కేంద్రానికి వెళ్లకున్నా హాజరైనట్లు మార్కులు వేసేస్తున్నారు.. పరీక్షల నిమిత్తం ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది.

జిల్లాలోని వందకుపైగా బీఈడీ కళాశాలలు ఏకేయూ పరిధిలో నడుస్తున్నాయి. అధిక శాతం కళాశాలల్లో బిహార్, ఒడిశా, ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు చదువుతున్నారు. కొన్ని కళాశాలల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులే లేకపోవడం గమనార్హం. ఒక్కొక్కరి నుంచి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. ఫీజుల వసూళ్లే లక్ష్యంగా ఎలాంటి తరగతుల నిర్వహించకుండా కాగితాలపైనే కళాశాలలు నడుస్తున్నాయి. పర్యవేక్షణ యంత్రాంగం చోద్యం చూస్తుండడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా విద్యా వ్యాపారం సాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఫీజులు కట్టేసి పరీక్షల సమయానికి హాజరైతే సరిపోతుంది. పరీక్షల సమయంలో బీఈడీ కళాశాలలు ఎక్కువగా ఉన్న మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాల్లో లాడ్జీలు ఉత్తరాది విద్యార్థులతో కిటకిటలాడుతుంటాయి.




వీరు రాయాల్సిన రికార్డులు, బోధన సామగ్రి వంటివి ఏమి చూపనక్కర్లేదు. అంతా ఆయా కళాశాలల నిర్వాహకులే చూసుకుంటున్నారు. ప్రస్తుతం గత మూడు రోజులుగా ప్రయోగ పరీక్షలు జరుగుతున్నాయి. కొంతమంది విద్యార్థులు మొక్కుబడిగా హాజరై వెళ్లిపోతున్నారు. ఎగ్జామినర్లు, స్క్వాడ్ బృందాలు.. ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. గతంలో బీఈడీ కళాశాలలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పరిధిలో నడిచేవి. గతేడాది పరీక్షలు ఈ విశ్వవిద్యాలయం పరిధిలోనే జరిగాయి. పరీక్షలు మొక్కుబడిగా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఏకేయూ ఆధ్వర్యంలోనే పరీక్షలు జరుగుతున్నా తీరు మారకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**రూ.కోటిన్నర ఎవరి జేబుల్లోకి...**


ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షల నిమిత్తం కొన్ని కళాశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి కనీసం రూ.5 వేలు వసూలు చేస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు. విద్యార్థి నుంచి ఎంత వసూలు చేసుకున్నా గానీ ఒక్కో కళాశాల నుంచి రూ.లక్షన్నర కప్పం కట్టాల్సిందేనని కొంతమంది అధికారులు హుకుం జారీ చేసినట్లు సమాచారం. వంద కళాశాలల నుంచి వసూలు చేసిన రూ.కోటిన్నర మొత్తం ఎవరి జేబుల్లోకి వెళుతోందన్నదే ఆసక్తిగా మారింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

బీఈడీ కళాశాలల తీరుపై ఇప్పటికే ఫిర్యాదులొచ్చాయి. వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ప్రయోగ పరీక్షల నిర్వహణపై ఎవరైనా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. సంబంధిత కళాశాల నిర్వాహకులైనా, విశ్వవిద్యాలయం సిబ్బంది పాత్ర ఉన్నా చర్యలు తీసుకుంటాం.డీవీఆర్‌మూర్తి, వీసీ, ఏకేయూ

# పాపం... పనిలేక కాలక్షేపం!

ఒంగోలు : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు పని లేకుండాపోయింది. వీరందరూ ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి మండల విద్యావనరుల కేంద్రాల వద్ద కాలక్షేపం చేస్తున్నారు. వీరిని గడిచిన విద్యాసంవత్సరంలో డిప్యుటేషన్‌పై అవసరమైన పాఠశాలల్లో నియమించారు. విద్యాసంవత్సరం చివరి రోజు రిలీవ్ చేసి సొంత ఎయిడెడ్ పాఠశాలలకు పంపారు. వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై అధికారులు నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, పురపాలక యాజమాన్యాల కింద పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులతో పాటు ఇప్పటికే విద్యార్థుల్లేక మూతపడిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన పాఠశాలల్లో నియమించాల్సి ఉంది. జిల్లాలో మూడేళ్ల కిందట విద్యార్థుల్లేక 14 ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. ఇలా మూసేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య చూస్తే.. యర్ర గొండపాలెం డీఎంబీసీ ఉన్నత పాఠశాలలో 8 మంది, కొమరోలు



మండలం నల్లగుంటలో ముగ్గురు, గిద్దలూరు వివేకానందలో అయిదుగురు, గిద్దలూరు ఎస్పీజీలో ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. దొనకొండ, ఒంగోలు, మార్కాపురం, అర్థవీడు, పమిడిపాడు ఎయిడెడ్ పాఠశాలలు మూతపడగా, వాటిల్లోని ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నారు. గడిచిన రెండేళ్లుగా వీరిని ఎంఈవోల ఫూల్‌లో ఉంచారు. కొందరిని ఏరోజు ఎక్కడ అవసరమైతే అక్కడకు పంపగా, మరికొందరి డిప్యుటేషన్‌పై పాఠశాలల్లో నియమించారు.

**పోస్టులు భర్తీ కాక...**ఇటీవల బదిలీల కౌన్సెలింగ్ అనంతరం పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం, అర్థవీడు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దొనకొండ తదితర మండలాల్లోని మారుమూల గ్రామాల పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉండగా, వీటిని ఎవరూ కోరుకోలేదు. విధులకు దూరంగా ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను తాత్కాలికంగా ఆయా పాఠశాలల్లో నియమిస్తే బోధన కుంటుపడకుండా ఉంటుంది. వీరికి కౌన్సెలింగ్ జరిపి శాశ్వత పోస్టింగులు ఇచ్చేవరకు అవసరమైనచోట నియమించుకోవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# అధికారం అండతో అడ్డగోలు నిర్మాణం

కదిరి : పద్దించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఫర్వాలేదన్నట్లు.. అధికారం.. అవకాశం ఉంటేదిదా అని.. అడ్డగోలు నిర్మాణానికి తెరలేపారు. పరిశ్రమలు స్థాపించి పది మందికి ఉపాధి చూపించాల్సిన చోట.. స్థలాభార్జనకు ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపట్టారు. కదిరి పారిశ్రామికవాడలో యథేచ్ఛగా సాగుతోన్న తతంగమిది.

కరువుకు నెలవైన కదిరి ప్రాంతంలో వ్యవసాయంతోపాటు పరిశ్రమలను ఏర్పాటుచేసి జీవనోపాధికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం దశాబ్దాల కిందటే చర్యలు చేపట్టింది. 1974లో మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు దాదాపు 50 ఎకరాల భూమి కేటాయించింది. 90 మందికి స్థలాలు కేటాయించి, వారికి అవసరమైన మౌలిక



వసతులు కల్పించింది.

**నిబంధనలు తుంగలో తొక్కి..**

పారిశ్రామికవాడలో ఇటుకల బట్టీ ఏర్పాటుకు కొనుగోలు చేసిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన ఓ అధికారే అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. గతంలో నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నా.. వెనక్కి తగ్గలేదు. కొద్దిరోజులు స్తబ్ధుగా ఉన్న వ్యక్తులు మళ్లీ పనులు ప్రారంభించడం గమనార్హం. పారిశ్రామికవాడలో యథేచ్ఛగా కబ్జాపర్వం సాగుతోంది. కుమ్మరవాండ్లపల్లికి శివారున ఉన్న పారిశ్రామికవాడ ప్రాంతానికి ఎగువప్రాంతంలో కొండలు, చెరువులు ఉన్నాయి. వర్షాకాలంలో కొండల్లో నుంచి ప్రవాహానికి అనుగుణంగా పెద్దకాలువలు ఉండేవి. కుమ్మరవాండ్లపల్లె పట్టణంలో కలిసిపోవడంతో స్థలాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఫలితంగా ఆక్రమణలు పెరిగిపోయాయి. కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. అడ్డుకోవాల్సిన యంత్రాంగం కన్నెత్తి చూడలేదు. మూడేళ్ల కిందట కురిసిన భారీవర్షాలకు పలు పరిశ్రమలు జలమయం కావడంతో ముడిసరకు, యంత్రాలు పాడయ్యాయి.

**ప్రభుత్వానికి నివేదిక పంపుతాం: రామ్, ఏపీఐఐసీ సీజీఎం**

కదిరి పారిశ్రామికవాడలో అక్రమ కట్టడంపై స్థానిక ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ నుంచి ఫిర్యాదు అందింది. దీంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపాం. నివేదికను ప్రభుత్వానికి పంపుతాం.

# చిత్తశుద్ధి లేక.. రక్షిత నీరు అందక!

అనంతపురం : రక్షిత తాగునీరు సరఫరాలో చిత్తశుద్ధి కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో నిర్ణీత గడువు మేరకు ట్యాంకులను శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఉమ్మడి అనంత జిల్లాలోని నగర, పురపాలికల్లో ఈ దుస్థితి నెలకొంది. వేసవిలో మరీనూ, బురద జలాశయాల్లో అధిక భాగానికి చేరుతుంది. ప్లాంట్లో శుద్ధి చేసిన అనంతరం ట్యాంకులకు నింపి.. నివాసాలకు సరఫరా చేసే సమయంలో స్వచ్ఛంగానే కనిపిస్తాయి. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు రావడంతో జలాశయాల్లోని మట్టి పైకి చేరడంతో పాటు కొంత మేరకు రంగు మారే అవకాశం ఉంటుంది. దీంతో ట్యాంకుల అడుగు భాగాన మట్టి చేరే ప్రమాదం ఉంటుంది. ఈనేపథ్యంలో కనీసం 15 రోజులకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. కొన్ని పురపాలికల్లో సిబ్బంది, నిధుల కొరతతో నిర్ణీత సమయానికి బ్లీచింగ్ పౌడర్‌తో చేయకపోవడం.. మరికొన్ని చోట్ల శుభ్రం చేయకున్నా.. చేసినట్లుగా తేదీలు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కొనుగోలు చేస్తూ..** పురపాలిక: హిందూపురం

జనాభా: 1.78 లక్షలు ట్యాంకులు: 19

రోజూ అవసరమయ్యే నీరు: 21 మిలియన్ లీటర్లు

ప్రతి 15 రోజులకు ఓసారి ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ నీటిని ఇతర అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. వంట చేయడానికి, తాగడానికి శుద్ధి చేసిన నీరు బిందె రూ.10 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు.

**వారానికి ఓసారి చేస్తారంట!**

అనంతపురం 3,46,262 29 46.75 మిలియన్ లీటర్లు

పీఏబీఆర్ జలాశయంలో పంపింగ్ చేసిన నీటిని ముద్దలాపురం వద్ద ఉన్న ప్లాంటులో శుద్ధి చేసిన అనంతరం నగరంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నింపుతారు. 40 కిలోమీటర్ల నుంచి నీరు వస్తుండటంతో వారానికి ఓసారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. నగరంలోని పలు ట్యాంకుల వద్ద శుభ్రం చేసిన తేదీ, మళ్లీ చేయాల్సిన తేదీ నమోదు చేయాలి. చాలా చోట్ల ఆ వివరాలు లేవు.

**అరకొరగానే..**

ధర్మవరం 1,65 లక్షలు 14 17 మిలియన్ లీటర్లు

మున్సిపాలిటీ అధికారులు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో పలు వీధులకు కలుషితమైన నీరు సరఫరా అవుతోందని పట్టణ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. శివారు కాలనీలకైతే సరఫరా అధ్వానంగా ఉండటంతో డబ్బులిచ్చి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

తాడిపత్రి 1.30 లక్షలు 6 16.5 మిలియన్ లీటర్లు

తాడిపత్రిలో కొన్నిచోట్ల నీరు కలుషితంగా వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. దుర్వాసన, రంగు మారి రావడంతో తాగలేకున్నామని వాపోతున్నారు. దీంతో ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పలు ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ (నీటి సరఫరా) తేజను వివరణ కోరగా క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని, ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

# దిగుబడిలో విశిష్టం.. నాణ్యతలో శ్రేష్ఠం



అనంతపురం : బెట్ట, తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వేరుసెనగ విత్తనాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానంలో కే-6, ఐసీజీ (ఎఫ్‌డీఆర్ఎస్)-79 రకాలను సంకరం చేసి అభివృద్ధి చేసిన ఈ వంగడానికి టీసీజీఎస్-1694 (విశిష్ట)గా నామకరణం చేశారు. ప్రయోగాత్మక సాగులో మంచి ఫలితాలు రావడంతో ఈ ఖరీఫ్ నుంచి విత్తనాభివృద్ధికి సన్నహాలు చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో రెండు ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తిదారుల సంఘం)ల పరిధిలో 500 హెక్టార్లలో ఈ రకాన్ని సాగు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం రైతులకు ఉచితంగా 750 క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేసే ప్రక్రియను మొదలు పెట్టారు. మరో రెండు, మూడేళ్లలో రైతులకు పూర్తి స్థాయిలో ఈ రకం విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**కే-6 కంటే**

రాష్ట్రంలో వేరుసెనగ రైతులు కదిరి-6 రకాన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. కే-6లో వర్షాధారంగా ఎకరాకు 6, బోర్ల కింద 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చేసిన టీసీజీఎస్-1694 (విశిష్ట) రకంలో వర్షాధారంగా ఎకరాకు కనీసం 8 నుంచి 10 క్వింటాళ్లు, బోర్ల కింద అయితే 12 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని చెబుతున్నారు. అలాగే ఈ వంగడం 25-30 రోజుల వరకు బెట్ట పరిస్థితులను తట్టుకుని నిలబడుతుందని పేర్కొంటున్నారు. అనంతపురం లాంటి వర్షాభావ ప్రాంతంలో విశిష్ట రకం వంగడాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేస్తున్నారు. కే-6 రకంతో పోలిస్తే ఇందులో గింజ దిగుబడి కూడా అధికంగానే ఉంటోంది. విశిష్ట రకంలో కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తుండటంతో దిగుబడి నాణ్యత బాగుంటుందని గింజశాతం 75, నూనె 50 శాతం ఉంటోందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**తెగుళ్ల సమస్య ఉండదు** వేరుసెనగలో ప్రధానంగా కనిపించే ఆకుమచ్చ తెగులును విశిష్ట రకం పూర్తిస్థాయిలో తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కే-6 రకంలో ఆకుమచ్చ తెగులు సమస్య అధికంగా కనిపిస్తోంది. కే-6 రకంలో ఒకసారి తెగులు సోకితే నియంత్రించడం చాలాకష్టం. కనీసం 6 సార్లు పురుగుల మందులు పిచికారీ చేయాల్సివస్తోంది. దీంతో పెట్టుబడి భారం పెరిగిపోతుంది. పంట చివరి దశలకు వచ్చేసరికి నల్లగా మారి పశుగ్రాసానికి పనికి రాకుండా పోతోంది. విశిష్ట రకంలో పంట చివరివరకు ఆకుపచ్చగానే ఉంటుంది. రెండుసార్లు మందులు పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. దీంతో కే-6తో పోలిస్తే ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందని కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# ఎర్రపండు ఏడిపిస్తోంది..!



పుంగనూరు: మంచి ఆదాయం వస్తుందనే ఆశతో.. ఉత్సాహంగా సాగు చేసిన టమాటా పంట రైతులకు ఊహించని నష్టాలు తెచ్చి పెట్టింది. పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో టమాటా సాగు చేసిన రైతన్నలకు ఊజీ వైరస్ కోలుకోలేని దెబ్బ తీస్తోంది. ఈ సీజన్ ప్రారంభం నుంచి ధరలు లేవు. ఈ పది రోజుల్లో స్వల్పంగా ధర కొంత పెరిగినా ఊజీ ఈగ వైరస్ ప్రభావంతో పంట నాణ్యత దెబ్బతింది. దీంతో సగానికి సగం కాయలు పారబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న ధరలతో పోల్చుకుంటే ఎకరాకు రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రావాలి. అయితే పంట నాణ్యత లేక సగం కాయలు పశువులకు మేతగా రోడ్ల పక్కన, పొలాల్లో పారబోస్తున్నారు. దీంతో పెట్టుబడులు దక్కే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఐదువేల ఎకరాల్లో టమాటా తోటలు ఉన్నాయి. వాటిలో 15 వందల ఎకరాల తోటలకు ఊజీ ఈగ వ్యాపించింది. ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు వెచ్చించి పండించిన టమాటా కోతకు వచ్చిన దశలో ఇలా దెబ్బతింటుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. అమ్ముకునే దశలో ఇలా పారబోయాల్సి వస్తుండటంతో నట్టేట మునిగిపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

**అధిక నష్టమిలా..** ఊజీ ఈగ టమాటాను ఆశించి అధిక నష్టం కలుగజేస్తోంది. కాయలను గాయపరచి కాయ లోపల గుడ్లు పెడతాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చిన లార్వా కాయలను తింటాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం ద్వారా భూమి లోపల ప్యూపా దశలో ఉన్న పండు ఈగను నాశనం చేయవచ్చు.

**ధరలు లేవు..: నవీన్, రైతు**

ఊజీ ఈగతో దెబ్బతిన్న పండ్లకు ధరలు లేవు. వ్యాపారులు సైతం రంధ్రాలు ఉన్న కాయలను వేరు చేస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారు. సాధారణంగా 15 కిలోల టమాటా పెట్టె రూ.220లు పలుకుతుంటే.. పంటను కొనడమే లేదు.

**గ్రేడింగ్ చేస్తేనే..: మునిరాజ, రైతు**

టమాటా ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. గ్రేడింగ్ చేస్తేనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోసే కూలీలు కాకుండా గ్రేడింగ్‌కు అదనంగా కూలీలను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది.

# రూ.200 మిగలబెట్టి.. రూ.30 వేలు ఖర్చుపెట్టి..



చిత్తూరు : రూ.200తో అయ్యే పని.. రూ.25-30 వేలు ఖర్చుపెట్టడమంటే అందరికీ అంత సులభం కాదు.. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులకే సాధ్యం.. వైకాపా హయాంలో ఎస్పీడీసీఎల్ అవినీతి, అక్రమాల్లో కూరుకుపోగా.. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయినా వైకాపాతో అధికారుల హవా సాగడంతో వారి అనాలోచిత నిర్ణయాలు సంస్థను మరింత అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. వినియోగదారులకు సేవలు మరింత కష్టతరం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే నియంత్రికల ఆయిల్ లీకేజీ బ్యాచ్ వ్యాన్ వ్యవస్థను ఈ ఏడాది మే నుంచి రద్దు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నియంత్రికల నిర్వహణ, మరమ్మతులకు ఏఈ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఆయిల్ లీకేజీ బ్యాచ్(బృందం) ప్రత్యేక వాహనంలో వెళ్లి గుత్తేదారుతో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించేవారు. ఒక నియంత్రిక మరమ్మతుకు రూ.200 చొప్పున విద్యుత్తు సంస్థ లీకేజీ బ్యాచ్ వాహనం సంబంధిత గుత్తేదారుకు చెల్లించేది. ఈ విధానం పాతికేళ్లుగా ఎస్పీడీసీఎల్ పరిధిలో కొనసాగుతోంది. తద్వారా వినియోగదారులకు సత్వర సేవలు, సంస్థకు ఆర్థిక భారం ఉండేదికాదు.

**అనాలోచిత నిర్ణయం..** వైకాపాతో అంటకాగిన ఉన్నతాధికారులు అనాలోచిత నిర్ణయాలతో నియంత్రికల ఆయిల్ లీకేజీ బ్యాచ్ వ్యాన్ వ్యవస్థను రద్దు చేయడంతో సంస్థకు ఆర్థిక భారాన్ని తెచ్చిపెట్టడంతో పాటు ప్రజలకు సేవలను దూరం చేశాయి. ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నియంత్రికల్లో ఏ చిన్నపాటి సమస్య వచ్చినా మావల్ల కాదు.. నియంత్రికల మరమ్మతు కేంద్రానికి తీసుకెళ్లాల్సిందేనని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో ఏం చేయలేక.. ఈ కేంద్రాల్లో చిన్నపాటి సమస్య ఉన్నా నియంత్రిక కాలిపోయిందంటూ.. నూతన వైండింగ్ చేపట్టి మరమ్మతుకు రూ.20-30 వేల వరకు ఖర్చు చేస్తున్నారని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు.

**సమయాభావంతో మరిన్ని ఇక్కట్లు..** నూతన విధానం వల్ల మరమ్మతుల పేరుతో తీసుకెళ్లిన నియంత్రికను ఎప్పుడు అమర్చుతారో తెలియదు. అప్పటి వరకు సరఫరా ఉండదు. సమయాభావంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని.. లీకేజీ బ్యాచ్ వాహనంతో వెంటనే సేవలు నియంత్రికల నిర్వహణ బాగుండేదని రైతులు పేర్కొంటున్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

**వాహన సేవల పునరుద్ధరణకు ప్రతిపాదన..**

ఆయిల్ లీకేజీ బ్యాచ్ వాహన సేవలు బాగున్నాయి. వాటిని రద్దు చేశారు. ఈ బ్యాచ్ వాహన సేవలు పునరుద్ధరించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

# నగదు జమ.. పనులు మమ..!

శ్రీకాకుళం : నిరుపేదలకు జగనన్న కాలనీల్లో ఇచ్చిన ఇంటి స్థలాలు ఊరు శివారుల్లో, కొండకోనల్లో ఉండటంతో లబ్ధిదారులు కట్టుకునేందుకు వెనకంజ వేస్తున్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నా లబ్ధిదారులకు భరోసా కల్పిస్తూ ఇంటి నిర్మాణాల పూర్తికి సహకారం అందజేస్తోంది. ఇందులో భాగంగానే అసంపూర్తిగా వదిలేసిన వారికి అదనపు సాయం ప్రకటించింది. ఈమేరకు వారి ఖాతాల్లో నగదు జమచేసినా నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు.

**3,357 మంది ప్రారంభించలేదు..**

అదనపు సాయంలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఆసక్తిచూపిన వారికి తొలిదశలో 5,709 మంది లబ్ధిదారులకు రూ.13.17 కోట్లు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. వీటిలో బీసీ,



ఎస్సీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున ఖాతాల్లో కొంతమొత్తం జమచేశారు. వీరిలో నగదు వినియోగించుకుని ఇంటి నిర్మాణాన్ని తలపెట్టిన వారు 1,722 మంది ఉండగా వీరిలో 1,333 మంది పూర్తి చేశారు. మిగిలిన 3,357 మంది ప్రారంభించలేదు. అదనపు సాయం పొందినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

జిల్లాలో 30 మండలాలు, నాలుగు అర్బన్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 784 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 33.12 వేల మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. వీరిలో కేవలం 11.36 వేల మంది మాత్రమే గృహాలు పూర్తి చేశారు. 809 మంది ప్రారంభించనే లేదు. 20,194 నిర్మాణాలు వివిధ దశల్లోనే అసంపూర్తిగా ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో కలిపి రూ.1.80 లక్షలు సాయం అందించింది. కట్టని వాటిని రద్దు చేస్తామని ఒత్తిడి తీసుకురావడంతో కొందరు అప్పులు చేసి నిర్మించారు. మిగిలినవారు వదిలేశారు.

**చర్యలు తీసుకుంటాం..**

లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి. ఆసక్తిలేని వారి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరు ముందు కొచ్చి పూర్తి చేశారు. మిగిలినవారు త్వరగా పూర్తి చేయాలి. నగేష్, పీడీ, గృహనిర్మాణ సంస్థ

# అదను కుదిరింది..!

నరసన్నపేట: జిల్లాలో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి.. గత 15 రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో పదును చేరింది.. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా దుక్కులు దున్నడం, వెద జల్లడం చేస్తున్నారు. జిల్లాలో 4.74 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉండగా, 3.6 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో వరి సాగుకు 1.10 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం. ఇందులో ప్రభుత్వం రాయితీపై 33 శాతం మేర ఏపీ సీడ్స్ ద్వారా పంపిణీ చేస్తోంది. 35,911 క్వింటాళ్లు అవసరమని మండలాల నుంచి ప్రతిపాదించగా, వ్యవసాయ శాఖ ఇప్పటికే 34,518 క్వింటాళ్లు రైతు సేవా కేంద్రాలకు తరలించింది.



ఈసారి గరిష్ఠంగా సాంబ, ఇంద్ర, స్వర్ణ, శ్రీధృతి రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇవి కాక అవసరాలకు అనుగుణంగా ప్రైవేటు వ్యాపారుల నుంచి మరో 70 వేల క్వింటాళ్ల వరకు విత్తనాలు కొనుగోలు చేసుకుంటారని అంచనా. అమూల్య, సంపద, సుభద్ర, కనెక్ట్ ప్లస్ వంటి విత్తన రకాలు వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

**65 శాతం వెద..** జిల్లాలో ఏటేటా వెదసాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. తక్కువ ఖర్చు, సమయం ఆదా అవుతుందనే ఉద్దేశంతో అన్నదాతలు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. ఈసారి 65 శాతం మేర వెద సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 'వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఖరీఫ్ సాగు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే నిర్దేశిత లక్ష్యంలో రాయితీపై విత్తనాలు అందజేశాం' అని వ్యవసాయ శాఖ జేడీ కె.త్రినాథస్వామి తెలిపారు.

# నల్లమల రోడ్డుకు రూ.400 కోట్లు

నంద్యాల : కల్వకుర్తి- జమ్మలమడుగు 167కే జాతీయ రహదారి నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. నల్లమల అటవీ ప్రాంతంలోని నల్లకాల్వ-వెలుగోడు పులుల అభయారణ్యంలో రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతో ఈ రహదారి పనులకు సంబంధించి అన్ని ప్యాకేజీలకు నిధులు కేటాయించినట్లయింది. త్వరలో నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. **ఐదో ప్యాకేజీగా గుర్తింపు** తెలంగాణలోని కల్వకుర్తి నుంచి రాష్ట్ర సరిహద్దు సోమేశ్వరం వరకు ఒక ప్యాకేజీగా, సోమేశ్వరం-సంగమేశ్వరం కేబుల్ బ్రిడ్జి రెండో ప్యాకేజీగా, ఈ వంతెన కింద అప్రోచ్ రోడ్లను మూడో ప్యాకేజీగా, సంగమేశ్వరం నుంచి నల్లకాల్వ వరకు, వెలుగోడు నుంచి నంద్యాల వరకు రహదారి నిర్మాణాలను నాలుగో ప్యాకేజీగా విభజించారు. ఇక నంద్యాల నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు వరకు రహదారి పనులను ఆంధ్రప్రదేశ్‌లోని ఒకటో ప్యాకేజీగా గుర్తించి నిధులను కేటాయించారు. నల్లకాల్వ- వెలుగోడు రహదారి పనులను 5వ ప్యాకేజీగా విభజించారు. ఈ ప్రాంతం పులుల అభయారణ్యంలో ఉండటంతో పనులు చేయడానికి కేంద్రస్థాయిలో వివిధ విభాగాల నుంచి అనుమతులు అవసరం ఉంటుంది. దీంతో దీన్ని ప్రత్యేక ప్యాకేజీగా విభజించారు. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు వరకు నిర్మించనున్న జాతీయ రహదారి పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. తెలంగాణలో మొదటి ప్యాకేజీ పనులు ఏడాది క్రితమే పూర్తయ్యాయి. రెండు, మూడు, నాలుగో ప్యాకేజీ పనులకు టెండర్లు కూడా పూర్తి చేశారు. నాలుగో ప్యాకేజీకి సంబంధించి భూ సేకరణ పనులు చివరి దశకు వచ్చాయి.

**అనుమతులే తరువాయి** నల్లకాల్వ నుంచి వెలుగోడు వరకు అటవీ మార్గంలో 17 కి.మీల మేర రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసల రహదారి వేయనున్నారు. ప్రస్తుతం ఇది ఒకే వరుస రహదారిగా ఉంది. దశాబ్దాలుగా ఈ రహదారికి మరమ్మతులు మాత్రమే చేస్తున్నారు కాని విస్తరించ లేదు. గతంలో ఈ రహదారి అభివృద్ధి కోసం పలుమార్లు నిధులు కేటాయించారు. కాని అరణ్యంలో పనులు చేయడానికి అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో నిధులు కేటాయించి, టెండర్లు పిలిచి గుత్తేదారులతో ఒప్పందం కుదుర్చుకున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

# ఐసీడీఎస్‌లో రూ.5 లక్షలు దుర్వినియోగం

అనంతపురం : జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ పీడీ కార్యాలయంలో ఐఎస్‌ఓ హంగులన్నీ మాయం అయ్యాయి. దీనికి వెచ్చించిన సుమారు రూ.5 లక్షలు బూడిదలో పోసిన పన్నీరులా మారాయి. అసలే ఆర్థిక భారంతో విలవిల్లాడుతున్న రాష్ట్ర ఖజానాకు ఇదొక తీరని నష్టంగా మిగిలింది. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్‌ఓ ధ్రువీకరణ పేరుతో రూ.లక్షలు వృథా, దుర్వినియోగం చేశారన్న అభియోగాలు నిత్యకృత్యంగా వినిపిస్తున్నాయి. నిధుల లేమితో అల్లాడిపోతున్న ఐసీడీఎస్ పీడీ కార్యాలయానికి ఐఎస్‌ఓ వ్యవహారం ఒక గుదిబండలా మారినా అప్పట్లో వెనకడుగు వేయలేదు. కొత్త హంగులు పేరుతో ఏకంగా రూ.5 లక్షలు ఖర్చు పెట్టడం తీవ్ర దుమారం రేగింది. సమగ్ర పిల్లల సంరక్షణ సమితి(ఐసీపీఎస్), చైల్డ్‌లైన్-1098, డీసీపీ.. వంటి విభాగాల ను బాలల సంరక్షణ సమితి (సీడబ్ల్యూసీ) కార్యాలయ భవన సముదాయంలోనే ఉండాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడో ఆదేశించాయి.



ఎప్పటికైనా ఈ విభాగాలు సీడబ్ల్యూసీ ఆవరణానికే తరలిపోతాయని తెలిసినా.. ఐఎస్‌ఓ పేరుతో ఆయా విభాగాలకు కొత్త హంగులతో ఫర్నీచర్, ఇతరత్రా సదుపాయాలు కల్పించారు.

**ఆ విభాగాలు తరలింపు**

పీడీ కార్యాలయంలో ఉన్న చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, డీసీపీ విభాగాలను అనంత గ్రామీణ మండలం తడకలేరు సమీపంలోని సీడబ్ల్యూసీ కార్యాలయ సముదాయానికి మార్పు చేశారు. ఐఎస్‌ఓ కోసం తయారీ చేసిన ఫర్నీచర్‌ను తొలగించేసి.. కొన్ని చెక్కలను తీసుకెళ్లారు. ఇప్పుడు అక్కడి విభాగాన్ని సమావేశ మందిరంగా మార్పు చేస్తున్నారు. చైల్డ్‌లైన్, ఐసీపీఎస్, డీసీపీ వంటి విభాగాలు పీడీ కార్యాలయ ఆవరణంలో ఉంటేనే ప్రజలకు బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాకపోతే దేశ వ్యాప్తంగా పాటిస్తున్న మార్గదర్శకాలనే అమలు చేయాలన్న నిబంధన ప్రకారం మార్పు చేశారు. ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల ప్రకారమే ఆ విభాగాలను సీడబ్ల్యూసీ భవన సముదాయానికి తరలించినట్లు పీడీ నాగమణి తెలిపారు. ఇక్కడి ఫర్నీచర్, ఇతరత్రా సామగ్రి వృథా కాకుండా ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నామన్నారు.

# పగలు తరలింపు.. రాత్రికి చదును

తొట్టంబేడు : విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు అక్రమార్కులు సిద్ధమయ్యారు. పగలు టిప్పర్లతో గ్రావెల్ తరలించడం.. రాత్రికి భారీ యంత్రంతో చదును చేయడం.. ఈ అక్రమం శ్రీకాళహస్తి- తడ ప్రధాన రహదారిలో శ్రీకాళహస్తి పట్టణానికి అత్యంత సమీపంలో జరుగుతోంది. మూడురోజుల్లోనే ఈ మొత్తం తంతు జరిగింది. వివరాల్లోకి వెళితే తొట్టంబేడు మండల పరిధిలోని బీడీ కాలనీకి సమీపంలో ప్రధాన రహదారి పక్కనే విలువైన ప్రభుత్వ స్థలం ఉంది. బహిరంగ విపణిలో ఎకరా రూ.కోటి పలుకుతుంది. దీంతో కొందరు అక్రమార్కుల కన్ను ఆ స్థలంపై పడింది. ఈనెల 22వ తేదీ గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు టిప్పర్లతో పదుల సంఖ్యలో మట్టిని తరలించారు.



భారీ యంత్రంతో చదును చేసేశారు. ఇప్పటికే దాదాపు 5 సెంట్ల విస్తీర్ణాన్ని చదును చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పక్కనే మరికొన్ని మట్టి కుప్పలు కనిపిస్తుండటంతో మరింత స్థలాన్ని చదును చేస్తారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమానికి స్థానిక రెవెన్యూ అధికారి సహకారం ఉందని ఆరోపణలున్నాయి. రహదారి విస్తరణకు ఇటీవలే ఆ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. రహదారి పనులు ప్రారంభమైతే కబ్జా కుదరదని తెలిసి పక్కా ప్రణాళికతో అక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ మధుసూదనరావు దృష్టికి తీసుకెళ్లగా.. విషయం ఆయన దృష్టికి వచ్చిందని, వెంటనే పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

# కుళాయిల ముసుగులో దోపిడీ

గుంతకల్లు : గుంతకల్లు మున్సిపాలిటీలో పెద్దఎత్తున దొంగ కుళాయిలు వెలిశాయి. తద్వారా మున్సిపాలిటీకి భారీగా గండి పడుతోంది. కొందరు ఇళ్లకు మున్సిపాలిటీ అనుమతులు, ఎలాంటి రుసుం చెల్లించకుండానే రాజకీయ నాయకులు ఇళ్ల యజమానుల నుంచి కొంత మొత్తం వసూలు చేసుకుని అనధికారికంగా ఇళ్లకు సిబ్బంది సకారంతో కనెక్షన్లు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు నాయకులు ఎన్నికల్లో కౌన్సిలర్లుగా మళ్లీ మళ్లీ గెలవాలన్న ఉద్దేశంతో అక్రమ కుళాయిలు వేయించారన్న విమర్శలున్నాయి. అధికారులు అక్రమ కుళాయిల కనెక్షన్‌లను తొలగించడానికి వెళ్లినప్పుడల్లా కొందరు నాయకులు అడ్డుపడుతుండంతో వారు ఏమీ చేయలేకపోతున్నారు. గతంలో అధికారులు ఒక్క వార్డులోనే 120 అక్రమ కుళాయిలను గుర్తించారు. తరువాత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగింపు పనులు అర్ధాంతరంగా ఆపేశారు. సందట్లో సడేమియా అన్న చందంగా కొందరు మున్సిపల్ సిబ్బంది రాత్రికి రాత్రే ఇళ్లకు అక్రమ కుళాయిలను ఏర్పాటు చేసి డబ్బులు దండుకుంటున్నారు. రెండు నెలల కిందట ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ సిబ్బంది నిర్వాకాన్ని గుర్తించి ఇద్దరిని సస్పెండ్ చేశారు.

**15 ఏళ్లుగా సాగుతున్నా.. పట్టని తీరు**

గుంతకల్లు మున్సిపాలిటీలో అధికారికంగా 33 వేలు, అక్రమ కుళాయిలు దాదాపు 10 వేలు ఉన్నట్లు అంచనా. వీటి కనెక్షన్ల ద్వారా ఏడాదికి రూ.5.20 కోట్లు ఆదాయం వస్తోంది. అక్రమ కుళాయిల వల్ల మున్సిపాలిటీకి నెలకు రూ. 12 లక్షలు, ఏడాదికి రూ. 1.44 కోట్ల రావాల్సి ఉంది. 15 ఏళ్లుగా రూ.21 కోట్ల నీటి పన్ను వసూలు కాలేదు. పట్టణానికి నీటిని సరఫరా చేయడానికి నెలకు విద్యుత్తు ఛార్జీలు, కార్మికులకు వేతనాల కింద రూ.50 లక్షలు ఖర్చు చేస్తోంది. అక్రమ కుళాయిల నుంచి ఆదాయాన్ని గడిస్తే.. పురపాలక ప్రగతికి దోహదపడుతుంది. **పరిశీలించి చర్యలు తీసుకుంటాం: నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్**

అక్రమ కుళాయిలు ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని తొలగించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. అవినీతికి పాల్పడుతున్న వారిపై వేటు వేశాం. ప్రజల సహకారంతో అవినీతికి తావులేకుండా తగు చర్యలు తీసుకుంటాం.

# పది శాతం పనులపై నిర్లక్ష్యం



విశాఖపట్నం : ఏళ్లు గడుస్తున్నా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మోక్షం కలగడం లేదు. పది శాతం పనులు పూర్తయితే అప్పగించేలా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల పూర్తిస్థాయి తాగునీటి వసతి కల్పిస్తే సరిపోయేలా ఉన్నా పట్టించుకోని దుస్థితి నెలకొంది. మరో వైపు బ్యాంకు ఈఎంఐ రుణాలు చెల్లించలేక, అద్దెకు ఉండలేక సామాన్యుడు నలిగిపోతున్నాడు. జిల్లాకు మొత్తంగా 24192 టిడ్కో ఇళ్లను కేటాయిస్తే వాటిల్లో 7296 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన వాటిల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాల్సి ఉంది. పాలకులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

**దసరాకు అప్పగించాలంటున్నప్పటికీ..**

క్షేత్రస్థాయిలో టిడ్కో ఇళ్ల పూర్తి నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం దసరాకు లబ్ధిదారులకు అప్పగించాలనే ప్రణాళికతో ఉన్నప్పటికీ కింది స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కొన్ని చోట్ల గుత్తేదారులకు డబ్బులు చెల్లించకపోవడంతో నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టాల్సినప్పటికీ అదేమీ కనిపించడం లేదు.

**ఎక్కడ, ఎలా ఉందంటే?**

జిల్లాలో 16,896 మందికి టిడ్కో ఇళ్లను అప్పగించాలి. మధురవాడ పరిధి కొమ్మాదిలోని నాలుగు ఎకరాల్లోని ఏడు బ్లాకుల్లో 336 గృహాలు నిర్మించారు. అప్పట్లో నీలిరంగులు వేసి వదిలేశారు. లోపల విద్యుత్తు, ప్లంబింగ్, యూజీడీ ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. వీటికి నిధులు మంజూరైనా ఎప్పటికి పూర్తవుతాయో చూడాలి.

బక్కన్నపాలెంలో 384 గృహాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. పైకప్పు వరకు నిర్మించి వదిలేశారు. కొన్ని బ్లాకులు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. సంగివలసలో 480 గృహాలదీ అదే పరిస్థితి.


పెందుర్తి మండలం చీమలాపల్లి1, 2 లేఅవుట్‌లో మొత్తంగా 1200 ఇళ్లకు సంబంధించిన పనులు అప్పట్లో మొదలెట్టారు. గుత్తేదారులకు బిల్లులు మంజూరవ్వకపోవడంతో మధ్యలోనే పనులు ఆపేశారు. ఇవి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. పశ్చిమ నియోజకవర్గంలోని అచ్చెన్నాయుడులోవలో 2894 ఇళ్లను నిర్మించారు. అంతర్గత రహదారులు పూర్తయినప్పటికీ ఇక్కడ పూర్తిస్థాయి వసతులు కల్పించాలి. తాగునీటి సమస్య ఉంది.

పెదగంట్యాడలో 6072 ఇళ్లు పూర్తయినా మౌలిక వసతుల సమస్య ఉంది. ట్రైజంక్షన్‌లో 1284 ఇళ్లు పూర్తవ్వగా మరో 1296 అసంపూర్తిగా ఉన్నాయి. దువ్వాడలో 1056, భానోజితోట 1056, కళావానిపాలెంలో 1200 ఇళ్లను నిర్మించారు. ఇక్కడ రహదారులు, కాలువలు నిర్మించినప్పటికీ తాగునీటి సమస్య ప్రధానంగా ఉంది. ఇళ్లకు తాగునీటి వసతి కల్పించాలి.

**మీరే కొనసాగుతారా?:** ప్రస్తుతం టిడ్కో లబ్ధిదారులకు జీవీఎంసీ అధికారులు నోటీసులు అందిస్తున్నారు. అందులో లబ్ధిదారు వివరాలతో పాటు రుణం తీసుకున్న వివరాలు పొందుపరుస్తున్నారు. ప్రధానంగా టిడ్కో ఇల్లు వద్దనుకుంటే ఎందుకో కారణం తెలిపి రాత పూర్వకంగా తీసుకుంటున్నారు. అందులోనే కొనసాగుతారనుకుంటే ఆ వివరాలు నమోదు చేస్తూ దీన్ని ఓ సర్వేలా చేపడుతున్నారు. కొందరు ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. చాలా మంది లబ్ధిదారులు రుణాల చెల్లింపునకు మరికొంత సమయం కోరుతున్నారు. చెల్లించని వారిలో చాలామంది ఇళ్లల్లో దిగిపోయిన వారే ఉడడం గమనార్హం.

మొత్తం 24 వేల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 12 వేల రిజిస్ట్రేషన్లు లబ్ధిదారుల పేరుతో జరిగాయి. మిగిలిన వారికి త్వరలోనే చేసేలా సోమవారం నుంచి ఈ ప్రక్రియను వేగవంతం చేశారు.

# 'ఈ-వాహనం'.. రోడ్డే ఇంధనం..!



ఏయూ ప్రాంగణం : గత దశాబ్దకాలంలో కార్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వీటిలో డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలే అధికం. దీంతో వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్తు వాహనాలు వచ్చినప్పటికీ ఛార్జింగ్ సమస్యల దృష్ట్యా అనుకున్న స్థాయిలో వాటికి డిమాండ్ పెరగలేదు. ఇందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఒక పరిష్కారాన్ని కొనుగొన్నారు. వాహనాలు రహదారిపై పరుగెడుతుంటే బ్యాటరీ ఛార్జింగ్ అయ్యే విధానాన్ని రూపొందించారు. అయితే దీనికోసం ప్రత్యేకంగా స్మార్ట్ రహదారి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**ఎలాంటి తీగలు లేకుండానే..**

ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు కె.భార్గవి, బి.భార్గవి, జి.సాయి పూజిత, సీహెచ్.డి.ఎన్.సత్యశ్రీ, ఎన్.వి.కె. అమూల్య, చాందిని తమ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం మార్కెట్‌లో విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ సమస్యలను గుర్తించారు. వాటికి పరిష్కారం కనుగొనాలని భావించారు. ఆలోచనను అధ్యాపకులు డాక్టర్ ఎం.దివ్య, డాక్టర్ ఎం.రేవతిలతో పంచుకున్నారు. వారి ప్రోత్సాహంతో ప్రయోగాలు చేసి 'డైనమిక్ వైర్‌లెస్ ఛార్జింగ్ ఎలక్ట్రికల్ వెహికల్' ప్రోటోటైప్‌ను తయారు చేశారు. ఎలాంటి తీగల సహాయం లేకుండానే ఈ వాహనం ఛార్జింగ్ అవుతుంది. 90శాతం ఛార్జింగ్ కాగానే దానంతట అదే ఆగిపోతుంది. అతి తక్కువ వ్యయంతో దీన్ని తయారు చేశారు. పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు చేశారు.

**ఎలా పనిచేస్తుందంటే...**

ఇప్పుడున్న రహదారుల్లో ఒక వరసను విద్యుత్తు వాహనాలు నడిచేందుకు విడిచి పెట్టాలి. ఈ రహదారులపై కాపర్ తీగ అమర్చుతారు. రహదారి పక్కనే సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తారు. దాని నుంచి విద్యుత్తు ప్రవహించి వోల్టేజి డివైజర్ ద్వారా కాపర్ వైర్‌కు వెళుతుంది. అక్కడి నుంచి రహదారిపై నడిచే విద్యుత్తు వాహనంలోకి ప్రవేశిస్తుంది. వాహనం బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి దానంతట అదే ఛార్జింగ్ అవుతుంది. డ్రైవర్ వద్ద గల డిస్‌ప్లేలో ఛార్జింగ్ అవుతున్న దృశ్యం కనిపిస్తుంది. బ్యాటరీ 90శాతం ఛార్జింగ్ పూర్తి కాగానే ఆటోమెటిక్‌గా నిలిచిపోతుంది. ఈ విధానంలో తక్కువ సమయంలో బ్యాటరీ ఛార్జింగ్ అవుతుంది. స్మార్టు రహదారులు ఏర్పాటవుతాయి. పెట్రోలు, డీజిల్ వాహనాలు తగ్గి నగరాలలో కాలుష్య సమస్య తగ్గుతుంది.

**ఉపయోగించిన పరికరాలు ఇవే...**

వాహనం గమనాన్ని నియంత్రించేందుకు మోటార్ డ్రైవర్‌ను ఉపయోగించారు. విద్యుత్తు ప్రవాహం కోసం మైక్రో కంట్రోలర్‌ను అమర్చారు. ప్రాజెక్టులో ఇది కీలకమైనది. శక్తి(విద్యుత్తు) సరఫరా కోసం సోలార్ ప్యానల్ లేదా బ్యాటరీలు, విద్యుత్తు ఛార్జింగ్ చూసేందుకు ఎల్‌ఈడీ డిస్‌ప్లే, డిస్‌ప్లేను మైక్రోకంట్రోలర్‌తో అనుసంధానించడానికి ఐ2సీ మాడ్యూల్ ఉపయోగించారు.

# ప్రభుత్వ భూముల్లో పాగా..

కె.కోటపాడు : కొందరు నేతల అండదండలతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. గెడ్డ పోరంబోకు, ప్రభుత్వ భూములను ఆక్రమించి దుకాణాలు, ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. చౌడువాడ లో సంపద కేంద్రాన్ని ఆనుకుని సర్వే నం.410-1, పక్కనే సర్వే నం.414-3లో గెడ్డ పోరంబోకు భూములున్నాయి. వీటిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. రోడ్డు పక్కనే తొలుత కూరగాయల అమ్మకాలు జరిపారు. తర్వాత పాకలు వేసి ఇప్పుడు పక్కా నిర్మాణాలు మొదలుపెట్టారు. ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.50 లక్షలకుపైగా ఉంటుంది. సర్వే నం.410-1లో 3.19 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ, గెడ్డవాగు భూమిగా నమోదై ఉంది. ఇందులో కొంత భూమిలో సంపద కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణంలో ఉంది. మిగిలిన భూమి ఆక్రమణలకు గురవుతోంది. 414-3లో 5 సెంట్లను ఆక్రమించేశారు. తహసీల్దారు రమేశ్‌బాబుకు



దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన వెంటనే స్పందించారు. వీఆర్వో నాయుడు, వీఆర్ఏలను పంపి నిర్మాణ పనులను నిలిపివేయించారు.

# సీటొస్తే.. చాలు

తిరుపతి : కార్పొరేట్ సంస్థల దూకుడులోనూ తితిదే విద్యా సంస్థలు తమ ఉనికిని బలంగా చాటుతున్నాయి. ఇంటర్ ప్రవేశాల్లో వీటికున్న డిమాండు అంతాఇంతా కాదు. బాలబాలికలకు ప్రత్యేకంగా రెండు జూనియర్ కళాశాలలు ఉండగా బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా మరోటి నిర్వహిస్తున్నారు. అతి తక్కువ ఫీజులు ఉండటం, ఉత్తమ బోధన, వసతిగృహ సౌకర్యం, సైన్స్ విద్యార్థులకు తగినన్ని ప్రయోగశాలలు, సరైన క్రీడా మైదానాలు ఉండటంతో రాయలసీమలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువగా పోటీ పడుతున్నారు.

**రెండు జూనియర్ కళాశాలల్లోనూ..**

ఎస్వీ జూనియర్ కళాశాలలో మొదటి ఏడాదిలో ఏటా 792 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 600 మంది విద్యార్థులకు వసతిగృహం సౌకర్యం ఉటుంది. బాలికల కోసం ఉద్దేశించిన శ్రీపద్మావతి జూనియర్ కళాశాలలో 968 మందికి ప్రథమ సంవత్సరంలో ప్రవేశం ఉంటుంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 1,100 మందికి వసతిగృహ అవకాశం కల్పిస్తారు. ఒకే ప్రాంగణంలో కళాశాల, వసతిగృహం ఉండడంతో తల్లిదండ్రులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. తెల్లరేషన్ కార్డులు కలిగినవారు విద్యుత్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

**బధిరులకు ప్రత్యేకం:** అలిపిరి సమీపంలో బధిర విద్యార్థులకు ప్రత్యేక



కళాశాల ఉంది. ఇందులో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉండగా 45 చొప్పున భర్తీ చేస్తారు. ప్రాంగణంలోనే వసతి గృహం ఉంది. తిరుపతి భవానినగర్‌లోని ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో పదో తరగతి పూర్తయిన వెంటనే ప్రీడిగ్రీ, బీఏవోఎల్‌లో తెలుగు, సంస్కృతం, హిందీ విభాగాల్లో ప్రవేశాలు ఉన్నాయి. ఆయా విభాగాల్లో మొత్తంగా 180 మందికి ప్రవేశాలు కల్పిస్తారు.

**ఉత్తీర్ణత ఇలా..**

శ్రీపద్మావతి: 93%,
ఎస్వీ: 84.50%
రుసుములు, దరఖాస్తుల సమర్పణ ఇలా..
సైన్స్ విద్యార్థులు: రూ.5,350
ఆర్ట్స్ విద్యార్థులు: రూ.4,400
ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు
పద్మావతి: 6,000
ఎస్వీ: 7,200 దరఖాస్తు ఇలా..ఈ ఏడాది ప్రవేశాలకు ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. మే 31వ తేదీ వరకు అవకాశం ఉంది http://admission.tirumal.org వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తులు సమర్పించవచ్చు.

# కాలుష్య వ్యర్థాల.. కట్టడి సున్నా

పుత్తూరు :నారాయణవనం మండలం కీళగరం వద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీ ఏర్పాటులో నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తోంది. కంపెనీ ప్రారంభంలోనే ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయాల్సిన యాజమాన్యం అప్పటి వైకాపా నేతల అండతో అందుకు తిలోదకాలిచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు పట్టించుకోకుండానే ఉత్పత్తి ప్రారంభించారు. అరుణా నదితోపాటు ఇతర ప్రాంతాల్లో వ్యర్థాలు వదిలేస్తున్నట్లు తాజాగా వెలుగు చూసింది. ఇదే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలికి స్థానిక అధికారులు లిఖితపూర్వకంగా నివేదించారు.

**నిబంధనలకు విరుద్ధంగా..:** ఫార్మాస్యూటికల్ కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలు ట్రీట్‌మెంట్ చేసి బయటకు వదలాలి. అయితే ఇవేమీ పట్టనట్లు



కంపెనీ యాజమాన్యం వ్యవహరించింది. వాస్తవానికి కంపెనీ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జడ్ఎల్‌డీ) అనంతరం వదిలిపెట్టాలి. ప్రస్తుతం ప్లాంటు నుంచే నేరుగా వ్యర్థాలు వదిలేస్తుండటంతో సమీప ప్రాంతాల్లో కాలుష్య సమస్యలు ఎదురవుతున్నాయి. కంపెనీ ప్రారంభించే ముందు అన్ని శాఖల అధికారులతోపాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేసి అనుమతులు ఇవ్వాలి. అయితే ఇవేవీ లేకుండానే వైకాపా నాయకుల అండతో అనుమతులు పొందినట్లు స్పష్టమవుతోంది.

**నోటీసులు ఇస్తున్నాం..:** నారాయణవనంలోని ఫార్మాస్యూటికల్ కంపెనీలో జడ్ఎల్‌డీ ప్లాంటు ఇంకా నిర్మించలేదు. దీంతో వ్యర్థాలను బయట ప్రాంతాల్లో వదులుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే మండల అధికారుల బృందం నిర్ధారించింది. కంపెనీ యాజమాన్యం నుంచి వివరణ తీసుకుని తదుపరి చర్యలకు ఉపక్రమిస్తాం. రాజశేఖర్, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, తిరుపతి

# 30 కిలోలు.. రూ.1674

చిత్తూరు : ఖరీఫ్ రైతులకు వేరుసెనగ విత్తనకాయల ధరలు ఖరారు చేస్తూ వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జిల్లాకు 26 వేల క్వింటాళ్ల విత్తు కేటాయించగా విత్తన సరఫరా బాధ్యతలను ఏపీ విత్తన సంస్థకు అప్పగించారు. ప్రస్తుతానికి జిల్లాకు 7,500 క్వింటాళ్లు చేరినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కే6 రకం క్వింటా రూ.9,300 కాగా ప్రభుత్వ రాయితీ రూ.3,720 (40%) పోను రైతువాటా రూ.5,580 చెల్లించాలి. ఈ లెక్కన 30 కిలోల బస్తా ధర రూ.1,674 కానుంది. రాయితీపోను నారాయణి రకం 30 కిలోల విత్తన ధర రూ.1,710, కదిరి లేపాక్షి రకం 30 కిలోల ధర రూ.1,476గా ఖరారు చేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా వీలైనంత త్వరగా విత్తు పంపిణీ ప్రారంభించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ కసరత్తు వేగవంతం చేసింది.బస్తాపై రూ.36 తగ్గింపు : ఖరీఫ్‌లో వేరుసెనగ పంట విస్తారంగా సాగవుతోంది. ఏటా విత్తన ధరలు పెరుగుతూనే ఉండేవి. కూటమి ప్రభుత్వం రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో విత్తన ధరలు తగ్గించింది. గతేడాది 30 కిలోల బస్తా ధర రూ.1,710 ఉండగా ఈ ఏడాది బస్తాపై రూ.36 తగ్గించి రూ.1,674కే అందజేయనుంది.జిల్లా రైతులకు రూ.80 లక్షలు ఆదా కానుంది.

# అనుగ్రహమేదీ

కర్నూలు : జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను చేర్చుకుంటుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు సదుపాయాలు కానరావడం లేదు. అవసరమైన సిబ్బంది లేకపోవడంతో పర్యవేక్షణ కరవైంది. వెల్దుర్తి, ఎమ్మిగనూరులోని బీసీ బాలికల వసతిగృహాలు, కంబాలపాడు, ఆదోనిలోని బీసీ బాలుర వసతిగృహాల్లో విద్యార్థులు ఎక్కువగా చేరుతున్నారు. దీంతోపాటు రాజకీయ నాయకులు సైతం సిఫార్సు చేస్తుండటంతో అధికారులు అడ్డుచెప్పలేకపోతున్నారు. ఆ నాలుగుచోట్లా అదనంగా మరో వసతిగృహం కావాలని ప్రతిపాదనలు పంపినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

వెల్దుర్తిలోని బీసీ బాలికల వసతిగృహంలో 2024–25 విద్యా సంవత్సరంలో 573 మంది ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ కేవలం 200 మందికి తగ్గట్టు సదుపాయాలున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో వంద మందిని, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో మరో వంద మందిని చేర్చుకోవాలి. 2023లో అధికారిక అనుమతులు తీసుకుని వాటి ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇక్కడ 200 మందికంటే అదనంగా 373 మందిని చేర్చుకోవడంపై విమర్శలు రేగుతున్నాయి. విద్యార్థినుల ఇబ్బందులు తీర్చేందుకుగాను దాతల సాయంతో ఒక భవనం, ఒక షెడ్డు నిర్మించి అందులోనే ఉంచుతున్నారు.




**సౌకర్యాలు కరవై..**

వసతిగృహాలను ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేస్తే వాటి సామర్థ్యానికి తగ్గట్టు అవసరమైన సిబ్బందిని నియమిస్తుంది. వంద మంది విద్యార్థులుంటే కనీసం ముగ్గురిని కేటాయిస్తుంది. ఒకరు వంట చేసేందుకు, మరొకరు అటెండరుగా, ఇంకొకరిని రాత్రి కాపలాదారుగా నియమిస్తారు. 573 మంది విద్యార్థులకు ఇద్దరితో వంట చేయించడం కష్టమే. నిబంధనల ప్రకారం 500 మంది విద్యార్థులు ఉంటే కనీసం పది మంది నాలుగో తరగతి ఉద్యోగులుండాలి. దీనికితోడు అవసరమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.

**సామర్థ్యానికి మించి..**

కృష్ణగిరి మండలం కంబాలపాడు బీసీ బాలుర వసతిగృహంలో 2024–25 విద్యా సంవత్సరంలో 300 మంది విద్యార్థులకుగాను 480 మంది ఉన్నారు. 180 మందికి అదనంగా ప్రవేశాలు కల్పించారు. ఈ వసతిగృహానికి ఉన్న డిమాండు దృష్ట్యా ఇక్కడే మరో వసతిగృహం నిర్మించాలని అధికారులు ప్రతిపాదించగా గత వైకాపా ప్రభుత్వం దానిని పక్కన పెట్టింది.ఆదోని బీసీ కళాశాల విద్యార్థుల వసతిగృహం అధికారిక సామర్థ్యం 100 కాగా 422 మంది ఉన్నారు. ఇక్కడ సైతం మరో 300 మంది విద్యార్థులకు సరిపడా వసతిగృహానికి అనుమతించాలన్న ప్రతిపాదనకు మోక్షం కలగలేదు. ఎమ్మిగనూరు బీసీ బాలికల వసతిగృహ సామర్థ్యం 200 కాగా 2024–25లో 350 మంది విద్యార్థినులు ఉన్నారు.

# వజ్రాన్వేషకులు

మద్దికెర: తొలకరి వర్షాలు పలకరిస్తే చాలు.. వజ్రాన్వేషకు లు పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే అన్వేషకుల పంట పండుతోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మద్దికెర, తుగ్గలి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వజ్రాలు వెతికేందుకు తరలివెళ్తున్నారు. తొలకరి వర్షాల నేపథ్యంలో పలువురికి విలువైన వజ్రాలు లభ్యమవుతున్నాయి. దొరికిన వాటిని ఈ ప్రాంత వ్యాపారులు అవసరమైతే బహిరంగ ఎవరికీ తెలియకపోతే రహస్యంగా కొనుగోలు చేస్తున్నారు.

**అదృష్టం కలిసొస్తే..**

వజ్రాన్వేషణలో కలిసొస్తే.. క్షణాల్లో లక్షాధికారి కావొచ్చన్న ఉద్దేశంతో ఎక్కడో దూర ప్రాంతాల నుంచి జనం ఈ ప్రాంతాలకు వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటారు. తొలకరి చినుకులు పలకరిస్తే.. రైతులు పొలం బాట పడతారు. కానీ ఈ ప్రాంతంలో ఎర్ర నేలల్లో ఏటా వజ్రాన్వేషకులు తిష్ఠవేస్తారు. తుగ్గలి మండలం పగిడిరాయి, జొన్నగిరి, జి.ఎర్రగుడి, చెన్నంపల్లి, రాంపురం, ఉప్పర్లపల్లి గ్రామాలతో పాటు మద్దికెర మండలం పెరవలి,



మదనంతపురం, బసినేపల్లి గ్రామాల్లోని ఎర్ర నేలల్లోనూ వజ్రాలు లభిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో వజ్రాన్వేషణ చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకొ ంటుంటారు. ఏటా మే చివరి వారం, జూన్‌లో జొన్నగిరి, మదనంతపు రం బస్టాండ్ సమీప పొలాల్లో వజ్రాన్వేషకులు గుంపులు గుంపులుగా కనిపిస్తారు. స్థానికులేకాక ప్రకాశం, గుంటూరు, అనంతపురం జిల్లాలు, సమీప కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఎక్కువగా వజ్రాన్వేషకులు వస్తుంటారు. గుత్తి– పత్తికొండ ప్రధాన రహదారిపై కార్లలో వెళ్లేవారు సైతం పొలాల్లో జనాల గుంపులను చూసి ఓ అరగంటపాటు వజ్రాల కోసం వెతికి వెళ్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు పగలంతా వజ్రాన్వేషణ చేసి రాత్రివేళలో జొన్నగిరి బాటాంజనే య స్వామి, మదనంతపురం బస్టాండ్, దొన వద్ద రాత్రివేళల్లో సేదదీరుతు ంటారు. ఆయా గ్రామాల్లో హొటళ్లు కళకళలాడుతున్నాయి. మదనంతపురం బస్టాండ్ సమీపంలో రహదారి వెంబడి గత ఏడాది రెండు హొటళ్లు ఉండగా.. ఇప్పుడు ఏడుకు చేరింది జనం గుంపులుగా పొలాల్లో తిరుగుతుం డటంతో భూమి గట్టి పట్టి విత్తనాలు చల్లే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సాగుకు ఊతం.. రైతులకు వరం



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో బిందు, తుంపర సేద్యం పథకం కింద పరికరాలు అందక నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకం అమలుకు చర్యలు తీసుకుంది. 2014–19 అప్పటి ప్రభుత్వ హయాంలో పాత నిబంధనలు పునరుద్ధరిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు 32 వేల హెక్టార్లు అమలుకు లక్ష్యంగా నిర్దేశించారు. అనంతపురం జిల్లాకు 18 వేలు, శ్రీసత్యసాయి జిల్లాకు 14 వేల హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**కోరిన కంపెనీని ఎంపిక చేసుకోవచ్చు..**

ఈ ఏడాది బిందు, తుంపర సేద్యం పరికరాలు సరఫరా చేసేందుకు 29 కంపెనీలకు బాధ్యతలు అప్పగించారు. ఆయా కంపెనీల జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాల్లో అంటించారు. రైతులు కోరిన కంపెనీ ఎంపిక చేసుకుని పేర్లు నమోదు చేసుకోవచ్చు. రైతు ఆధార్ కార్డు నకలు, పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఒన్‌బీ నకలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్యాంకు ఖాతా పుస్తకం వంటి నకళ్లను రైతు సేవా కేంద్రానికి వెంట తీసుకెళ్లాలి. ఈ పత్రాలన్నీ రిజిస్ట్రేషన్ పత్రానికి జత చేయాల్సి ఉంటుంది.

అంశం : బిందు, తుంపరసేద్యం
ఈ ఏడాది లక్ష్యం : 32 వేల హెక్టార్లు
ఎస్సీ, ఎస్టీ రైతులకు రాయితీ : 100 శాతం
10 ఎకరాల్లోపు రైతులకు.. : 90 శాతం
తుంపర సేద్యం అందరికీ : 50 శాతం

**డిజిటల్ పేమెంట్ చెల్లింపులు**

పేరు నమోదు చేసుకున్న రైతులు పొలాల్లో ప్రాథమిక పరిశీలన చేసిన తర్వాత చెల్లించాల్సిన రైతు వాటా రిజిస్టరైన చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా సంక్షిప్త సమాచారం వస్తోంది. డిజిటల్ పేమెంట్ (ఎన్ఈఎఫ్టీ, ఫోన్‌పే, గూగుల్ పే) ద్వారా ఏపీఎంఐపీ ఖాతాకు నేరుగా జమ చేయాల్సి ఉంటుంది. సొమ్ము చెల్లింపులో రైతులు మధ్యవర్తులు, దళారులను నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు.

సద్వినియోగం చేసుకోండి: రఘునాథరెడ్డి, సుదర్శన్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్లు

గత ప్రభుత్వంలో బిందుసేద్యం అమలుకు చిన్న సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 5 ఎకరాల్లోపు 90 శాతం, 5–10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం రాయితీ ఉండేది. ఈ ప్రభుత్వం పాత నిబంధనలను పునరుద్ధరించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ, 10 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం తుంపర సేద్యం పరికరాలు అందరు రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తాం.

# దస్త్రాలు మాయం.. బిల్లులు అందక దయనీయం



చెన్నేకొత్తపల్లి : ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాక గుత్తేదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. 2016 నుంచి 2019 వరకు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో గుత్తేదారులు వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు. వీటికి కొంతమేర బిల్లులు మంజూరయ్యాయి. పూర్తి బిల్లులకు సంబంధించి అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించారు. డిపాజిట్లు, నాణ్యత ప్రమాణాల ధ్రువీకరణపత్రాలు పూర్తయ్యాయి. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లుల మంజూరుపై నిర్లక్ష్యం వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులకోసం గుత్తేదారులు అధికారులను సంప్రదించగా వాటికి సంబంధించిన సామాజిక దస్త్రాలు తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయం, ఉమ్మడి జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగినా అవి కనిపించలేదు. ఈ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**చేపట్టిన అభివృద్ధి పనులు**

2014 నుంచి 2019 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మినీ గోకులం పశువుల షెడ్లు, సీసీదారుల నిర్మాణం, పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు, ధోబీఘాట్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, చెక్‌డ్యామ్ తదితర పనులు చేపట్టి పూర్తి చేశారు. సీకేపల్లిలో 61 సీసీ రోడ్లు రూ.6.29 కోట్లు, 8 పాఠశాలల ప్రహరీలు రూ.3.5 కోట్లు, 16 అంగన్‌వాడీ భవనాలు రూ.1.12కోట్లు, 6 ధోబీఘాట్లు రూ.27 లక్షలు, 13 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు రూ.34 లక్షలతో పనులు పూర్తి చేశారు. వాటి బిల్లులు గుత్తేదారులకు అరకొరగా అందాయి. మిగతా సొమ్ము మంజూరు కావాలంటే సామాజిక తనిఖీ దస్త్రాలు, క్వాలిటీ కంట్రోల్ దస్త్రాలు అవసరం. కొంతమంది గుత్తేదారుల వద్ద దస్త్రాలు లేక బిల్లుల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. అప్పులు చేసి పనులు నిర్వహించామని గుత్తేదారులు వాపోతున్నారు.

**రూ.5.20 లక్షలు రావాల్సి ఉంది: వెంకటేశులు, గుత్తేదారు**

పులేటిపల్లిలో అభివృద్ధి పనులు పెద్దఎత్తున నిర్వహించాం. స్థానికుడైన కేశవరెడ్డితో కలిసి రూ.15 లక్షల అంచనా వ్యయంతో సీసీదారులు నిర్మించాం. ఒక దఫా రూ.9.80 లక్షల బిల్లు మంజూరైంది. సామాజిక ఆడిట్ సిబ్బంది వచ్చి దారులను తనిఖీ చేశారు. తరువాత వైకాపా అధికారంలోకి వచ్చింది. తాము తెదేపా వాళ్లమన్న ఉద్దేశంతో బిల్లులు మంజూరు చేయలేదు.

**దస్త్రాలు ఉంటేనే మంజూరు: విజయేంద్ర ప్రసాద్, డ్వామా పీడీ**

డ్వామా కార్యాలయాలతోపాటు ఇతర ఉన్నతాధికారులకు సామాజిక తనిఖీ దస్త్రాలు అందిస్తారు. చెన్నేకొత్తపల్లి కార్యాలయంలో అవి మాయమైన విషయాన్ని అధికారులను విచారిస్తాం.

# రెట్టింపు దోపిడీ

చోడవరం : వేసవి సెలవులే కదా అని నలుగురు పిల్లలు పశువులను తోలుకుని శారదా నది ఒడ్డుకు వెళ్లారు. పశువులు మేత మేస్తున్నాయి. ఖాళీగా కూర్చోవడం ఎందుకని నలుగురూ నదిలో స్నానాలకు దిగారు. ఇసుక కోసం తవ్విన గోతిలో చిక్కుకుని ఊపిరాడక మృత్యువాత పడ్డారు. చోడవరం మండలం ముద్దుర్తి సమీపంలో ఈ ఘటన గతంలో చోటుచేసు కుంది. ఇటుకల తయారీ పరిశ్రమలో పని చేసేందుకు ఒడిశా నుంచి వచ్చిన ఓ కూలీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదికి వెళ్లాడు. నీటిలో దిగిన చోట ఊబిలాంటి గొయ్యి ఉండటంతో పట్టుతప్పి మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గౌరీపట్నంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన ముగ్గురు వేర్వేరు సందర్భాల్లో నదిలో నీట మునిగి మృతి చెందారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరిగింది. ఇసుక ధర చుక్కలను తాకి సామాన్యులను అందుబాటులో లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను ఉచితం చేయడంతో అందరూ సంతోషించారు. స్థానికంగా ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా తవ్వి, తరలించవచ్చన్న వెసులుబాటును ఇసుక అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. స్థానికత పేరుతో రెట్టింపు దోపిడీకి పాల్పడుతూ అక్రమార్జన చేస్తున్నారు. శారదా నదిలో అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలతో జన్నవరం, గవరవరం, లక్కవరం, గజపతి నగరం పరివాహక ప్రాంతాలు మృత్యుకుహరాలుగా మారాయి. చోడవరం మండల పరిధిలో పది మంది వరకు నదిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతుల్లో చిక్కుకుని ప్రాణాలు విడిచారు. వీరిలో ఆరుగురు పిల్లలే. పశువులు కాసేందుకు వెళ్లి ఈతకొట్టేందుకు, స్నానాలు చేసేందుకు నీటిలో దిగి తల్లిదండ్రులకు తీరం శోకం మిగిల్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వీరంతా నదీ పరివాహక, కొండను ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన వారే కావడం గమనార్హం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు



ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. శారదా నది, కంకర కోసం కొండలను గుల్ల చేస్తుండటంతో ఏర్పడిన గోతులు ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. నర్సాపురం వద్ద కొండను పూర్తిగా డొల్ల చేశారు. పెద్ద పెద్ద సొరంగాలుగా కొండ దిగువ ప్రాంతాలున్నాయి. కొండ అంచున రాళ్లు దొర్లి పడేలా ఉన్నాయి. ఇక్కడకు సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉంది. అటుగా వెళ్లేందుకు పిల్లలు భయపడుతున్నారు. గోవాడలో కొండ దిగువ ప్రాంతాలను చదును చేసి ఆవాసాలకు అనుకూలంగా మార్చేందుకు పలువురు కంకర తవ్వకందారులను ప్రోత్సహించారు. సీమునాపల్లిలో ఇసుక తవ్వకాలతో శారదా నది గర్భం 30 అడుగుల లోతుకు పడిపోయింది. గవరవరం, లక్కవరం గ్రామాల వద్దా ఇదే పరిస్థితి. నదీ పరివాహక ప్రాంతాలకు చెందిన రైతులు సాగు భూములంటూ నది భూభాగాన్ని ఇసుక తవ్వకందారులకు విక్రయిస్తున్నారు. తవ్వకాలతో నది లోతుగా మారి పంట కాలువలకు నీరందడం లేదు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్టవేయాలని జనసేన, సీపీఐ నాయకులు కోరుతున్నారు.

# సేవలకు మధ్యేమార్గం

కర్నూలు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూతన విధానాలు ప్రవేశపెట్టినా మధ్యవర్తులకు అడ్డుకట్ట పడటం లేదు. రిజిస్ట్రేషన్, ఇతరత్రా సేవల్లో వారి జోక్యం తప్పనిసరిగా మారింది. కూటమి ప్రభుత్వం ఇటీవల స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం ప్రవేశపెట్టినప్పటికీ వివిధ సమస్యల నేపథ్యంలో జనం వారినే ఆశ్రయిస్తున్నారు.

**ప్రచారం లేక పాట్లు**

ప్రస్తుతం అమలులో ఉన్న స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ 72 స్లాట్లకే అనుమతి ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. స్లాట్ బుకింగ్ చేసుకోకుండా నేరుగా వెళితే ఇబ్బంది పెడుతున్నారు. సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల కోసం జనం మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రమైన కర్నూలులో ఈ సమస్య ఎక్కువగా ఉంది. స్లాట్ బుకింగ్ విధానంపై పెద్దగా ప్రచారం చేయకపోవడంతో చాలామందికి దీనిపై అవగాహన కరవైంది.

**దళారులను సంప్రదిస్తేనే..**

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం దళారులకు మరో అవకాశంగా మారింది. బుకింగ్ చేసేందుకు పలువురు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. స్లాట్ బుకింగ్‌పై చాలామందికి అవగాహన లేదు. దీనిని దళారులు అవకాశంగా చేసుకుంటున్నారు. కొందరికి అవగాహన ఉన్నా స్లాట్ నమోదు చేసుకునే క్రమంలో పొరపాట్లు జరుగుతుండటంతో దళారులను ఆశ్రయించక తప్పటం లేదు. రిజిస్ట్రేషన్‌తోపాటు స్లాట్ బుకింగ్‌కు మామూళ్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



**నిఘా ఉత్తిదే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతిరోజూ 500 రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. అత్యధికంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని కర్నూలు, కల్లూరు కార్యాలయాల్లో 150 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో మధ్యవర్తులు, దస్తావేజులేఖరుల ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. గతంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కొందరు దస్తావేజులేఖరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు బయటపడింది. 2022, ఏప్రిల్ 27న అవినీతి నిరోధకశాఖ అధికారులు ఆకస్మిక దాడులు చేసిన సందర్భంలో కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.41,470 అనధికార డబ్బు, కల్లూరు కార్యాలయంలో ఓ బీరువా వెనుక రూ.40 వేల నగదుతో పాటు మధ్యవర్తుల వద్ద మరో రూ.19,330 గుర్తించి సీజ్ చేశారు. కల్లూరు కార్యాలయంలో దొరికిన అనధికార డబ్బు అవినీతి సొమ్ముగా నిర్ధారించి కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మధ్యవర్తులను కట్టడి చేసే ఉద్దేశంతో అదే ఏడాది మేలో ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి విజయవాడలోని రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ కార్యాలయానికి అనుసంధానం చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా మధ్యవర్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

# తొలకరి చినుకులు.. నిండుకున్న ఎరువులు

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేసవిలోనే విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో పంటలు పెద్దఎత్తున సాగవుతాయని అంచనా వేస్తున్నారు. కానీ అవసరాలకు తగ్గట్టు ఎరువుల సరఫరా కావడం లేదు. గత కొన్ని నెలలుగా యూరియా సరఫరా ఆగిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

**నిల్వలు అరకొరే** ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. త్వరలో ఖరీఫ్ మొదలుకానుంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఖరీఫ్ నుంచి రబీ వరకు కర్నూలు జిల్లాలో 2,34,141 మె.టన్నులు, నంద్యాల జిల్లాలో 3,36,292 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని గోదాముల్లో కేవలం 75,665 మె.టన్నుల ఎరువులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**యూరియా.. ఊసే లేదయా**

ఉమ్మడి జిల్లాకు ఎంతమేర యూరియా అవసరమన్న ప్రతిపాదనలు రూపొందించలేదు. రాష్ట్రానికి ఏమేర ఎరువులు అవసరమన్న విషయాన్ని కేంద్రం అడగకపోవడంతో ఉన్నతాధికారులు జిల్లా నుంచి వివరాలు తీసుకోలేదన్న ప్రచారం ఉంది.గతేడాది నంద్యాల జిల్లాకు 1,16,816 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా 1,09,518 మె.టన్నులు సరఫరా చేశారు. కర్నూలు జిల్లాకు 95,876 మె.టన్నులు అందజేశారు. ప్రస్తుతం ఖరీఫ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు 1.47 లక్షల మె.టన్నుల యూరియా అవసరమని అంచనా.

**పెరగనున్న సాగు విస్తీర్ణం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6.75 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సాగు పెరగనుంది. సాధారణంగా రైతులు పంటలు వేసిన తర్వాత జూన్, జులైలో యూరియాను అధికంగా వాడుతారు. ఆగస్టు, సెప్టెంబరులో వరి, మిరపకు ఎక్కువ మోతాదులో వినియోగిస్తారు. గతేడాది ఇదే సమయానికి కర్నూలు జిల్లాలో 10 వేల మె.టన్నుల యూరియా నిల్వలు ఉండగా ప్రస్తుతం 5 వేల మెట్రిక్ టన్నుల్లోపే ఉన్నాయి. నంద్యాల జిల్లా పరిధిలో గతేడాది 20 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉండగా.. ఈసారి 6 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**మూడు నెలలుగా రాక..**

ఉమ్మడి జిల్లాకు గత మూడు నెలలుగా యూరియా సరఫరా కాలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు కొద్దిగా కాంప్లెక్స్ ఎరువులు వచ్చినప్పటికి యూరియా మాత్రం రాలేదు. మార్చి నుంచి ఇప్పటి వరకు ఒక్క రైల్వే ర్యాక్ కూడా రాకపోవడం గమనార్హం. ఖరీఫ్ సాగు పెరిగే అవకాశాలున్నప్పటికీ యూరియా సరఫరా కానరావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చురకలు



## నిజమైన అందాల నిధిని చూడండి

సవ్యసాచి, మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. పేరుకు తగ్గట్లుగానే అందాల నిధి ఈ అమ్మడు అనిపించే విధంగా చాలా అందంగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 30 మిలియన్‌లకు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు ఇండస్ట్రీలో మాత్రం పెద్దగా సినిమాల్లో కనిపించడం లేదు. 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో ఈ అమ్మడు సక్సెస్ దక్కించుకున్నాడు. ఆ తర్వాత వరుస సినిమాలు వస్తాయని ఆశించినా కూడా అదృష్టం ఈ అమ్మడికి కలిసి రాలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో కెరీర్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వచ్చే నెలలో ఈ అమ్మడు నటించిన హరి హర వీరమల్లు సినిమా విడుదల కాబోతుంది. పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన ఈ సినిమాకు క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఏ ఎం రత్నం ఈ సినిమాను



నిర్మించారు. ఈ సినిమాపై చాలా అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో నిధి అగర్వాల్ పాత్రకు మంచి స్పందన వస్తుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. అంతే కాకుండా ఈ అమ్మడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాసాబ్ సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ సినిమా కూడా ఇదే ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ ఏడాదిలో ఈ అమ్మడికి అతి పెద్ద రిలీజ్‌లు ఉన్నాయి. ఈ రెండు సినిమాలతో టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా నిధి అగర్వాల్ మారడం ఖాయం అనే నమ్మకంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. ఆ ఫోటోలు ఈమె స్థాయిని మరింత పెంచుతున్నాయి. తాజాగా అందమైన తన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మరోసారి నిధి అగర్వాల్ వైరల్ అవుతోంది. నిజంగా అందాల నిధి ఈ అమ్మడు అంటూ ప్రతి ఒక్కరూ కితాబిచ్చే విధంగా ఈ అమ్మడి ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇంతటి అందాల నిధికి ఎందుకు ఇన్నాళ్లు సరైన బ్రేక్ పడలేదు అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటే, మరికొందరు మాత్రం ఈ ఏడాది ఈమెకు టర్న్ కావడం ఖాయం అంటున్నారు. ఇండస్ట్రీలో ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోలు, వీడియోలు చర్చనీయాంశం అవుతూ ఉంటాయి. అందాల నిధి అగర్వాల్‌కి ఇకపై గుడ్ టైం షురూ అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం. ఎన్నో విధాలుగా అందాల నిధికి స్టార్ హీరోయిన్ అయ్యేందుకు అర్హతలు ఉన్నాయి. కానీ అదృష్టం మాత్రం ఈమెకు కలిసి రాలేదు. అయినా కూడా ఈ అమ్మడు ఇండస్ట్రీలో తన ప్రయత్నాలు చేస్తూ వస్తుంది. ముందు ముందు అయినా ఈ అమ్మడు ఇండస్ట్రీలో ముఖ్యంగా టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి అది సాధ్యమేనా చూడాలి.

## తగ్గింది రెమ్యూనరేషనే.. ఛాన్సులు కాదు

ఇండస్ట్రీలో ఒక్కోసారి ఒక్కొక్కరి టైమ్ నడుస్తూ ఉంటుంది. కొన్నిసార్లు కొందరు లైమ్ లైట్ లో ఉంటే, ఇంకొన్ని సార్లు వేరే కొందరు లైమ్ లైట్ లో ఉంటారు. ప్రస్తుతం నేషనల్ క్రష్ రష్మిక అలాంటి లైమ్ లైట్ లోనే ఉంది. భాషతో సంబంధం లేకుండా ప్రతీ ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ కెరీర్ ను ముందుకు తీసుకెళ్తూ వార్తల్లో నిలుస్తూ ఉంది రష్మిక . అయితే రష్మిక కేవలం తన సినిమాల విషయాల్లోనే కాదు, మరికొన్ని విషయాల్లో కూడా వార్తల్లో నిలుస్తోంది. మరీ ముఖ్యంగా ఈ మధ్య రష్మిక రెమ్యూనరేషన్ గురించి సోషల్ మీడియాలో ఎక్కువ వార్తలు వినిపిస్తున్నాయి. పుష్ప2 సినిమా కోసం రూ. 10 కోట్లు ఛార్జ్ చేసిన రష్మిక రీసెంట్ గా చేస్తున్న సినిమాలకు తన పారితోషికాన్ని చాలా తక్కువ చేసింది. ఛావా సినిమా కోసం రష్మిక రూ. 4 కోట్లు తీసుకుంటే, తర్వాత సల్మాన్ ఖాన్ తో కలిసి చేసిన సికందర్ సినిమాకు రూ. 5 కోట్లు ఛార్జ్ చేసింది. ఇక తాజాగా వచ్చిన కుబేరా సినిమాకు రష్మికకు నిర్మాతలు రూ. 4 కోట్లు మాత్రమే



చెల్లించారట. అంటే పుష్ప2 రెమ్యూనరేషన్ తో పోలిస్తే ఇప్పుడు కుబేరాకు రష్మిక పారితోషికం సుమారు 60% తగ్గింది. ఈ వార్త ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రెమ్యూనరేషన్ తగ్గినప్పటికీ రష్మికకు ఆఫర్లు మాత్రం ఏం తగ్గడం లేదు. రష్మిక ప్రస్తుతం థామా, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాల్లో నటిస్తోంది. ఈ రెండు సినిమాలూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. రెమ్యూనరేషన్ తగ్గిందని రష్మికకు కెరీర్లో బెస్ట్ రోల్స్ రావడం మాత్రం ఆగలేదు. అయితే రష్మిక విషయంలో ఈ రెమ్యూనరేషన్ అనేది పెద్ద సమస్యే కాదని అర్థమవుతుంది. రెమ్యూనరేషన్ తో సంబంధం లేకుండా రష్మిక మాత్రం ప్రస్తుతం పలు పాన్ ఇండియన్ సినిమాల్లో బిజీగా ఉంది. రెమ్యూనరేషన్ అనేది సినిమా సినిమాకీ మారే అవకాశముంది. కానీ రష్మిక మాత్రం నిరంతరం ఎంతో యాక్టివ్ గా ఉంటూ పలు పెద్ద ప్రాజెక్టుల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉంది.




## సూపర్ హిట్ సిరీస్ సీజన్ 4 వచ్చేసింది





ఇండియన్ ఓటీటీ మార్కెట్ పరిధి విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఓటీటీలు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియోలు భారీ వెబ్ సిరీస్‌లను ప్రేక్షకులకు అందిస్తున్నాయి. ఇండియన్ ఓటీటీ ప్రేక్షకుల ముందుకు ఇప్పటికే చాలా వెబ్ సిరీస్‌లు వచ్చాయి. అందులో కొన్ని సినిమాలను మించి సూపర్ హిట్ అయిన విషయం తెల్సిందే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అయ్యే పలు వెబ్ సిరీస్‌లు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. వెబ్ సిరీస్‌లు సక్సెస్ అయితే కొత్త సీజన్‌లు వస్తూనే ఉన్నాయి. అమెజాన్‌లో స్ట్రీమింగ్ అయిన వెబ్ సిరీస్‌ల్లో పంచాయత్ ఒకటి. ఇది పక్కా పల్లెటూరు వాతావరణంలో రూపొందిన వెబ్ సిరీస్. అనూహ్యమైన విజయాన్ని ఈ వెబ్ సిరీస్ సొంతం చేసుకుంది.

2020లో మొదటి సీజన్‌తో పంచాయత్ వచ్చింది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో రూపొందిన ఈ వెబ్ సిరీస్‌లో జితేంద్ర కుమార్, రఘుబీర్ యాదవ్, నీనా గుప్తా, సాన్వికా, చందన్ రాయ్, దుర్గేష్ కుమార్, అశోక్ పాఠక్, సునీతా రాజ్వార్, పంకజ్ ఝా నటించారు. ఉత్తరప్రదేశ్‌లోని మారుమూల గ్రామమైన ఫులేరాలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించే వ్యక్తి కథతో పంచాయత్ వెబ్ సిరీస్ నడుస్తూ ఉంటుంది. వినోదాత్మకంగా, సందేశాత్మకంగా కథ, స్క్రీన్ ప్లే ఉంటుంది. పల్లె వాతావరణంలో ఎక్కువగా కనిపించే సీన్స్ ఈ వెబ్ సిరీస్‌లో కనిపిస్తూ ఉంటాయి. ఇప్పటి వరకు మూడు సీజన్‌లు వచ్చి సూపర్ హిట్ అయిన పంచాయత్ నాల్గోవ సీజన్ స్ట్రీమింగ్ మొదలైంది. గత ఐదేళ్లుగా పంచాయత్ వెబ్ సిరీస్‌ను ఆసక్తిగా చూస్తున్న వారు, అభిమానిస్తున్న వారు ఎప్పుడెప్పుడు పంచాయత్ సీజన్ 4 వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు పంచాయత్ ఎప్పటిలాగే అమెజాన్ ప్రైమ్‌లో కొత్త సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జితేంద్ర కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సీజన్ 4కి మంచి స్పందన లభించింది. అర్ధరాత్రి నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్ సిరీస్‌ను ఇతర భాషల్లోనూ అందుబాటులో ఉంచారు. హిందీ ప్రేక్షకులు అమితంగా అభిమానిస్తున్న పంచాయత్ ముందు ముందు మరిన్ని సీజన్‌లు రావాలని ప్రేక్షకులతో పాటు, ఇండస్ట్రీ వర్గాల వారు కూడా బలంగా కోరుకుంటున్నారు. సీజన్ 4 లో మరో సీజన్ ఉంటుంది అన్నట్లుగానే హింట్ ఇచ్చారని సమాచారం అందుతోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక పంచాయత్ వెబ్ సిరీస్‌ను తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్ చేయకుండా రీమేక్ చేశారు. పంచాయత్ ను సివరపల్లి అనే టైటిల్‌తో రీమేక్ చేశారు. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అయిన ఆ వెబ్ సిరీస్‌కి మంచి స్పందన దక్కింది. తెలుగు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో వెంటనే సీజన్ 2 మొదలు పెడతారని అంతా అనుకున్నారు.

కానీ ఇప్పటి వరకు ఆ ఏర్పాట్లు జరిగినట్లుగా లేవు. హిందీలో ఇప్పటికే నాలుగు సీజన్‌లు స్ట్రీమింగ్ అవుతున్న నేపథ్యంలో తెలుగులో రెండో సీజన్‌ను ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేసి ఉంటే బాగుండేది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సివరపల్లి ని మరింతగా వినోదాత్మకంగా సీజన్ 2 తో తీసుకు వస్తే తప్పకుండా మంచి ఫలితం ఉంటుంది.

## హరి హర వీర మల్లు.. మరో సర్ ప్రైజ్ ఏంటంటే..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మకమైన సినిమా హరి హర వీర మల్లు ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని చివరికి జూలై 24న విడుదలకు రెడీ అవుతోంది. అనేక వాయిదాల తర్వాత ఎట్టకేలకు ఈ సినిమా థియేటర్లలోకి వచ్చేలా సన్నాహాలు జరుపుకుంటోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సినిమాపై మళ్లీ హైప్ పెంచేందుకు కీలకమైన అంశం ట్రైలర్ కావడం విశేషం. లేటెస్ట్ సమాచారం ప్రకారం, జ్యోతి కృష్ణ నేతృత్వంలో టెక్నికల్ టీం కొత్త ట్రైలర్ రూపకల్పనలో నిమగ్నమై ఉంది. వీఎఫ్ఎక్స్ పనులు చివరి దశలో ఉండటంతో, దానిని బట్టి కొత్త ట్రైలర్ కట్ చేస్తున్నారు. ఈ ట్రైలర్ మెయిన్‌గా బజ్ క్రియేట్ చేయడమే కాకుండా, సినిమా థియేట్రికల్ బిజినెస్ పూర్తయ్యేలా చేస్తుందని అంచనా. ట్రైలర్‌ను జూలై మొదటి వారం రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌ను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. పవన్ అభిమానులంతా ఈ ట్రైలర్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు బాహుబలి ఫేం ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో ట్రైలర్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రాన్ని మొదటగా క్రిష్ డైరెక్ట్ చేయగా, చాలా భాగాన్ని పూర్తి చేసిన తర్వాత ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. తరువాత దర్శకత్వ బాధ్యతలు జ్యోతి కృష్ణ తీసుకున్నారు. అయినప్పటికీ మేకింగ్ విధానంలో ఎలాంటి మార్పు రాలేదని పర్ఫెక్ట్ అవుట్ పుట్ వచ్చినట్లు మేకర్స్ చెబుతున్నారు. పవన్ కల్యాణ్ అద్భుతమైన పాత్రలో నటిస్తుండగా, బాబీ డియోల్ విలన్‌గా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏఎం రత్నం ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఇప్పటికే సినిమా ఓ వాయిదా తర్వాత మరోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో నిరాశ నెలకొన్నా.. ఇప్పుడు ట్రైలర్ డేట్ ఫిక్స్ కావడం, విడుదల తేదీ ఖరారు కావడం మరలా హైప్‌ను రీసెట్ చేసింది. జూలై 24న థియేటర్లలోకి రాబోతున్న హరి హర వీర మల్లు, ట్రైలర్ ద్వారా ఎంత హంగామా చేస్తుందో చూడాలి. అలాగే పవన్ పవర్‌తో ఈసారి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ అవుతాయో చూడాలి.

## యామీ గౌతమ్ ని అలా లాక్ చేయొచ్చు!

సాధారణంగా నటీనటులు ఎవరైనా కథ..అందులో తన పాత్ర విని నచ్చితే ఒకే చెబుతారు. అందులో ఎక్కడైనా గందరోళం ఉందంటే తలెత్తిన సందేహాలను అడిగి తెలుసుకుంటారు. ఇంకా క్లారిటీగా తెలుసుకోవాలనుకుంటే? మళ్లీ నేరెట్ చేయమని దర్శకులకు చెబుతుంటారు. దర్శకులు కూడా అదే విధానంలో నేరేట్ చేస్తుంటారు. వీలైనంత వరకూ ఏ డైరెక్టర్ అయినా నేరేట్ చేయడానికే చూస్తుంటారు. చాలా తక్కువ మంది దర్శకులు మాత్రమే నేరేట్ చేయకుండా రాసిన స్క్రిప్ట్ ను , పాత్రను చేతుల్లో పెట్టి చదువుకుని నిర్ణయం చెప్పమంటారు.



ఇది చాలా అరుదుగా జరుగుతుంది. ఇదంతా దర్శకుడిపై ఆధార పడి ఉంటుంది. కాబట్టి ఇక్కడ హీరోయిన్లు ఛాన్స్ తీసుకోవడానికి ఉండదు. కానీ యామీ గౌతమ్ మాత్రం ఛాన్స్ తీసుకునే టైప్ అని తెలుస్తోంది. యామీ గౌతమ్కి స్టోరీ నేరేట్ చేయడం కంటే రాసింది తనకు ఇచ్చేస్తే బాగా అర్థం చేసుకుంటాననటోంది. తన దగ్గరకు వచ్చే నిర్మాతలకు, దర్శకులకు కథను చెప్పడం కంటే చదవడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపింది. ఒకవేళ అందులో తన పాత్ర బలంగా ఉంటే మొత్తం స్క్రిప్ట్ చదవకుండానే ఒకే చెప్పేస్తా నంటోంది. ఆ విషయంలో స్క్రిప్ట్ ను పెద్దగా పట్టించుకోనంది.

దీంతో కొంత మంది దర్శక, రచయితలకు యామినీని ఒప్పించడానికి ఇది మంచి అవకాశమే అవుతుంది. తన పాత్రవరకూ రాసిచ్చేస్తే నచ్చితే ఒకే చేస్తుంది. లేదంటే నో చెబుతుంది. దీని వల్ల దర్శక, రచయితలకు బోలెడంత సమయం కలిసొస్తుంది. ప్రత్యేకంగా ఆమె దగ్గరకు వెళ్లి నేరేట్ చేయాల్సిన పనిలేదు. ముందుగానే అపాయింట్ మెంట్ తీసుకోవాల్సిన పని అంతకన్నా ఉండదు. ఫోన్ కాల్ చేసి విషయం చెబితే సరి.

## పెళ్లయ్యాక అవకాశాలే కరువయ్యాయి

అదితి రావు హైదరి పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. సమ్మోహనం, చెలియా లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు కూడా బాగానే దగ్గరైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న అదితి రావు హైదరి కెరీర్లో ప్రస్తుతం సినీ ఆఫర్లు కరువయ్యాయి. ఒకప్పుడు వరుస సినిమాలతో బిజీగా ఉన్న అదితి ఇప్పుడు చేతిలో పెద్దగా ఆఫర్లు లేక ఖాళీగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా సినీ హీరో సిద్ధార్థ్ తో ప్రేమాయణంను నడిపించిన అదితి, గతేడాది అతన్ని పెళ్లి చేసుకుని మరోసారి పెళ్లి జీవితంలోకి ఎంటరైంది. సిద్ధార్థ్ ను పెళ్లి చేసుకున్న తర్వాత తన కెరీర్ ఎలా ఉందనే విషయాన్ని అదితి వెల్లడించింది. రీసెంట్ గా జరిగిన ఓ ఇంటరాక్షన్ లో భాగంగా అదితి తన కెరీర్ గురించి మాట్లాడి హాట్ టాపిక్ గా మారింది. తనకు పెళ్లయ్యాక



పెద్దగా ఆఫర్లు రాలేదని, పర్సనల్ లైఫ్ లో పెళ్లి, పిల్లలు లాంటి మైల్ స్టోన్స్ తర్వాత హీరోయిన్లు రెగ్యులర్ గా ఎదుర్కొంటున్న ఛాలెంజెస్ గురించి అదితి మాట్లాడింది. అదితికి అందానికి అందం, టాలెంట్ కు టాలెంట్, భారీ సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్నప్పటికీ పెళ్లి తర్వాత తనకు ఆఫర్లు రాకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. అయితే అదితి అవకాశాలపై మాట్లాడటం ఇదేం మొదటిసారి కాదు, గతంలో కూడా ఓ సారి అదితి ఈ విషయంపై మాట్లాడింది. కాకపోతే అప్పుడు హీరామండి సినిమాలో తన పాత్రకు వచ్చిన గుర్తింపు చూశాక వరుస అవకాశాలు క్యూ కడతాయనుకుంటే అసలు ఆఫర్లే కరువయ్యాయని కామెంట్ చేసింది. ఇప్పుడు పెళ్లయ్యాక ఆఫర్లు రావడం లేదంటోంది. ఏదేమైనా ఈ విషయంలో అదితి మాట్లాడిన తర్వాత ఇండస్ట్రీలో పెళ్లయ్యాక హీరోయిన్లను చూసే విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536